అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

సమగ్ర తెలుగు దినపత్రిక

సోమవారం 25-9-2023

సంపుటి : 9 | సంచిక : 215 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

ఉచిత వైద్యంలో కేరళ అగ్రస్థానం

- జాతీయస్థాయిలో రెండు అవార్డులు



తిరువనంతపురం : దేశంలోనే ఉచిత వైద్యం అందించడంలో అగ్రస్థానంలో ఉన్న రాష్ట్రంగా కేరళకు 2023 ఆరోగ్య మంథన్ అవార్డు లభించింది. రాష్ట్రంలోని కారుణ్య ఆరోగ్య సకారుక్య పథకం (సీఎఎస్‌పీ) వినియోగానికి సంబంధించి ఈ అవార్డును కైవసం చేసుకుంది. ఏబీపీఎంజెఎవై వార్షిక వేడుకలకు సంబంధించి నేషనల్ హెల్త్ అథారిటీ ఆరోగ్యమంతన్ 2023 అవార్డులు ప్రకటించింది. దృష్టి లోపం ...11లో

అన్నింట్లోనూ గెలుస్తాం

మేం దేశం కోసం పోరాడుతున్నాం

- అందుకే ప్రతిపక్ష కూటమికి ఇండియా అని పేరుపెట్టాం
- బీజేపీ ఎత్తుగడలు సాగనీయం : కాంగ్రెస్ నేత రాహుల్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఈ ఏడాది చివర్లో జరగనున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుస్తుందని ఆ పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికిప్పుడు చెప్పాల్సి వస్తే, తెలంగాణలో గెలిచే అవకాశం ఉందని, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో తప్పనిసరిగా గెలుస్తామని, రాజస్థాన్‌లోనూ గెలుపునకు చాలా దగ్గర్లో ఉన్నామని అన్నారు. పార్టీ విజయం సాధిస్తుందని విశ్వసిస్తోందన్నారు. తెలంగాణలోబీజేపీ రేసులో కూడా లేదని, దాని పని అయిపోయిందని పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీ పూర్తిగా బలహీనపడిందని అన్నారు. ఆదివారం అసోంలోని ప్రతిదిన్ మీడియా నెట్‌వర్క్ నిర్వహించిన కన్‌క్లేవ్‌లో రాహుల్ గాంధీ మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మంచి ఫలితాలు సాధిస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించడం, కాంగ్రెస్ పార్టీ తమ వాదనను చెప్పుకునే అవకాశం ఇవ్వకపోవడంతోనే బీజేపీ గెలుస్తూ వచ్చిందని అన్నారు. కర్నాటక ఎన్నికల్లో విజయం సాధించడంతో కాంగ్రెస్ పార్టీ ఈ విషయాన్ని గ్రహించిందని చెప్పారు. ప్రజలతో నేరుగా మమేకం కావడానికే తాము భారత్ జోడో యాత్ర చేపట్టాల్సి వచ్చిందని, యాత్రను తప్పుదారి పట్టించాలని జాతీయ మీడియా, బీజేపీ ప్రయత్నం చేసినప్పటికీ వారి ప్రయత్నాలు ఫలించలేదని చెప్పారు. బీఎస్‌పీ ఎంపీపై దాడి ...11లో

"చంద్రయాన్-3 విజయాన్ని దేశం మొత్తం సంబరాలు చేసుకుంటున్నది. అయితే దాని లాంచ్ ప్యాడ్‌ను తయారు చేయడానికి తమ రక్తాన్ని, చెమటను అందించిన ఇంజినీర్లు, సాంకేతిక నిపుణుల సంగతేంటి? హెచ్ఈసీ లాంచ్ ప్యాడ్‌ను అందించలేదని ఎవరైనా వాదిస్తే వారు అబద్ధం చెప్పున్నట్టే. మేము చంద్రయాన్-3 కోసం ఉపయోగించిన లాంచ్ ప్యాడ్‌ను తయారు చేశాం. కానీ ఇప్పటికీ మా జీతం కోసం ఎదురుచూస్తున్నాము" ఇది ప్రతిష్టాత్మకమైన ఓ ప్రభుత్వరంగసంస్థ ఉద్యోగుల ఆవేదన. శాస్త్ర,సాంకేతిక రంగాల్లో దేశాభివృద్ధికి పాటుపడుతున్న వీరి ఈ దుస్థితి దేనికి సూచిక..? 'బలమైన ప్రధాని' 'బలమైన ప్రభుత్వం' అని చెప్పుకుంటున్న వారు దీనికి ఏం సమాధానం చెపుతారు...?



జీతాల్లేవ్

20 నెలలుగా ప్రభుత్వరంగసంస్థ హెచ్ఈసీ ఉద్యోగుల దుస్థితి

- పూట గడవటం కోసం కూలీ పనులకు వెళ్తున్న వైనం
- ఇస్రోకు పరికరాలను ఉత్పత్తి చేయటంలో వీరు కీలకం
- చంద్రయాన్-3 లాంచ్‌ప్యాడ్ నిర్మాణంలోనూ భాగం
- ప్రస్తుతం వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు
- మోడీ సర్కారు తీరుపై ఉద్యోగులు, కార్మికుల అసంతృప్తి

న్యూఢిల్లీ : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రోకు అనేక పరికరాలను అందించిన హెవీ ఇంజనీరింగ్ కార్పొరేషన్(హెచ్ఈసీ)కి చెందిన సాంకేతిక నిపుణులు, ఇంజనీర్‌లతో సహా సుమారు 3,000 మంది ఉద్యోగుల జీవితాలు కఠినంగా మారాయి. 20 నెలలుగా వారికి వేతనాలు అందటం లేదు. ఇప్పుడు వారు పూట గడవటం కోసం తినుబండారాలు, వస్త్రాలు అమ్మటం, ఆటోరిక్షాలు నడపడంతో సహా ఇతర రోజువారీ వేతన కార్మికులుగా పనిచేయాల్సి వస్తున్నది.

హెచ్ఈసీ అనేది అన్ని ప్రధాన ఉక్కు కర్మాగారాలకు పరికరాలను సరఫరా చేసే భారతదేశపు పురాతన ప్రభుత్వ రంగ యూనిట్. ఇది.. బొకారో, భిలాయ్, రూర్కెలా, విశాఖపట్నం, దుర్గాపూర్‌లోని ప్లాంట్‌లతో సహా భారతదేశం అంతటా అనేక ప్రధాన ఉక్కు కర్మాగారాల అభివృద్ధికి దారితీసింది. హెచ్ఈసీ మూడు విభాగాలను కలిగి ఉన్నది. అవి.. హెవీ మెషిన్ టూల్స్ ప్లాంట్(హెచ్ఎంటీపీ), హెవీ మెషీన్స్ బిల్డింగ్ ప్లాంట్(హెచ్ఎంబీపీ), ఫౌండ్రీ ఫోర్జ్ ప్లాంట్(ఎఫ్ఎఫ్‌పీ). ఇవి సంయుక్తంగా పరికరాలను తయారు చేస్తాయి.

అలాంటి ప్రతిష్టాత్మకమైన సంస్థలో ...11లో

దుస్తులు విక్రయిస్తూ..



1993 నుంచి హెచ్ఈసీలో పనిచేస్తున్న దేవేంద్ర కుమార్.. పాత విధానసభ సమీపంలోని షాలిమార్ బజార్‌లో గంచా (టవల్స్), లేడీస్ గార్మెంట్స్‌తో సహా రెడీమేడ్ దుస్తులను విక్రయించవల్సి వస్తున్నది. ఇప్పటికీ హెచ్ఎంబీపీలో పనిచేస్తున్న కుమార్ ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యాలయానికి హాజరవుతాడు. ఆ తర్వాత అతను బట్టల సేల్స్‌మెన్‌గా పని చేస్తాడు. కుమార్ రోడ్డు ప్రక్కన ఒక తాత్కాలిక దుకాణాన్ని నడుపుతున్నాడు. బీహార్‌లోని నలంద జిల్లాకు చెందిన ఈ కుమార్ మాట్లాడుతూ.. "సాధారణ జీతం లేకుండా జీవించడం చాలా కష్టం. రాంచీలో డిగ్రీ కోర్సులు చదువుతున్న నా ముగ్గురు పిల్లల చదువుకు నేను తోడ్పాటు అందించలేకపోతున్నాను. నా పెద్ద కొడుకు మెడిసిన్ చదవాలనుకున్నాడు. కానీ అతని అడ్మిషన్ కోసం మా దగ్గర డబ్బు లేదు. మేము ఆర్థికంగా చితికిపోవటంతో ఎవరూ మాకు డబ్బు ఇవ్వని పరిస్థితి ఏర్పడింది" అని అన్నారు.

కుటుంబంతో మోమోస్ అమ్ముతూ..



మరొక హెచ్ఈసీ ఉద్యోగి అజయ్ మిర్ధా మోమోస్‌లను అమ్ముతున్నాడు. అతని కుటుంబం మొత్తం ఈ చిరువ్యాపారంలో నిమగ్నం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. అతను సాయంత్రం 5 గంటలకు ఆఫీసు నుంచి తిరిగి వచ్చిన తర్వాత సాయంత్రం మోమోలు అమ్ముతాడు. "మేము ఎప్పుడైనా మా గుర్తింపును దాచడానికి ప్రయత్నిస్తాము. ఎందుకంటే నేను భారతదేశపు పురాతన ప్రభుత్వ రంగ సంస్థలో పని చేస్తున్నాను. ఇప్పటికీ మోమోలను విక్రయించవలసి వస్తుంది అని ప్రజలకు తెలిస్తే అది చాలా అవమానకరం. భారత ప్రభుత్వం మా బాధను అర్థం చేసుకుని మా జీతాలను విడుదల చేస్తుందని నేను ఇప్పటికీ ఆశిస్తున్నాను" అని మిర్ధా చెప్పటం గమనార్హం.

కూలీగా అశోక్ రామ్



హెచ్ఈసీకి చెందిన మరో ఉద్యోగి అశోక్ రామ్.. ధ్రువ ప్రాంతంలో రోజువారీ కూలీగా మారాడు. అతనికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. రామ్, అతని భార్య యశోదా దేవి రోజువారీ కూలీలుగా పని చేస్తూ రోజుకు రూ.450 సంపాదిస్తున్నారు. "నా పిల్లలు ఒక ప్రయివేటు స్కూల్‌లో చదివేవారు. నేను వారి ఫీజులను భరించలేక వారిని జగన్నాథ్‌పూర్ రాజకీయ మాధ్యమిక పాఠశాలకు మార్చవలసి వచ్చింది"అని అశోక్ రామ్ చెప్పారు.

ఉపాధ్యాయుల అరెస్ట్

- ప్రగతిభవన్ ముట్టడి యత్నం
- 317 జీవో రద్దు చేయాలని డిమాండ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

స్థానికతకు అడ్డుగా ఉన్న 317 జీవోను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిభవన్ ముట్టడికి ప్రయత్నించిన ఉపాధ్యాయులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం జీవో రద్దు డిమాండ్‌తో ఉపాధ్యాయులు ఒక్కసారిగా ప్రగతిభవన్ ముట్టడికి బయల్దేరారు. గమనించిన పోలీసులు ఎక్కడివారిని అక్కడే అరెస్టులు చేసి, గోషామహల్ పోలీస్ స్టేడియంకు తరలించారు. దీంతో ఉపాధ్యాయులు అక్కడే తమ ఆందోళన కొనసాగిస్తున్నారు. రాత్రి పొద్దు పోయిన తర్వాత సెల్‌ఫోన్ లైట్ల వెలుగులో 317 జీవో రద్దు డిమాండ్ చేస్తూ నినాదాలు చేస్తున్నారు. 317 జీవో కారణంగా తాము స్థానికత కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర జిల్లాల్లో ఉద్యోగాలు చేయడం వల్ల కుటుంబ సభ్యులకు దూరంగా ఉండాల్సి వస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ జోక్యం చేసుకుని, తమకు సొంత జిల్లాల్లో పోస్టింగులు ఇవ్వాలని కోరారు.




జీవో 317 బాధితుల సమస్యను పరిష్కరించాలి : టీఎస్‌యూటీఎఫ్

వివరాలు 2లో

ప్రగ్యాన్.. విక్రమ్ సిగ్నల్స్ కట్

మరో 14 రోజులు వేచి చూడనున్న ఇస్రో



న్యూఢిల్లీ : విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్‌లను చంద్రుడిపై అక్టోబర్ 6న వచ్చే సూర్యాస్తమయం వరకు పునరుజ్జీవింపజేసే ప్రయత్నాలను కొనసాగిస్తుందని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) శాస్త్రవేత్తలు తెలిపారు. పరికరాలతో సంప్రదింపులు ఎప్పుడు పునరుద్ధరింపబడతాయో ఖచ్చితంగా తెలియదని ఇస్రో చైర్మన్ ఎస్. సోమనాథ్ తెలిపారు. "అది ఎప్పుడు మేల్కొంటుందో మాకు తెలియదు. అది రేపు కావచ్చు, లేదా చాంద్రమాన దినం చివరి రోజు కూడా కావచ్చు. కానీ మేము ప్రయత్నిస్తున్నాము. ల్యాండర్, రోవర్ మేల్కొంటే అది గొప్ప విజయం అవుతుంది" అని సోమనాథ్ అన్నారు. కానీ, చంద్రుని రోజు పెరుగుతున్న కొద్దీ, చంద్రుని ఉపరితలంపై ఉష్ణోగ్రతలు పెరిగేకొద్దీ, పునరుజ్జీవనానికి అవకాశం కూడా పెరుగుతుందని శాస్త్రవేత్తలు ...11లో

కాచిగూడ - యశ్వంత్‌పూర్‌కు వందేభారత్

- తొమ్మిది రైళ్లను జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని



నవతెలంగాణ- హైదరాబాద్ బ్యూరో

కాచిగూడ- యశ్వంత్‌పూర్ (20703) వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సహ తొమ్మిది రైళ్లను.. ప్రధాని మోడీ ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. కాచిగూడ రైల్వే స్టేషన్‌లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రైల్వే సిబ్బంది, ప్రయాణికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ రైలు రెగ్యులర్ సర్వీసులు ఈనెల 25న ...11లో

బ్రిజ్ భూషణ్ వేధింపులు నిజమే

- రెజ్లర్లపై అనైతిక చర్యలకు ఏ అవకాశాన్నీ వదల్లేదు
- అన్నింటికీ ఆధారాలున్నాయి: ఢిల్లీ పోలీసులు



న్యూఢిల్లీ : భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ చీఫ్, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ సింగ్ మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించేందుకు ఏ ఒక్క అవకాశాన్నీ వదులుకోలేదని ఢిల్లీ పోలీసులు ఆదివారం కోర్టుకు తెలిపారు. ఆయనపై అభియోగాలకు తగిన ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల కేసులో బ్రిజ్‌భూషణ్ పై ఢిల్లీలోని రోజ్ అవెన్యూ కోర్టులో విచారణ కొనసాగుతోంది. తజకిస్తాన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో నిందితుడు ఫిర్యాదుదారు (మహిళా రెజ్లర్)ని గదిలోకి పిలిచి ...11లో

చంద్రబాబు రిమాండ్ పొడిగింపు

అక్టోబరు 5వరకు జైల్లోనే .. ఏసీబీ కోర్టు



విజయవాడ: టీడీపీ అధినేత చంద్రబాబు రెండ్రోజుల సీఐడీ కస్టడీ, రిమాండ్ ముగియడంతో ఆదివారం...విజయవాడ ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ఆన్‌లైన్ ద్వారా విచారణ చేపట్టారు. చంద్రబాబు రిమాండ్ పొడిగించాలని సీఐడీ అధికారులు కోరగా.. అక్టోబరు 5వరకు పొడిగిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. చంద్రబాబు రెండ్రోజుల సీఐడీ కస్టడీ ముగిసిన తరువాత రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచే వర్చువల్‌గా న్యాయమూర్తి ఎదుట హాజరు పర్చారు."విచారణ సందర్భంగా సీఐడీ అధికారులు ...11లో

బీజేపీ నేతల రహస్య భేటీ

- పలువురు మాజీ ఎంపీల హాజరు!
- ఏకపక్ష నిర్ణయాలపై అధిష్టానానికి ఫిర్యాదు

కిషన్‌రెడ్డి వద్దు...బండికి పగ్గాలివ్వండి

- బూత్ కన్వీనర్ల నుంచి అధిష్టానానికి ఊహించని షాక్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ సీనియర్ నేతలు హైదరాబాద్ శివారులోని ఓ ఫామ్‌హౌజ్‌లో రహస్యంగా భేటీ అయ్యారు. ఇలా ఆ పార్టీ అసంతృప్త నేతలు వరుసగా భేటీ కావడం మూడోసారి. ఆ సమావేశానికి హాజరైన వారిలో సీనియర్ నేతలతో పాటు పలువురు మాజీ ఎంపీలు కూడా ఉన్నట్టు తెలిసింది. వారంతా బీజేపీలో తాజాగా జరుగుతున్న పరిణామాలపై చర్చించినట్టు సమాచారం. బీజేపీ రాష్ట్ర శాఖలో కీలక పదవిలో ఉన్న ఇద్దరు ముగ్గురు నేతలు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే అభిప్రాయానికి ఆ సీనియర్ నేతలు వచ్చారు. ఆయా పార్టీల్లో ఓ వెలుగు వెలిగిన తాము ఏదో ఆశించి బీజేపీలో చేరితే కనీస గౌరవం కూడా దక్కట్లేదని వాపోయినట్టు తెలిసింది. తాడోపేడో తేల్చుకునేందుకు వారంతా ఢిల్లీ వెళ్లాలని కూడా నిర్ణయం చేసినట్టు సమాచారం. జాతీయ నాయకత్వం నుంచి కూడా భరోసా లభించని పక్షంలో వారంతా మూకుమ్మడిగా కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లే యోచనలో ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు కూడా వారితో చర్చలు జరుపుతున్నట్టు తెలిసింది.

రాష్ట్ర అధ్యక్షులుగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వద్దు...జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌ని తిరిగి నియమించడంటూ బీజేపీలో ధిక్కార స్వరం మొదలైంది. ఈ నెల 25న దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ జయంతి ఉంది. దానిని పురస్కరించుకుని బూత్‌ల వారీగా నివాళులు అర్పించడంతో పాటు ప్రతి కార్యకర్తా రెండు మొక్కలు నాటాలని బీజేపీ నిర్ణయం తీసుకున్నది. అందులో భాగంగా బూత్ కమిటీ బాధ్యులకు రాష్ట్ర కార్యాలయం నుంచి అధిష్టానం ఫోన్లు చేయిస్తున్నది. ఆ సందర్భంగా పార్టీ గ్రాఫ్ పడిపోతుండటంపై బూత్ బాధ్యులు ఆందోళన వ్యక్తం చేస్తూ షాకింగ్ సమాధానాలు ...11లో

రుణమాఫీ.. లేదు సాఫీ



అక్షరం తేడా ఉన్నా అంతేసంగతులు..!

- లోన్ అకౌంట్ నెంబర్ మారినా వర్తించట్లే..!
- బంగారం తాకట్టు రుణాల ఊసేలేదు..
- రైతుల రుణమాఫీలో కొర్రీలు

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ పథకం సాఫీగా సాగట్లేదు. 2018 ఎన్నికల హామీగా ఇచ్చిన ఈ రుణమాఫీపై ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదు. అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామన్న హామీని ఐదేండ్ల పాటు సాగదీస్తూ వచ్చిన ప్రభుత్వం ఇప్పటికీ అదే ధోరణి ప్రదర్శిస్తోంది. సాంకేతిక కారణాల పేరుతో వీలైనంత మంది అర్హులకు ఈ మాఫీ వర్తించకుండా చేయాలనే తాపత్రయమే బ్యాంకర్లలో కనిపిస్తోంది. అందుకే నానా రకాల కొర్రీలు పెడుతూ ఇబ్బందులు పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. అక్షరం తేడా ఉన్నా మాఫీ ఇవ్వట్లేదు. సేవింగ్ అకౌంట్ నంబర్లు స్థిరంగా ఉన్నా.. పాత బాకీ క్లియర్ చేసి కొత్తగా లోన్ తీసుకున్నప్పుడు బ్యాంకులు లోన్ అకౌంట్ నెంబర్లలో మార్పులు చేస్తాయి. లేదంటే లోన్ అకౌంట్ నంబర్లలో బ్యాంకు సిబ్బంది అవగాహన కోసం ఎస్టీలకు అంకెలతో పాటు ఇంగ్లీష్ అక్షరాలతోనూ లోన్‌నంబర్లు ఇస్తారు. ముఖ్యంగా సహకార సంఘాల్లో ఇలాంటి మార్పులు ఎక్కువగా ఉంటాయి. వీటిలో ఏది చోటుచేసుకున్నా 'కాదేదీ కొర్రీకి అనర్హం' అన్నట్టుగా బ్యాంకులు వ్యవహరిస్తున్నాయి. వీటిపై ప్రభుత్వం సీరియస్‌గా స్పందించకపోవడంతో 'బ్యాంకర్లు ఆడిందే ఆట.. పాడిందే పాట' అనే రీతిలో వ్యవహరిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

సాగుతూ.. ఉన్న రుణమాఫీ

రుణమాఫీ పథకం సాగుతూ ఉంది. సెప్టెంబర్ 15వ తేదీ నాటికి పూర్తి కావాల్సి ఉన్నా ఇప్పటికీ సగం మందికి ఈ రుణమాఫీ అమలు కాలేదు. రూ.వెయ్యి కోట్లు విడుదల చేశామని ప్రభుత్వం ప్రకటించినా ఖజానాలో వెసులుబాట్ల కోసం అన్వేషిస్తోంది. సాంకేతిక లోపాలను ...11లో

సోషల్‌మీడియా దుర్వినియోగం

- కాంగ్రెస్ తీరుపై కేరళ సీఎం విజయన్ ఆగ్రహం

తిరువనంతపురం : రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తున్నారని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శించారు.త్రికరిపూర్‌లో సీపీఐ(ఎం) నూతన కార్యాలయం ప్రారంభం సందర్భంగా శనివారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియాను అధికంగా వినియోగిస్తున్నారని, అయితే వినియోగించేటప్పుడు విజ్ఞతతో వ్యవహరించాలని అన్నారు. ఇతరులను వ్యక్తిగతంగా కించపరిచేలా మన చర్యలు ఉండకూడదని చెప్పారు. రాజకీయ ప్రత్యర్థులను వేధించేందుకు ప్రధాన మీడియాతోపాటు ప్రత్యేక ఏజన్సీలను కాంగ్రెస్ పార్టీ రాష్ట్రానికి తీసుకొచ్చిందని విమర్శించారు.



వాటి కోసం లక్షలాది రూపాయలను ఖర్చు చేస్తోందని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలవడంతో ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ, రాజకీయ ప్రత్యర్థుల ప్రతిష్ఠకు దిగజార్చేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. సోషల్ మీడియాలో వేధింపులకు పాల్పడేవారిని కనిపెట్టాలని సిపిఎం కార్యకర్తలకు ఆయన సూచించారు. ప్రభుత్వ అభివృద్ధి పథకాలు, కార్యక్రమాల గురించి విస్తృతంగా చర్చల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.

తిరువనంతపురంలోని పరశాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త అబిన్ కోడంకర ఫేస్ బుక్ పేజీలో సీపీఐ(ఎం) నేతల కుటుంబంలోని మహిళల ఫొటోలను అసభ్యకరంగా మార్పు చేసి పెట్టడంతోపాటు అవమానకర వ్యాఖ్యలు చేశాడు. దీంతో, శుక్రవారం పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై సీఎం విజయన్ స్పందిస్తూ.. ఇటీవల విచారణలో భాగంగా ఓ కాంగ్రెస్ నేతను పోలీసులు అరెస్ట్ చేశారని చెప్పారు. రాజకీయ ప్రత్యర్థులపై దాడి చేయడానికి లక్షలాది రూపాయలను ఖర్చు చేస్తూ.. సోషల్‌మీడియాను ఎలా దుర్వినియోగం చేస్తున్నారో తాజా ఘటన ద్వారా వెల్లడైందని చెప్పారు.

బీజేపీ ఎంపీ బిధూరిపై అనర్హత

- ముస్లిం సంఘాల డిమాండ్

న్యూఢిల్లీ : బీజేపీ ఎంపీ రమేష్ బిధూరిపై అనర్హత వేటు వేయాలని దేశంలోని ప్రముఖ ముస్లిం సంఘాలు పిలుపునిచ్చాయి. పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశాయి. బహుజన సమాజ్ పార్టీ ఎంపి దనీష్ అలీపై బిదూరి లోక్‌సభలో చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించాయి. ముస్లిములపై విద్వేషానికి ఈ వ్యాఖ్యలు నిదర్శనమని పేర్కొన్నాయి. పార్లమెంటులో ముస్లిం సభ్యులపై ఇటువంటి పదజాలాన్ని ప్రయోగించడంతో ప్రజాప్రతినిధిగా ఎన్నికైన ముస్లిం సభ్యులకు కూడా భద్రత లేదని స్పష్టమౌతోందని జమియత్ ఉలమా - ఇ- హింద్ అధ్యక్షుడు అర్షద్ మదానీ మీడియాతో పేర్కొన్నారు. అటువంటి సభ్యులపై చర్యలు తీసుకోవడం స్పీకర్ రాజ్యాంగ, నైతిక బాధ్యత అని అన్నారు. తాజా వ్యాఖ్యలు ముస్లింల పట్ల వ్యక్తమౌతున్న విద్వేషానికి నిదర్శమని చెప్పారు.

రమేష్ బిధూరి వ్యాఖ్యలు ద్వేషపూరిత నేరానికి సమానమని, పార్లమెంట్ సభ్యుని హక్కులకు తీవ్ర భంగం కలిగించారని జమియత్ ఉలమా -ఇ- హింద్ విమర్శించింది. నేరస్తులు, సామాజిక వ్యతిరేక వ్యక్తులు మాత్రమే నిర్దిష్ట సమాజంలోని సభ్యులను కించపరిచేందుకు ఇటువంటి అభ్యంతరకరమైన పదాలను ప్రయోగిస్తారని పేర్కొంది. అధికారంలో ఉన్నవారు కుకీలు, ముస్లింలు, దళితులు, ఆదివాసీలపై విద్వేషాన్ని పెంచిపోషిస్తున్నారని, ఇదే ఇప్పుడు బహిర్గతమైందని స్పష్టం చేసిందని తెలిపింది. రమేష్ బిధూరిపై చర్యలు చేపట్టకపోవడం ఈ చర్యలు సాధారణమేననే సందేశాన్ని పంపుతోందని, పరస్పర గౌరవం, పరమత సహనం విలువలను దెబ్బతీస్తోందని పేర్కొంది. రమేష్ బిధూరి వ్యాఖ్యలు బీజేపీ సిద్ధాంతానికి అనుకూలంగా వుండవచ్చని, కానీ రాజ్యాంగం, పార్లమెంటరీ విధానాలకు వ్యతిరేకమని వెల్ఫేర్ పార్టీ అధ్యక్షుడు ఎస్‌క్యూఆర్ ఇలియాస్ మండిపడ్డారు. అతనిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ అధ్యక్షుడు జెపి నడ్డాను కోరారు.

నో కామెంట్స్ : బిధూరి

పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ రమేష్ బిధూరి నోరుమెదపడం లేదు. ఆదివారం ఆయనను ఎన్‌డీ టీవీ సంప్రదించగా... 'నో కామెంట్స్, స్పీకర్ ఈ అంశాన్ని పరిశీలిస్తున్నారు' అని మాత్రమే వ్యాఖ్యానించారు.



వికలాంగుల సమస్యలపై దేశవ్యాప్త ఉద్యమం

ఎన్పీఆర్డీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం మురళీధరన్

వికలాంగుల సమస్యలపై దేశవ్యాప్త ఉద్యమం చేపడతామని ఎన్పీఆర్డీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం. మురళీధరన్ పేర్కొన్నారు. ఆదివారం నాడిక్కడ హరి కిషన్ సింగ్ సూర్జిత్ భవన్ లో ఎన్పీఆర్డీ కేంద్ర కమిటీ సమావేశం సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నంబురాజన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై దేశ వ్యాప్త ఉద్యమాలు ఉధృతం చేయాలని సమావేశం తీర్మానించింది. ఈ సందర్భంగా ఎం. మురళీధరన్ మాట్లాడుతూ దేశ జనాభాలో 10-15 శాతం మంది వికలాంగులు ఉన్నారని తెలిపారు. పాలకులు అనుసరిస్తున్న విధానాల వల్ల వికలాంగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-6లో వికలాంగుల వివరాలు సేకరించకూడదని కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయించడం సరైంది కాదని విమర్శించారు. డిపార్ట్మెంట్ ఆఫ్ ఎంపవర్మెంట్ పర్సన్ విత్ డిజేబులిటీ 2021- 22 వార్షిక రిపోర్ట్ ప్రకారం 67,09,894 మందికి యుడీఐడీ కార్డులు జారీ చేశారని తెలిపారు. దేశవ్యాప్తంగా 1,74,25,094 మందికి వైకల్య ధ్రువీకరణ పత్రాలు ఇస్తే అందరికీ ఎందుకు యుడీఐడీ కార్డు జారీ చేయలేదని ప్రశ్నించారు. పాఠశాలలకు వెళ్తున్న వైకల్యం కలిగిన విద్యార్థులను గుర్తించేందుకు ప్రతి ఐదేండ్లకు ఒకసారి సర్వే చేయాలని 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం సెక్షన్ 17(ఏ) పేర్కొందని, దేశంలో ఎక్కడా కూడా ఇలాంటి సర్వేలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ, అంగన్వాడీ, ఆశా వర్కర్లతో వికలాంగుల వివరాలను సేకరిస్తే వికలాంగుల సమగ్ర సమాచారం దొరుకుతుందని, అప్పుడే వికలాంగులు ప్రభుత్వాలు అందిస్తున్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడానికి ఉపయోగపడుతుందని అన్నారు. వికలాంగుల కోసం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాల్లో అక్రమాలు జరుగుతున్నాయని, ఆర్థిక నిర్వహణ అమలు చేయడంలో పర్యవేక్షణ చేయడంలో వికలాంగుల సంక్షేమ శాఖ విఫలం చెందుతుందని కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ రిపోర్ట్ వెల్లడించిందని గుర్తు చేశారు. వికలాంగుల పెన్షన్ నిధులను ప్రధానమంత్రి ఆవాస్ యోజన వంటి అనేక పథకాల ప్రచారానికి వినియోగిస్తున్నారని విమర్శించారు.

జమ్మూ కాశ్మీర్, గోవా, బీహార్ రాష్ట్రాలలో రూ. 2.83 కోట్లు ప్రభుత్వ ప్రచారం కోసం వినియోగించారని తెలిపారు. జీ20 సమావేశాల్లో వికలాంగుల గురించి చర్చిస్తామని ప్రకటించారని, కానీ జీ20 సమావేశంలో ఆమోదించిన డాక్యుమెంట్లో ఎక్కడ కూడా వికలాంగుల ప్రస్తావన లేదని దుయ్యబట్టారు. వికలాంగులను స్థానిక సంస్థలకు నామినేటెడ్ చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వికలాంగుల కోసం ఉన్న అనేక చట్టాలను అమలు చేయడం లేదని విమర్శించారు. దేశవ్యాప్తంగా నడుస్తున్న రైల్వేలలో వికలాంగుల రాయితీ పాసులను అనుమతించడం లేదని తెలిపారు. రైల్వే శాఖ తమ వైఖరి మార్చుకోకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఉపాధి హామీ పథకంలో ప్రతి వికలాంగునికి జాబ్ కార్డు జారీ చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర ప్రభుత్వం ఆదేశించాలని డిమాండ్ చేశారు. వికలాంగులందరికీ అంత్యోదయ రేషన్ కార్డులు ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్లాగ్ పోస్టుల భర్తీ కోసం ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాజకీయ పార్టీలన్నీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో వికలాంగుల సంక్షేమంపై నిర్దిష్టమైన హామీలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. హక్కుల సాధన కోసం దేశవ్యాప్తంగా జరిగే ఉద్యమాలలో వికలాంగులంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షులు ఎం అడివయ్య, ఝాన్సీ రాణి, అనిర్బన్ ముఖర్జీ, సహాయ కార్యదర్శి సమ్య గంగూలీ, కోశాధికారి చక్రవర్తి జాతీయ కమిటీ సభ్యులు ఆర్. వెంకటేష్, జర్కోని, రాజు, సాయమ్మ, రాజన్, రంగప్ప దాసర్, జీవ, భారతీ అన్న, ధర్మేంద్రలతో పాటు వివిధ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

దళితులపై పెరుగుతున్న దాడులు

- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అధికం
- రాజ్యాంగ రక్షణ కోసం దేశవ్యాప్త ఉద్యమం : దళిత్ సమ్మిట్ రౌండ్ టేబుల్‌లో వక్తలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై దాడులు, దౌర్జన్యాలు రెట్టింపయ్యాయని దళిత్ సమ్మిట్ రాష్ట్రస్థాయి రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు అభిప్రాయపడ్డారు. దళితులకు రక్షణ కవచంలా ఉన్న రాజ్యాంగాన్ని కేంద్రం ప్రభుత్వం రద్దు చేసేందుకు కుట్రలు చేస్తుందని విమర్శించారు. దళితులకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల పరిరక్షణ, ప్రభుత్వ రంగ సంస్థల సంరక్షణ కోసం దేశవ్యాప్త విశాల ఐక్య ఉద్యమం నిర్మించాలని చెప్పారు. ఆదివారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రం షోయబ్ హాలులో భారత్ ఖేత్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల మల్లేష్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు తీర్మానం ప్రవేశపెట్టారు. అక్టోబర్ రెండోవారంలో రాష్ట్ర సదస్సు నిర్వహించి, డిసెంబర్ నాల్గవ తేదీ చలో ఢిల్లీకి తరలి వెళ్లాలని తీర్మానంలో ప్రతిపాదించారు బీకేఎంయు రాష్ట్ర కార్యదర్శి బాలమల్లేష్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వందలాది సంఘాలను ఐక్యం చేసే విధంగా దళిత సమ్మిట్ కృషిచేస్తుందన్నారు ఏఐఏడబ్ల్యూయూ రాష్ట్ర కార్యదర్శి ఆర్ వెంకట్రాములు మాట్లాడుతూ దళితుల భూమి సమస్యను ఎజెండాగా మార్చే ప్రయత్నం జరుగుతున్నదని చెప్పారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ మాట్లాడుతూ దళితులపై జరుగుతున్న దాడులపై రాజకీయాలకతీతంగా ఐక్యం కావాలన్నారు. డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో దళిత బంధు అమలులో అనేక అక్రమాలు, అవకతవకలు



జరుగుతున్నాయనీ, ఒకే యూనిట్ కింద ఐదు నుంచి పది పంచుతున్నారని చెప్పారు. సమావేశంలో పీపుల్స్ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ పీ శివలింగం, మాల సంక్షేమ సంఘం అధ్యక్షులు భక్తుల రాంప్రసాద్ బుడగ జంగాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కడమంచి రాంబాబు, పంచాయతీ రాజ్ విశ్రాంత అధికారి ఇరిగి నరసింగరావు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, బీకేఎంయు రాష్ట్ర అధ్యక్షులు కాంతయ్య, కేవీపీఎస్ రాష్ట్ర నాయకులు ఎమ్ దశరథ్, ఎమ్ బాలపీరు, డీబీఎఫ్ రాష్ట్ర నాయకులు పులి కల్పన, చుంచు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. సమావేశం తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది.

జీవో 317 బాధితుల సమస్యను పరిష్కరించాలి : టీఎస్‌యూటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జీవో 317 బాధితుల సమస్యలను పరిష్కరించాలని టీఎస్‌యుటీఎఫ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం టీఎస్‌యుటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ జీవో కారణంగా స్థానికతను కోల్పోయి ఇతర జిల్లాలకు బలవంతంగా బదిలీ అయిన ఉపాధ్యాయులు గత రెండేండ్లుగా మొరపెట్టుకుంటున్నా, ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 22 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ డిఎస్సీకి 5089 పోస్టులు మాత్రమే నోటిఫై చేశారని తెలిపారు. గనుక మిగిలిన ఖాళీల్లో వీరిని బదిలీ చేసే వీలుందని సూచించారు. ప్రభుత్వం 317 అమలు వలన స్థానికత కోల్పోయిన వారిని, స్పౌజ్ ఉపాధ్యాయులందరినీ బదిలీ చేసి సమస్యకు ముగింపు పలకాలని కోరారు. ఆదివారం తమ గోడు చెప్పుకోవటానికి ప్రగతి భవన్ వద్దకు వచ్చిన ఉపాధ్యాయులను అరెస్ట్ చేసి పొద్దుపోయేవరకు పోలీసు స్టేషన్లోనే నిర్బంధించటాన్ని వారు ఖండించారు.

ఇది 'ద్వంద్వ ప్రమాణాల' ప్రపంచం : ఎస్ జైశంకర్

- మార్పును ప్రతిఘటిస్తున్న ప్రభావంతమైన దేశాలు

న్యూయార్క్ : ప్రస్తుత ప్రపంచం 'ద్వంద్వ ప్రమాణాలు' ప్రపంచమని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వాఖ్యానించారు. కొన్ని ప్రభావంతమైన స్థానాల్లో ఉన్నదేశాలు మార్పు కోసం జరుగుతున్న పోరాటాన్ని ప్రతిఘటిస్తున్నాయని అన్నారు. ఐక్యరాజ్య సమితి భారతదేశం, ఐక్యరాజ్యసమితిలోని భారత శాశ్వత మిషన్ ఏర్పాటు చేసిన ఒక మంత్రుల సమావేశంలో జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు.

'రాజకీయ సంకల్పం కంటే ఇక్కడ మార్పు కోసం రాజకీయ ఒత్తిడి ఉండాలని నా ఆలోచన' అని జైశంకర్ చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న మనోభావాలను దక్షిణాసియా ప్రతిబింబిస్తుందని, అయితే ఇదే సమయంలో ఇక్కడ రాజకీయ ప్రతిఘటనలు కూడా ఉన్నాయని అన్నారు. 'ప్రపంచంలో ప్రతిభావంతమైన స్థానాల్లో ఉన్న దేశాలు మార్పు కోసం జరుగుతున్న పోరాటాన్ని ప్రతిఘటిస్తున్నారు. ఐరాస భద్రతా మండలిలో దీన్ని మనం ఎక్కువగా చూడవచ్చు' అని చెప్పారు.

ఉత్పత్తి పెరిగినా దిగిరాని ఆహార ధరలు

ప్రభుత్వ తప్పుడు విధానాలే కారణం

- నామమాత్రపు చర్యలతో సరి
- ధరాఘాతంతో సామాన్యుల జేబుకు చిల్లులు

న్యూఢిల్లీ : ఆహార ధాన్యాలకు సంబంధించి దేశంలో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. బియ్యం, గోధుమల ఉత్పత్తి అధిక స్థాయిలో జరుగుతోంది. పప్పు ధాన్యాల దిగుబడి కూడా ఎక్కువగానే ఉంటోంది. కందుల ఉత్పత్తి కొంచెం తక్కువగా ఉన్నప్పటికీ మొత్తంగా పప్పు ధాన్యాల ఉత్పత్తి రికార్డు స్థాయిలోనే ఉంది. మరోవైపు ధరల నియంత్రణ కోసం కేంద్ర ప్రభుత్వం ఎగుమతులపై ఆంక్షలు విధిస్తోంది. ప్రభుత్వం తాను సేకరించిన గోధుమలలో అధిక భాగాన్ని బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తోంది. పరిస్థితి ఇంత ఆశాజనకంగా ఉన్నప్పటికీ బియ్యం, గోధుమలు, పప్పుల ధరలు మాత్రం సామాన్యుడికి అందుబాటులో ఉండకుండా అతని కుటుంబ బడ్జెట్‌కు తూట్లు పొడుస్తున్నాయి.

ఆహార ధాన్యాల ధరలు ఆకాశాన్ని తాకుతుంటే వాటిని భూమికి దించేందుకు ప్రభుత్వం మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఇది చాలా ఆందోళన కలిగించే విషయం. ఈ సంవత్సరం చివరలో ఐదు రాష్ట్రాల శాసనసభలకు, వచ్చే సంవత్సరంలో లోక్‌సభకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ ఎన్నికలలో ఓటర్ల మెప్పు పొందాలంటే ప్రభుత్వం ఆహార ధరలను నియంత్రించక తప్పదు. ఓ వైపు రైతులకు కనీస మద్దతు ధర లభించేలా చూడడంతో పాటు మరోవైపు ఆహార ధరలను తగ్గించేందుకు ప్రభుత్వం ప్రభుత్వం ఏం చేస్తుందన్నదే ప్రశ్న.


ఆకాశాన్ని తాకుతూ...


ప్రభుత్వం విడుదల చేసిన వినియోగ ధరల సూచిక అందించిన సమాచారం ప్రకారం ఆగస్టులో ఆహార ద్రవ్యోల్బణం కొంతమేర తగ్గింది. అయితే గత కొన్ని సంవత్సరాలుగా ధరల నికర పెరుగుదల భరించలేని స్థాయిలో ఉంటోంది. ఉదాహరణకు 2019 సెప్టెంబర్ 21-2023 సెప్టెంబర్ 21 మధ్య కాలంలో బియ్యం ధరలు అనేక రెట్లు పెరిగాయి. అదే సమయంలో గోధుమ ధరలు 13%, అట్టా ధరలు 25% పెరిగాయి. ఇక పప్పుల విషయానికి వస్తే కందిపప్పు ధర ఏకంగా 73%, మినపప్పు ధర 60%, ఎర్ర కందిపప్పు ధర 49% పెరిగింది. వంట నూనెలు, పాలు, చివరికి ఉప్పు ధర కూడా పెరిగిపోయింది. ఒక్క మాటలో చెప్పాలంటే ఆహారంపై ఓ కుటుంబానికి అయ్యే ఖర్చు భరించలేని స్థాయికి చేరింది. పులి మీద పుట్రలా రేషన్‌కార్డులు ఉన్న వారికి ఉచితంగా అందిస్తున్న ఐదు కిలోల ఆహార ధాన్యాలను కూడా ప్రభుత్వం నిలిపివేసింది. 2020లో కోవిడ్ సమయంలో కేంద్రం ఈ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే.

ఉత్పత్తి, సరఫరా తగ్గలేదు

వడగాల్పులు, అధిక వర్షాలు వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఉత్పత్తి తగ్గిందని, దానికి అనుగుణంగానే సరఫరాలు తగ్గి ధరలు పెరిగాయని కొందరు అభిప్రాయపడుతున్నారు. మీడియా వార్తలు కూడా దీనికి బలం చేకూరుస్తున్నాయి. అయితే ప్రభుత్వ లెక్కలు దీనికి భిన్నంగా ఉన్నాయి. బియ్యం, గోధుమల దిగుబడి పెరుగుతూనే ఉంది. 2019-20 నుండి గోధుమల ఉత్పత్తి 4%, బియ్యం ఉత్పత్తి 10% పెరిగింది. ప్రతి సంవత్సరం రికార్డు స్థాయిలో ఉత్పత్తి జరుగుతోందని ప్రభుత్వం చెబుతోంది. పప్పు







ధాన్యాల విషయానికి వస్తే 2019-20 నుండి 1922-23 వరకూ ఉత్పత్తి 20% పెరిగింది. అంటే దీనిని బట్టి అర్థమవుతోంది ఏమంటే ధరల పెరుగుదలకు ఉత్పత్తి, సరఫరాలు తగ్గడం ఎంతమాత్రం కారణాలు కావు. ముఖ్యంగా 2022 తర్వాత పరిస్థితిలో ఎంతో మార్పు కన్పిస్తోంది.

ఫలితమివ్వని ప్రభుత్వ చర్యలు


పెరుగుతున్న ధరలను అదుపులో ఉంచేందుకు ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకోకపోలేదు. 2022 మేలో గోధుమ ఎగుమతులపై నిషేధం విధించింది. ఆ తర్వాత అదే సంవత్సరం ఆగస్టులో అట్టా, అలాంటి ఇతర ఇతర ఉత్పత్తుల ఎగుమతులనూ నిషేధించింది. అయితే దీనిపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఎందుకంటే నిషేధం విధించడానికి కొన్ని వారాల ముందు గోధుమ ఎగుమతులను పెంచాలని ప్రభుత్వమే కోరింది. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలలో గోధుమలకు కొరత ఏర్పడింది. ఆ సమయంలో ఎగుమతులను పెంచితే మెరుగైన ఆదాయాన్ని పొందవచ్చునని ప్రభుత్వం రైతులు, వ్యాపారులకు సూచించింది. అయితే దేశీయ ధరలపై దీని ప్రభావం పెద్దగా పడలేదు. ఎగుమతులు పెరిగినప్పటికీ దేశంలో ధరలు ఎక్కువగానే ఉన్నాయి. ఈ సంవత్సరం జూన్‌లో ప్రభుత్వం గోధుమ నిల్వలపై ఆంక్షలు విధించింది. మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులు, రిటైల్ వ్యాపారులు, దుకాణదారుల వద్ద ఉండే గోధుమ నిల్వలపై ఆంక్షలు విధించడం 15 సంవత్సరాలలో ఇదే మొదటిసారి.

బియ్యం విషయంలోనూ అంతే. బాసుమతి యేతర బియ్యం ఎగుమతులపై ప్రభుత్వం నిషేధం విధించింది. ఉడకబెట్టిన బియ్యంపై 20% ఎగుమతి సుంకాన్ని విధించింది. బాసుమతి బియ్యాన్ని ఎగుమతి చేయకుండా వ్యాపారులను నిలువరించేందుకు కనీస ఎగుమతి ధరను నిర్ణయించింది. ధరలను తగ్గించేందుకు ప్రభుత్వం తన వద్ద ఉన్న గోధుమలు, బియ్యం నిల్వలలో కొంత భాగాన్ని బహిరంగ మార్కెట్‌లో విక్రయించేందుకు సిద్ధపడింది. పెద్ద మొత్తంలో కొనుగోలు చేసే వారికి కూడా బహిరంగ మార్కెట్ అమ్మకపు పథకం (ఓఎంఎస్‌ఎస్) కింద విక్రయించింది. తాజా చారం ప్రకారం ప్రభుత్వం 13 రౌండ్ల ఈ-వేలం ద్వారా 18 లక్షల మెట్రిక్ టన్నుల గోధుమలను బహిరంగ మార్కెట్‌లో విక్రయించింది. ఇన్ని చర్యలు తీసుకున్నప్పటికీ ధరలు మాత్రం దిగిరాలేదు. పైగా బిస్కట్లు, రొట్టెలు, స్నాక్స్ ఉత్పత్తులు తయారు చేసే వారు పెద్ద మొత్తంలో ప్రభుత్వం నుండి గోధుమలు కొనుగోలు చేసి లాభాలు దండుకున్నారు. రైతులకు కానీ, వినియోగదారులకు కానీ ఒరిగిందేమీ లేదు.

ప్రభుత్వ నిర్వాకం ఫలితం

ఆహార ధాన్యాలను పెద్ద ఎత్తున సేకరించి, వాటిని ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేయకపోవడం ప్రభుత్వం చేసిన అతి పెద్ద తప్పిదం. గత సంవత్సరం గోధుమల సేకరణ బాగా తగ్గిపోయింది. ఉత్పత్తి గణనీయంగా పెరిగినప్పటికీ సేకరణ తగ్గడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం. సేకరణ తగ్గడం వల్ల రైతులకు కనీస మద్దతు ధర లభించలేదు. బహిరంగ మార్కెట్‌లో ధరలు పెరిగాయి. ఇప్పుడు ప్రభుత్వం వద్ద ప్రత్యామ్నాయ వ్యూహమేదీ లేదు. ఫలితం...భవిష్యత్తులో ధరలు తగ్గే అవకాశాలు కన్పించడం లేదు. ద్రవ్యోల్బణం దిగివచ్చే సూచనలు కూడా కనుచూపు మేరలో కానరావడం లేదు. ప్రభుత్వ నిర్వాకం కారణంగా ప్రజలు భవిష్యత్తులో బాధలు పడక తప్పని పరిస్థితి ఏర్పడింది.

ప్రపంచ సమగం



"నూతన ప్రపంచ క్రమానికి" అమెరికానే అడ్డంకి : లవ్రోవ్


జెనీవా : అంతర్జాతీయ సంబంధాలలో బహుళ ధ్రువ ప్రపంచ క్రమాన్ని నిర్మించి 'నిజమైన ప్రజాస్వామ్యాన్ని' సాధించటానికి రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ప్రపంచానికి ఒక అవకాశం వచ్చిందని రష్యన్ విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్ శనివారం ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సమావేశంలో చెప్పాడు. 'ప్రపంచంపైన తమ ఆధిపత్యాన్ని" కొనసాగేలా చేయటానికి సరికొత్త సంఘర్షణలను రెచ్చగొట్టి మానవాళిని విభజిస్తూ అటువంటి సాధ్యతను అమెరికా, దాని మిత్ర పశ్చిమ దేశాలు అడ్డుకుంటున్నాయని ఆయన తన ప్రసంగంలో చెప్పాడు. అంతర్జాతీయ సంబంధాలలో సమానత నియమాన్ని అమెరికా, దాని మిత్ర దేశాలు ఇప్పటికీ తిరస్కరిస్తున్నాయని, ఇతర దేశాలను చిన్నచూపు చూస్తున్నాయని ఆయన అన్నారు.

1945లో ఐక్యరాజ్య సమితి ఏర్పడిన తరువాత మొట్టమొదటిసారి నిజమైన ప్రపంచ క్రమాన్ని నిర్మించటానికి ప్రపంచానికి ఒక అవకాశం వచ్చిందని, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలలో నివసించే 'ప్రపంచ మెజారిటీ' ప్రజలు సమానత్వాన్ని, స్వాతంత్ర్యాన్నే కాకుండా వారి సార్వభౌమత్వాన్ని గౌరవించాలని కూడా కోరుకుంటున్నారని లవ్రోవ్ చెప్పాడు. ప్రయోజనాల సమతౌల్యం ఆధారంగా మానవాళి ఎదుర్కొంటున్న సమస్యలను సమిష్టిగా పరిష్కరించుకోవాలని ఆయన సూచించాడు. దేశాల సార్వభౌమత్వాల సమానతను గుర్తించకుండా, దేశాలు తమను తాము అభివృద్ధి చేసుకునే హక్కును గుర్తించకుండా విధించిన ఏకపక్ష ఆంక్షలను ఎత్తివేయాలని, అలా క్యూబా, సిరియా, వెనిజుయేలావంటి దేశాలపైన విధించిన ఆంక్షలను పూర్తిగా ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

వర్తమాన ప్రపంచ క్రమాన్ని అతర్జాతీయ సమాజం సమీక్షించవలసిన అవసరముందని లవ్రోవ్ ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీకి తెలిపారు. అంతిమంగా అమెరికా, దాని మిత్ర దేశాలు కృత్రిమంగా ఇతర దేశాలను చిన్నచూపు చూడటం మానాలి. దక్షిణాది దేశాల ఆర్థిక, ఫైనాన్షియల్ స్థాయిని గుర్తించాలని, అంతర్జాతీయి ద్రవ్యనిధిలోని, ప్రపంచ బ్యాంకులోని కోటాలను, ఓటింగ్ హక్కును పున్షపంపిణీ చేయాలని ఆయన చెప్పారు. అంతేకాకుండా ఐక్యరాజ్య సమితి భద్రతామండలిని విస్తరించి ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలకు తగిన ప్రాతినిధ్యం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

బ్రిటన్, రష్యాల మధ్య రహస్య చర్చలు : బ్రిటీష్ మీడియా

ఇంగ్లాండ్ : బ్రిటీష్ ప్రభుత్వ అధికారులు రష్యా ప్రభుత్వ ప్రతినిధులతో ఉక్రెయిన్ యుద్ధ కాలమంతా అంతర్జాతీయ భద్రతపైన తీసుకునే చర్యలపైన రహస్య చర్చలు జరిపారని గత



వారాంతంలో బ్రిటీష్ వార్తా సంస్థ "ద ఐ" పేర్కొంది. గత 18 నెలల కాలంలో ఈ చర్చలు వియన్నా, న్యూయార్క్ వంటి నగరాలలో జరిగాయని, ఆహార ధాన్యాల కొరత, అణు భద్రతవంటి విషయాలపైన చర్చలు జరిగాయని సదరు వార్తా సంస్థ తన రిపోర్ట్ లో పేర్కొంది. అయితే ఉక్రెయిన్ లో జరుగుతున్న యుద్ధానికి దౌత్య పరిష్కారాన్ని కనుగొనటం గురించి చర్చజరగలేదని పేరు చెప్పటానికి ఇష్టపడని ఒక బ్రిటీష్ అధికారి ఉటంకిస్తూ ఆ వార్తాపత్రిక తెలిపింది.

జులై నెలలో రష్యా బ్లాక్ సీ గ్రెయిన్ ఇనిషియేటివ్ ఒప్పందం నుంచి వైదొలగిన తరువాత ఆహారధాన్యాల ధరలు బాగా పెరిగాయి. ఈ ఒప్పందం ప్రకారం ఉక్రెయిన్ తన ధాన్యాన్ని ఆసియా, ఆఫ్రికా, మధ్యప్రాచ్య దేశాలకు ఎగుమతి చేసేది. అయితే ఒప్పందంలో భాగంగా రష్యాను తన వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసుకోనివ్వాలి. కానీ ఐరోపా దేశాలు రష్యా తన ఆహారధాన్యాలను, ఎరువులను ఎగుమతి చేసుకోవటాన్ని దుస్సాధ్యం చేస్తున్నాయని రష్యా ఆరోపించి ఒప్పందం నుంచి వైదొలిగింది. అణు భద్రత ముఖ్యంగా జపొరోజ్యే అణుశక్తి ప్లాంటు భద్రతకు సంబంధించిన హామీ ఇవ్వాలని బ్రిటీష్ అధికారులు రష్యను అభ్యర్థించారని ఆ రిపోర్ట్ పేర్కొంది.

బ్రిటన్ కు ఉక్రెయిన్ లో జరుగుతున్న యుద్ధంపైన "వ్యూహాత్మక స్పష్టత" ఉందని, అమెరికా, నాటో కూటమితో బ్రిటన్ మమేకమై ఉందని ఒక బ్రిటీష్ దౌత్యవేత్త ఆ వార్తాపత్రికకు చెప్పారు. ఈ చర్చలు ఉక్రెయిన్ లో కాల్పుల విరమణను ఉద్దేశించినవి కావని, బ్రిటన్ ఉక్రెయిన్ తీసుకోవలసిన నిర్ణయాలను తీసుకోజాలదని బ్రిటీష్ దౌత్యవేత్తలు చెప్పారు. జులైలో కూడా అమెరికా జాతీయ భద్రతకు చెందిన అధికారులు రష్యా విదేశాంగ మంత్రితో సహా అనేకమంది రష్యన్ ప్రముఖులను కలిసి ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించే విషయంపైన చర్చించారని ఎన్ బి సి న్యూస్ రిపోర్ట్ చేసింది. ఇదే విషయాన్ని ఐక్యరాజ్య సమితిలోని రష్యా శాశ్వత ప్రతినిధి వాసిలీ నెబెన్జ్యా నిర్ధారించింది. తాము తమ ఐరోపా మిత్రులతో అనేక విషయాలను చర్చిస్తున్నట్లు ఆమె అన్నది.

విద్యాశాఖలో కార్యకలాపాలకు బ్రేక్..

- సమ్మెలో సమగ్ర శిక్ష ఉద్యోగులు
- ఇబ్బందుల్లో విద్యాధికారులు
- పట్టించుకోని ప్రభుత్వం



నవతెలంగాణ- కోల్‌సిటీ

పాఠశాల విద్యాశాఖలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడంలో ప్రధాన భూమిక పోషిస్తూ ఎంఈవో, డీఈవో కార్యాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు. వీరు తమ సమస్యల పరిష్కారం కోసం విధులు బహిష్కరించి 24రోజులుగా సమ్మె చేస్తున్నారు. దీంతో పాఠశాల విద్యాశాఖలో పలు అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా తమ సర్వీసులను క్రమబద్ధీకరించాలని, తక్షణమే మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేయాలని, ఆరోగ్య భద్రత కల్పించాలని, రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా అన్ని వసతులూ సమకూర్చాలన్న డిమాండ్‌తో సమగ్ర శిక్ష ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెకు దిగారు. స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఓ వైపు ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ కొనసాగుతుండగా.. మరోవైపు సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె పాఠశాల విద్యాశాఖకు తలనొప్పిగా మారింది. ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చూపడంపై సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పలు విధులకు ఆటంకం..

మధ్యాహ్న భోజనం పథకానికి సంబంధించి నెలవారీగా విద్యార్థుల హాజరుకు అనుగుణంగా బియ్యం సరఫరా, బడిబయట పిల్లల గుర్తింపు, మధ్యాహ్న భోజన అమలు తీరు పరిశీలన, ఆధార్ నమోదు, ఇలా పలు బాధ్యతలు నిర్వర్తించాల్సింది సమగ్ర శిక్షా ఉద్యోగులే. ఎస్ఎంసీలు, ప్రధానోపాధ్యాయుల సమావేశాల నివేదిక రుపొందించడం వీరి ప్రధాన విధి. ఈ ఉద్యోగులు సమ్మెకు దిగడంతో ఈ పనులన్నింటికీ ఆటంకం ఏర్పడింది. వారి డిమాండ్లపై ప్రభుత్వం చర్చించి పరిష్కారం చూపి సమ్మెను విరమింపజేయించాలని ఆయా సంఘాలు కోరుతున్నాయి.

సమ్మెతో కార్యాలయాలకు తాళాలు

పాఠశాల నుంచి డీఈవో కార్యాలయం వరకు పెద్దపల్లి జిల్లాలో 447 మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు కార్యకలాపాలు నిర్వర్తిస్తున్నారు. జిల్లా స్థాయిలో అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్, సిస్టం అనలిస్ట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, మండల విద్యాశాఖ కార్యాలయాల్లో ఎంఐఎస్ సమన్వయకర్తలు, కంప్యూటర్ సిబ్బంది, స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్లుగా వేర్వేరు విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెతో కొన్నిచోట్ల ఎంఈవో కార్యాలయాలకు తాళాలు పడుతున్నాయి. వీరు చేయాల్సిన పనులను తప్పనిసరి పరిస్థితుల్లో ఎంఈవోలే నిర్వర్తిస్తున్నారు. సెప్టెంబరు నెలకు సంబంధించి పాఠశాలలకు అందజేయాల్సిన బియ్యం ఇంకా అందలేదు. ప్రస్తుతం ఆగస్టు నెల బియ్యాన్నే వినియోగిస్తున్నారు. మన ఊరు- మన బడి, తొలిమెట్టు, ఉన్నతి, లక్ష్య, తదితర కార్యక్రమాలపై సమ్మె ప్రభావం పడుతోంది. ఉద్యోగులు నిరవధిక సమ్మెకు దిగడంతో అరకొర సిబ్బందితోనే ఆయా కార్యాలయాల్లో పనులు కొనసాగుతున్నాయి. అత్యవసర సమాచారాన్ని పాఠశాల ఉపాధ్యాయుల నుంచి వాట్సప్‌లో సేకరిస్తున్నారు. బిల్లులు, కంప్యూటర్ ఆధారిత సేవలు పెండింగ్‌లో ఉన్నట్టు ఎంఈవోలు చెబుతున్నారు.

చాలీచాలని వేతనాలతో ఇక్కట్లు

రాష్ట్ర వ్యాప్తంగా 22వేల మందికి పైగా సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు 15ఏండ్ల నుంచి విధులు నిర్వర్తిస్తున్నారు. రోస్టర్, మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా వీరిని ఎంపిక చేశారు. వీరు ఉద్యోగ భద్రతకు అర్హులైనప్పటికీ 15 ఏండ్ల నుంచి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. ప్రభుత్వం చెల్లిస్తున్న చాలీచాలని వేతనాలతో కాలం వెల్లదీస్తున్నారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

సమగ్రశిక్షా ఉద్యోగులందరినీ విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులరైజ్ చేయాలి. క్రమబద్ధీకరణ జరిగే వరకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాన్ని అందజేయాలి. ప్రతి ఉద్యోగికీ రూ.10 లక్షల జీవిత బీమాతో పాటు రూ.5లక్షల ఆరోగ్య బీమా కల్పించాలి. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180రోజుల సెలవు మంజూరు చేయాలి. ప్రభుత్వం తమ సంఘం రాష్ట్ర నాయకత్వాన్ని చర్చల పేరిట బుజ్జగించే ప్రయత్నం చేస్తోంది. ఉద్యోగుల సమస్యపై ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా మీడియా ముఖంగా ప్రకటించాలి.



కుంబాల సుధాకర్, సమగ్రశిక్ష జేఏసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి

అవినీతిరహిత పాలన అందించడంలో విఫలం

- అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్, విద్య, వైద్యం
- ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల మాదిరిగా తెలంగాణలోనూ సంక్షేమ పథకాలు :

ఆప్ దక్షిణ భారత ఇన్‌ఛార్జి సోమనాథ్ భారతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజలకు అవినీతిరహత పాలన అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆమ్ ఆద్మీ పార్టీ దక్షిణ భారత ఇన్‌ఛార్జీ సోమనాథ్ భారతి విమర్శించారు. ఆప్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలో సామాన్యుడి సమరభేరీ పేరుతో నిర్వహించి సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్, విద్య, వైద్యమందిస్తామని హామీ ఇచ్చారు. ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రాష్ట్రంలోనూ అమలు చేస్తామని తెలిపారు. బీజేపీ బెదిరింపులకు ఆప్ నేతలు లొంగరనీ, వారు సామాన్యులు ఎన్నుకున్న బలమైన నేతలని చెప్పారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన భగత్ సింగ్, దేశానికి రాజ్యాంగాన్ని ఇచ్చిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌లను ఆప్ అనుసరిస్తున్నదని స్పష్టం చేశారు. బీజేపీ హిందూ వ్యతిరేక కార్పొరేట్ అనుకూల పార్టీ అని విమర్శించారు. బీజేపీ నకిలీ హిందుత్వవాదం, నకిలీ జాతీయవాదంతో ఎక్కువ కాలం పాలించలేదని హెచ్చరించారు. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ పాలనా నమూనాలో భాగమైన మెరుగైన పాఠశాలలు, మెరుగైన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలు, ఉచిత విద్యుత్ యూనిట్లు, మెరుగైన రోడ్లు, మహిళల సాధికారత, రైతులకు సబ్సిడీలు వంటి సంక్షేమ పథకాలు దేశవ్యాప్తంగా ప్రజలను ఆకర్శిస్తున్నాయని చెప్పారు. 'వన్ నేషన్', 'వన్ ఎడ్యుకేషన్', 'వన్ హెల్త్ కేర్' వంటి ఆప్ ఎజెండాను దేశవ్యాప్తంగా అమలు చేయనున్నట్టు వెల్లడించారు. ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 119 స్థానాల్లో పోటీ చేసేందుకు ఆప్ సిద్ధంగా ఉందని తెలిపారు. మార్పు పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సదస్సుకు ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు భూక్యా అధ్యక్షత వహించారు. అధికార ప్రతినిధి వినయ్ రెడ్డి, రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, ఏం.ఏ. మజీద్, డాక్టర్ సోలొమన్ రాజ్, డాక్టర్ హరి చరణ్, డాక్టర్ అన్సారీ, డాక్టర్ పుట్ట పాండురంగయ్య, బాబుల్ రెడ్డి, తిరుమల రావు, ఆప్ మహిళా విభాగం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హేమ జిల్లోజు, యమునా గౌడ్‌తో పాటు జిల్లా, మండల, గ్రామాల కన్వీనర్లు, అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల ఇన్‌ఛార్జీలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

'నారీశక్తి' ఎన్నికల జిమ్మిక్కు

- 2024 ఎన్నికల్లోనే అమలు చేయాలి
- నియోజకవర్గాల పునర్విభజన, జనగణనతో ముడిపెట్టడం సరిగాదు :

మహిళా సంఘాల నేతలు మల్లు లక్ష్మి, ఎస్.జ్యోతి, వి.సంధ్య



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నారీశక్తి పేరుతో పార్లమెంట్‌లో మోడీ సర్కారు ప్రవేశపెట్టిన మహిళా బిల్లు ఎన్నికల జిమ్మిక్కు అని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, ఎస్ఎఫ్‌డబ్ల్యూ ప్రధాన కార్యదర్శి ఎస్.జ్యోతి, పీఓడబ్ల్యూ ప్రధాన కార్యదర్శి వి.సంధ్య విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లను 2024 ఎన్నికల నుంచే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ల అమలును జనగణన, నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టడం సరిగాదన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మహిళా రిజర్వేషన్ బిల్లు-మహిళా సంఘాలు కోరేదేమిటి? అనే అంశంపై వెబినార్ నిర్వహించారు. దీనికి ఎస్వీకే మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయకుమార్ సమన్వయ కర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల నేతలు మాట్లాడుతూ..2027 తర్వాత అమలు అంటే మహిళలను మరోమారు మోసం చేయడమే అని విమర్శించారు. మహిళలు ఎదగాలంటే ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వం కల్పించాలని 1974లోనే వీణా మజుందార్ నేతృత్వంలో వేసిన కమిటీ స్పష్టం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ల కోసం కమ్యూనిస్టు నాయకురాలు గీతాముఖర్జీ చేసిన పోరాటాన్ని వివరించారు. మహిళల హక్కులే మానవ హక్కులని బీజింగ్ డిక్లరేషన్ జరిగిందని గుర్తుచేశారు. మన దేశంలో మాత్రం పాలకులు మహిళలను రాజకీయంగా ఎదగకుండా తొక్కిపెట్టారన్నారు. మహిళా బిల్లు తెరపైకి వచ్చిన ప్రతిసారీ ఏదో ఒక అంశంతో ముడిపెట్టి వెనక్కి లాగుతున్న తీరును వివరించారు. ఆర్ఎస్ఎస్ పుట్టుపూర్వోత్తరాలు చూస్తే మహిళలకు సభ్యత్వం ఇవ్వడానికే నిరాకరిస్తున్నదనీ, అది మనువాద సిద్ధాంతంతో ముందుకెళ్తున్నదని విమర్శించారు. కరుడుగట్టిన పితృస్వామ్య వ్యవస్థనే మహిళా బిల్లును తొక్కిపెడుతున్నదన్నారు. మహిళా ఓటు బ్యాంకును కొల్లగొట్టాడానికి ఆడుతున్న రాజకీయ క్రీడలో భాగమే ఈ బిల్లు అన్నారు. ఓబీసీ, మైనార్టీలకు సీట్ల కేటాయింపుపై చర్చే లేదన్నారు. దేశంలో తొమ్మిదేండ్ల కాలంలో నిరుద్యోగం, పేదరికం తీవ్రస్థాయికి చేరాయనీ, దళితులు, మహిళలపై దాడులు తీవ్రమయ్యాయని తెలిపారు. మణిపూర్‌లో మహిళలపై లైంగికదాడులు, హత్రాస్ ఘటన, ఢిల్లీలో లైంగిక దాడులను నిరసిస్తూ రెజ్లర్ల ఆందోళనలతో మోడీ సర్కార్‌పై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లిందన్నారు. ఇండియాలో మానవ హక్కులు హరించబడివేయబడుతున్నాయని వియత్నాంలో బైడెన్ చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. వాటిని కప్పిపుచ్చుకునేందుకు వేసిన ఎన్నికల స్టంటే మహిళా బిల్లు అని విమర్శించారు. బలం లేకున్నా అనేక బిల్లులను ఆమోదించచేసుకున్న మోడీ సర్కారు మహిళా బిల్లును తొమ్మిదేండ్లుగా నాన్చుతూ వచ్చిందన్నారు. ఇప్పుడు ఆమోదం పొందిన బిల్లులోనూ అనేక లోపాలున్నాయని తెలిపారు. ఓబీసీ, మైనార్టీ, గిరిజనులు, ఎస్సీల వాటా తేల్చకుంటే దొరల చేతుల నుంచి పాలన దొరసానుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదముందని హెచ్చరించారు. మహిళలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక సమానత్వం కోసం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామన్నారు. బిల్లు పాసైంది కాబట్టి ఈ ఎన్నికల్లోనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆ బిల్లులోని జనగణన క్లాసను తీసేయాలనే డిమాండ్‌తో మహిళా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఐక్య పోరాటాలు చేస్తామన్నారు. అక్టోబర్ ఐదో తేదీన ఐద్వా ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు మల్లు లక్ష్మి తెలిపారు.

ఎమ్ఎస్‌పీని చట్టబద్ధం చేయాలి

ఇన్‌పుట్ సబ్సిడీ, ఎరువులు, విత్తనాలు ఉచితంగా అందించాలి

- రైతు ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పి తొమ్మిదేండ్లయినా ఊసేత్తని కేంద్రం
- రాష్ట్రంలో రైతుబంధు ఇచ్చి.. మిగిలిన సౌకర్యాలను దూరం చేసిన వైనం
- వాస్తవ పరిస్థితుల ఆధారంగా రైతుల ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచాలి :

రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

దేశంలో అన్ని రకాల పంటలకు వాస్తవ పెట్టుబడి, రైతు కష్టానికి మిగలాల్సిన ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని వాస్తవిక ఎమ్ఎస్‌పీకి చట్టబద్ధత తీసుకురావాలని, ఎరువులు, విత్తనాలు ఉచితంగా అందించి ఇన్‌పుట్ సబ్సిడీని పెంచాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి తెలిపారు. ఇవేమీ చేయకుండా రైతు ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని అధికారంలోకి వచ్చిన కేంద్ర బీజేపీ సర్కారు తొమ్మిదేండ్లలో వ్యతిరేక చర్యలకే పూనుకుందని విమర్శించారు.

రాష్ట్రంలోనూ రైతుబంధు ఒక్కటే ఇచ్చి.. మిగిలిన రైతుల సౌకర్యాలను దూరం చేశారన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న తెలంగాణ రైతుసంఘం రాష్ట్రస్థాయి శిక్షణా తరగతుల్లో బోధించేందుకు ఆదివారం నంద్యాల వచ్చారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని సాగురంగాన్ని ప్రయివేటుపరం చేసేందుకు, వ్యవసాయ కాంట్రాక్టీకరణ తీసుకొచ్చేందుకు కేంద్రం అడుగులు వేస్తోందన్నారు. సుదీర్ఘపోరాటంతో మూడు చట్టాలను వెనక్కితీసుకునేలా రైతులు ఉద్యమించినా కేంద్ర సర్కారులో మాత్రం మార్పు రావడం లేదని ఆరోపించారు. స్వామినాథన్ కమిటీ సిఫారసులనే అమలు చేస్తామని చెప్పి.. సేంద్రియ వ్యవసాయం తీసుకొచ్చే పేరుతో ఎరువుల ధరలు పెంచుతూ.. సబ్సిడీకి కోత విధించిందన్నారు. వ్యవసాయాధారిత రంగాలను డెవలప్ చేయకుండా, పశు సంవర్ధకశాఖను నిర్వీర్యం చేసి సేంద్రియ సాగు తీసుకురావాలని చెప్పడం హాస్యాస్పందంగా ఉందన్నారు.

పైగా ఎఫ్‌సీఐ గోదాములు ప్రయివేటుపరం చేస్తున్న కేంద్రం సీసీఐకి ఈ ఏడాది బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించలేదని విమర్శించారు. ఈ చర్యలన్నీ చూస్తుంటే దేశంలో సాగురంగాన్ని పెట్టుబడిదారుల చేతుల్లో పెట్టేందుకు పూనుకుంటున్న పరిస్థితికి అద్దం పడుతోందని, దేశవ్యాప్తంగా రూ.16కోట్ల రైతాంగ ఆదాయానికి గండిపడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటు రాష్ట్రంలోని బీఆర్ఎస్ సర్కారు కూడా కేవలం రైతుబంధు మాత్రమే ఇచ్చి.. ఇదివరకు రైతులకు ఇచ్చిన సౌకర్యాలను ఎత్తేసిందన్నారు. ఇరిగేషన్‌ను డెవలప్ చేసి, వరి సాగు విస్తీర్ణాన్ని పెంచామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం వరి తప్ప మిగతా ఏ పంటలనూ ప్రోత్సహించడం లేదని ఆరోపించారు. ఇప్పటికే రాష్ట్రంలో 10లక్షల టన్నుల కాయగూరలు, పండ్లు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్నాయని, కనీసం రాష్ట్ర ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆ పంటల సాగును ప్రోత్సహించడం లేదన్నారు. ప్రకృతివైపరీత్యాలను గుర్తించే టెక్నాలజీ అందుబాటులోకి వచ్చినా రైతులను ముందుగా అలర్ట్ చేయని అసమర్థపాలన సాగిస్తున్నారని చెప్పారు.

పైగా ధనవంతులతో కలిసి పేదల ఆదాయాన్ని కలిపి లెక్కించి రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3.5లక్షలుగా ఉందని టెక్నికల్ అంశాలతో ప్రచారం చేసుకోవడం మానుకోవాలని, వాస్తవ పరిస్థితులను చూస్తే పేదవాని ఆదాయం రూ.10వేలు కూడా దాటదని చెప్పారు. ధరణిలో సన్న, చిన్నకారు రైతాంగానికి చెందిన 8లక్షల ఎకరాల భూసమస్యను పరిష్కరించి వారికి రైతు బంధు, ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా 200 రైతుసంఘాలు ఐక్యంగా ఢిల్లీలో సమావేశమై ఉద్యమాలకు పిలుపునిచ్చారని, రాబోయే రోజుల్లో పోరుకు రైతాంగం సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వర్ణ వెంకటరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు మిల్కూరి వాసుదేవరెడ్డి, ఎమ్‌డీ గఫూర్ పాల్గొన్నారు

రాష్ట్ర వ్యవసాయ ప్రగతి ప్రస్థానం వివరించండి

- మంత్రి కేటీఆర్‌కు ఆహ్వానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అమెరికాలో ఈ ఏడాది జరగనున్న నార్మన్ బోర్లాగ్ ఇంటర్నేషనల్ డైలాగ్ సమావేశంలో రాష్ట్రం సాధించిన వ్యవసాయ ప్రగతి ప్రస్థానాన్ని వివరించాలని కోరుతూ మంత్రి కేటీఆర్‌కు ఆహ్వానం అందింది. అక్టోబర్ 24 నుంచి 26వ తేదీ వరకు అమెరికాలోని ఐయోవా రాష్ట్రంలోని డేస్మోయిన్‌లో ఈ సమావేశం జరగనున్నది. ప్రపంచ దేశాలకు చెందిన 1200 మంది అతిథులు ఈ సమావేశానికి నేరుగా హాజరవుతారు. దీంతో పాటు వేలాదిమంది సామాజిక మాధ్యమాల ద్వారా ఈ సమావేశాల్లో పాల్గొంటారు. రాష్ట్ర అనుభవాలను ఈ సమావేశంలో చర్చించడం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఈ సమావేశాలకు హాజరవుతున్న అనేకమందికి ఎంతో ఉపయోగంగా ఉంటుందని మంత్రి కేటీఆర్‌కు పంపిన ఆహ్వాన పత్రంలో వరల్డ్ ఫుడ్ ప్రైజ్ ఫౌండేషన్ అధ్యక్షులు టెర్రి ఈ బ్రాడ్‌స్టాడ్ తెలిపారు. మంత్రి కేటీఆర్‌తో పాటు వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డికి కూడా ఆహ్వానాన్ని సంస్థ అందించింది.

పేదల గుడిసెలు కూల్చివేత



- పరామర్శించడానికి వెళ్లిన సీపీఐ(ఎం) జిల్లా నాయకుని అరెస్టు
- సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలింపు
- స్టేషన్ ఎదుట బైటాయించి.. బాధిత పేదల నిరసన

నవతెలంగాణ-కంది, సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రంలోని 615 సర్వే నెంబర్‌ని ప్రభుత్వ స్థలంలో మూడ్రోజుల కిందట సుమారు 200మంది నిరుపేదలు గుడిసెలు వేసుకున్నారు. కాగా, ఆదివారం తెల్లవారు జామున సుమారు మూడు గంటల సమయంలో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది కలిసి ఆ గుడిసెలను కూల్చివేశారు. దాంతో ఉదయం మరోమారు పేదలు గుడిసెలు ఏర్పాటు చేసుకున్నారు. కాగా విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు నర్సింలు ఘటనా స్థలానికి వెళ్లి.. బాధిత పేదలను పరామర్శించారు. ఘటన గురించి బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ నాయకులు నర్సింలును అరెస్టు చేసి సంగారెడ్డి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దాంతో బాధితులందరూ స్టేషన్ ఎదుట బైటాయించి నిరసన తెలిపారు. కాగా నర్సింలు అరెస్టును చూసి పలువురు మహిళలు కంటతడిపెట్టారు. ఆయన్ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాగా నర్సింలు అరెస్టును సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల గుడిసెలను కూల్చివేయడం అన్యాయమన్నారు. కంది మండల కేంద్రంలో అనేక ఏండ్లుగా పేదలు ఇండ్లు లేక అద్దె ఇంట్లో ఉంటూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ భూములు కబ్జా చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోకుండా.. ఇండ్లు లేని పేదల గుడిసెలను కూల్చివేయడం సరికాదన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే అర్హులైన పేదలను గుర్తించి వారికి ఇండ్ల స్థలాలు కేటాయించి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు యన్. శ్రీనివాస్ పి.అశోక్, కృష్ణ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

12నెలలకు వేతనాలివ్వండి

- ఎమ్మెల్సీ పల్లాకు తెలంగాణ డిగ్రీ లెక్చరర్స్ ఫోరం వినతి

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులకు (గెస్ట్ లెక్చరర్స్) గంటల ప్రాతిపదికన కాకుండా నెలవారీగా 12నెలల పాటు వేతనాలివ్వాలని తెలంగాణ డిగ్రీ లెక్చరర్స్ ఫోరం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డిని టీడీఎల్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చింతల కిషోర్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ జె. నాగేశ్వరరావు, డి.కరుణాకర్, జె.సంతోష్, బండి శ్రీనివాస్ పి. వెంకటేశ్వరరావు, శేఖర్, సతీష్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గంటకు రూ.390 చొప్పున కాకుండా ఏకీకృతమైన (కన్సాలిడేటెడ్) వేతనాన్ని 12 నెలలకు ఇచ్చే విధంగా చూడాలని కోరారు. రాష్ట్రంలోని 132 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పదేండ్ల నుంచి 1940 మంది అతిథి అధ్యాపకులు విధులు నిర్వహిస్తున్నారని, వారంతా చాలీచాలని వేతనాలతో కుటుంబాలను గడుపుతున్నారని గుర్తుచేశారు. ప్రస్తుతం గెస్ట్ లెక్చరర్స్‌కి గంటకు రూ.390 చొప్పున నెలకు 72 క్లాసులు రూ.28,080 మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. గంట చొప్పున ఇవ్వడం ద్వారా ప్రభుత్వం సెలవులు ప్రకటించినప్పుడు, పరీక్షలు నిర్వహిస్తున్నప్పుడు తమకు వేతనాలు రావడం లేదని తెలిపారు. కాబట్టి ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మానవత్వంతో ఆలోచించి 12నెలలకు వేతనాలు ఇవ్వాలని కోరారు.

'కామ్రేడ్ చరణ్‌పై అక్రమకేసును ఉపసంహరించుకోవాలి'

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీపీఐఎంఎల్ ప్రజా పంథా భద్రాచలం డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ చరణ్‌పై చర్ల మండలం పోలీసులు, మావోయిస్టు అని పెట్టిన అక్రమ కేసును ఉపసంహరించుకోవాలని ఆ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ కార్యదర్శి పోటు రంగారావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గొత్తికోయల సమస్యలపై సోమవారం భద్రాచలంలో పార్టీ తలపెట్టిన ప్రదర్శన కరపత్రాలను పంచుతూ ప్రచారం చేస్తున్న చరణ్‌పై మావోయిస్టు అని కేసు మోపడం పోలీసుల అక్రమ కేసుల బనాయింపును తెలుపుతుందన్నారు. చరణ్ ఇటీవల వరద బాధితుల సమస్యలపై, చర్ల మండలం సమస్యలపై, ఇసుక మాఫియాపై పోరాటాలు చేశారనే కక్ష్య తోనే ఈ అక్రమ కేసు నమోదు చేశారని రంగారావు విమర్శించారు.

జీవోల్లో స్పష్టత ఉన్నా..గందరగోళమెందుకు?

- స్పౌజ్ ఫోరం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బదిలీలకు సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వుల్లో స్పష్టంగా ఉన్నా గందరగోళానికి గురి చేస్తున్నారని స్పౌజ్ ఫోరం ఆరోపించింది. ఈ మేరకు ఆదివారం ఆ ఫోరం అధ్యక్షులు వివేక్ ఒక ప్రకటన విడుదల చేశారు. స్పౌజ్ పాయింట్స్, స్పౌజ్ ఆప్షన్ పెట్టుకునే విషయంలో ఉత్తర్వుల్లో నియరర్ టు, అండ్ టూవర్డ్స్ నియరర్ ప్లేసెస్ ఆఫ్ ది స్పౌజ్ అని స్పష్టంగా ఉన్నప్పటికీ బదిలీ దరఖాస్తుల్లో స్పౌజ్ మండల్ స్కూల్స్‌నే మొదటి ఆప్షన్‌గా పెట్టుకోవాలని, లేకపోతే పాయింట్స్ తీసేసుకోవాలనీ, క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని బెదిరిస్తున్నారని వాపోయారు. ఉత్తర్వుల ప్రకారం కాకుండా నిర్బంధంగా ఏ జిల్లాలో అయినా స్పౌజ్ ఆప్షన్ ఎడిట్ చేసినా, బదిలీ స్థలాలను నిర్బంధంగా మార్చినా...అలాంటి వారిపై అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు న్యాయస్థానానికి వెళతామని వివేక్ హెచ్చరించారు.

పేదలపై వేధింపులు దారుణం

- కబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూమిని వెనక్కి తీసుకోవాలి
- గుడిసెల పోరాట నాయకుడు నరసింహులు అరెస్టును ఖండిస్తున్నాం : వ్యకాస

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రంలో సర్వేనెంబర్ 615లోని ప్రభుత్వ భూమిని పెత్తందారులు ఆక్రమించుకుంటే రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదనీ, పేదలు వేసుకున్న గుడిసెలను పోలీసులు తగలబెట్టి మరీ వేధిస్తున్నారనీ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు జి.నాగయ్య, ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు పేర్కొన్నారు. ఈ ఘటనను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. గుడిసెల పోరాటానికి నాయకత్వం వహించిన వ్యవసాయ కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి నరసింహులను అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో నిర్బంధించడాన్ని ఖండించారు. గుడిసెలు తగలబెట్టిన పోలీసులపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సర్వే నెంబర్ 615లో 83 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంటే రియల్టర్లు ఎనిమిదెకరాలను, గ్రామ పెత్తందారి పటేల్ రామకృష్ణారెడ్డి ఐదెకరాలను, వార్డు మెంబర్ మూడెకరాలను ఆక్రమించారని తెలిపారు.

ఇటీవల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం కోసం నాలుగెకరాలు ఆక్రమించి షెడ్ల నిర్మాణం చేశారని పేర్కొన్నారు. భూ ఆక్రమణలకు పాల్పడ్డ వారివైపు రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడలేదని తెలిపారు. కొంత భూమిలో నిలువ నీడలేని పేదలు గుడిసెలు వేసుకుంటే మాత్రం అక్రమ కేసులు బనాయించారనీ, పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించి వేధించారని పేర్కొన్నారు. గుడిసెలు వేసుకోవడానికి తెచ్చుకున్న సామాగ్రిపైనా, గుడిసెలపైనా పోలీసులు పెట్రోల్ పోసి తగులబెట్టడం దారుణమని తెలిపారు. ఈ ఘటనకు కారకులైన వారిని వెంటనే విధుల్లో నుంచి తొలగించి ఆస్తి నష్టం కేసు నమోదుచేయాలనీ, పేదలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

నిద్ర @కండీషన్స్ అప్లై..!

ప్రశాంతంగా నిద్రపోవాలంటే
దినసరి వ్యాపారాల్ని కట్టిపెట్టి
ఓవరుకోటులా విడిచి హాంగరుకి తగిలించి
మంచంపై కొంత తేలిక పడాలి..!

నీ రంగు రంగుల ఇంద్ర భవంతిలో
ఎన్ని కాంతుల ధగధగలు ఉన్నా
చిక్కని చీకటితో దోస్తీ చేసి
తల్పంపై నీ తనువు సేద తీరాలి..!

నువ్వెంతటి స్థితిమంతుడవైనా కావచ్చు
నువ్వెంతో ఉన్నత స్థాయిలో ఉండవచ్చు
అయినా వీటన్నింటినీ
మూసే నీ కన్నుల వాకిట వదలాలి..!

మంది-మార్బలం నీ వెంట తిరగవచ్చు
విద్వత్తుతో నీవెంతో కీర్తి పొందవచ్చు
అయినా వీటన్నింటినీ
మరిచి నిద్రను నీవు శరణు కోరాలి..!

బ్రాండెడు పెగ్గుల మందు నిశాతోనో
మోతాదుకు మించి అల్ప్రాలాం టాబ్లెట్లతోనో
మొండి చేసి నిద్రపోవాలంటే మాత్రం
మగతగా తూలిపోయే మత్తే గతి..!

నిద్రకు ఉన్నోడు లేనోడు తేడా లేదు
వయసుతో నిమిత్తం లేదు
కులం మతంతో సంబంధం లేదు
వర్గం, ప్రాంతం అసలేదీ లెక్క కాదు..!

బ్రాండెడు ఎ.సి.ల చల్లదనం
సున్నిత పరుపుల మెత్తదనం ఉన్నా
మెదడు ఆలోచనల సంక్లిష్టతను
వీడకుంటే మాత్రం
శరీరం ఆదమరచి నిద్రపోలేదు..!

పగలంతా శ్రమతో అలసిసొలసి
గడిచిన కాలాన్ని రేపటి కలవరాన్ని కట్టి పెట్టి
చిన్నపిల్లాడిలా నిశ్చింతగా సోలిపోతే
నిదురమ్మ నిను చక్కగా కరుణిస్తుంది..!

అప్పుడే రాత్రి పట్టే ఆ గాఢ నిద్ర
కొన్ని గంటల మరణాన్ని తలపించినా..
ఉదయం లేవగానే ప్రాణం
నీలో కొంగొత్తగా వికసిస్తుంది..!!

- డా. వాసాల వరప్రసాద్
9490189847

నల్లమల సిగలో విరిసిన కొండమల్లెలు



ఏ వైఎన్. Rand అను శాస్త్రవేత్త నిర్వచనం ప్రకారం భూమి మీద పుట్టిన ఎటువంటి తెగ వారైనా, అది ఎంత చిన్నదైనా వారికి ఈ పుడమిపై స్వతంత్రంగా జీవించే హక్కు ఉంటుందనేది నిర్వివాద అంశం. దీనికి తగినట్లుగానే కొండ కోనల్లో సంచరించే తెగకు చెందినవారు చెంచులు. వీరి జీవన ఇతివృత్తాన్ని స్వీకరిస్తూ ఆదివాసీ నవలా రచనకు పూనుకున్న డాక్టర్ దిలావర్ అభినందనీయులు. ఎందుకంటే వీరి దైనందిన జీవనసరళిని అతి సామీప్యంలో ఉంటూ గమనించ గలగటం, తాను వృత్తిగత బాధ్యతలు నిర్వహించిన వివిధ కోయగూడేలు వాటి పరిసర ప్రాంతాలు వీరి నవలా రచనకు ఎంతో దోహదపడుతూ ఈ 'అడవి బతుకులు'కు జీవం పోసిందని అనిపిస్తుంది.

నల్లమల్ల ప్రాంతంలోని కొండలు, గుట్టలే చెంచుల ప్రస్తుత నివాస స్థలం. ఈ ప్రాంతం తెలంగాణాకు గుండెకాయలాంటిది. ఇది చెంచులకు 'మనాకీ' అయిన ప్రాంతం. అంటే చెంచుల జీవం, ప్రాణం. వారికి నీడనిచ్చే ఆవాసం, భుక్తి తీర్చే అన్నపూర్ణ. అలాగే పర్యాటక ప్రియులను తన సొగసైన రూప లావణ్యాలతో కౌగలించుకొని ముద్దులు ఇచ్చే జవరాలు ధన్వంతరీ వారసులకు ప్రాణధారలు పోయ గల అమృతవర్షిణి. పర్యావరణ ప్రేమికులకు జీవవైవిధ్యాన్ని సంరక్షించే జీవనప్రదాయిని. ఇంతటి మహత్తు కలిగిన నల్లమలలో నేడు నడుస్తున్న వర్తమాన వ్యవహారాలే నల్లమలను, అందు నివసించే చెంచులను పొట్టన పెట్టుకుంటూ అనకొండలా చుట్టుకుంటున్న ప్రభుత్వ, మానవ, దానవ కబళిత విన్యాసాలై నగర జీవనంలోకి నిర్దాక్షిణ్యంగా విసిరి వేయబడుతూ ఖాళీ సంచులుగా, డొల్లతనంతో జీవనం సాగిస్తున్న వారి దుర్భర స్థితిగతులు వెరసి మసిబారిపోయి కళ్లను చించుకున్నా ఏమీ కనబడని ఓ గుడ్డి దర్పణం.

సంతోషపూరిత జీవితాన్ని గడుపుతున్న వీరి జీవనాన్ని నేటి ఆధునిక మానవజాతి తమ స్వార్థ దాహానికి బలిపెడుతూ విధ్వంసం వైపుగా నెడుతోంది. ఇటు తమను బతికించే అడవులు లేక అటు నాగరిక జీవితంలో ఇమడలేక అర్థాంతరంగా మృత్యు దేవత ఒడిలోకి లాగబడుతున్నారు చెంచులు. వీరు నివాస గూడేన్ని 'పెంట'గా వ్యవహరిస్తారు. చదువు, సంస్కారం మా సొత్తే అని విర్రవీగుతూ మీసాలు మెలేసే మనం.. మనలో లేని సుగుణాన్ని వీరిలో ప్రస్ఫుటంగా గమనించవచ్చు. వేటపడినా లేదా మడుగులో చేపల్ని పెద్ద మొత్తంలో పట్టినా ఏ కొద్దిమందో తినకుండా ఆ పెంటలోని కుటుంబాల వారంతా సమభాగాలుగా పంచుకుని తినటం ఈ తెగవారి ఐక్యతకు, వారిలో నిండిన అభిమానానికి తార్కాణంగా చెప్పుకోవచ్చు.

ఒకప్పుడు అడవిలో అడవిలా మమేకమైపోయిన చెంచులు నిర్వాసితులు అవ్వటం అంటే తల్లి పేగు బంధాన్ని తెంపుకున్నట్లే. కానీ ఇలా తెంపుకోవటం వీరికి సాధ్యమయ్యే పని కాదని నవలా నాయకుడు రమణారావు ద్వారా పలికిస్తారు నవలా రచయిత. అటవీ రక్షణ పేరుతో ప్రభుత్వాలు మైదాన ప్రాంతాలకు తరలించి ఎంత పునరావాసం కల్పించినా చరిత్ర పునరావృతమే అవుతుందంటారు. ఈ ప్రక్రియలో వందలాది సంఖ్యలో అమాయక చెంచుల ప్రాణాలను హరిస్తున్న ఘనత నేటి ప్రభుత్వాలదీ, ఈనాటి స్వార్థపూరిత దాహార్తిదే. ముంతెడు నీళ్లకే ఉలికిపడితే పొంతెడు నీళ్లు ఎవరు పోసుకోవాలి' అని రచయిత ఒక చమత్కార బాణాన్ని విసురుతూ ఆలోచింపజేస్తారు పాఠకులను.

'తాటాకు దొబ్బిండు వాడు ఈతాకు నిచ్చిండు చూడు' అని ఒక సినీ గేయం స్మరణకు వస్తుంది, పాలకుల తంతు చూస్తుంటే. అభివృద్ధి చెందించాలనే నెపంతో చెరువులోని చేప పిల్లల్ని తీసుకెళ్లి ఒడ్డున పడేసినట్లుగా నగరాలలో పునరావాసం కల్పించి వీరికి కనీస సౌకర్యాలను కల్పిస్తున్న మాట వాస్తవమే గాని కన్న తల్లి పేగు బంధం తెంచుకోవడం సాధ్యంకాక నలిగిపోతున్నారు. నూటికి నూరుపాళ్లు నిజమదే.

కన్న వాళ్ళ ప్రేమ ముందు, ఉన్న ఊరిచ్చే సౌఖ్యం ముందు మీదుమిక్కిలి తమకట్టుబాట్లను సంస్కృతీ సాంప్రదాయాలను వదులుకోలేక ఒడ్డునపడ్డ చేపపిల్లల మాదిరిగా గిలగిల్లాడుతూ మృత్యువాత పడుతున్నారు చెంచులు. అభివృద్ధి అంటే ఇదేనా? అని మానవ కులమంతా ప్రశ్నించుకోవలసిన గడ్డు పరిస్థితి ఇది. ఎటువంటి ఆత్మ వంచనకు తావివ్వకుండా మనసు చెప్పే జవాబు వినగలిగే ఓర్పు ఉన్నవారికి అడవి అంటే చెంచులు. చెంచులంటే అడవి అని తప్పక ఒప్పుకుంటారు.

కూలీల సమాధుల మీద నుండే ఆధునిక దేవాలయపు (నాగార్జునసాగర్ ఆనకట్ట) పునాదులు వెలిసాయి అంటాడు రమణారావు. నిజమే అభివృద్ధి పేరిట జరిగే విధ్వంసం స్వాగతించదగినది కాదు. అభివృద్ధేమో బడాబాబులకు, విధ్వంసం మాత్రం పేద, బడుగు, బలహీన వర్గాల వారికి. ఇదే కదా! చరిత్ర చాటిన నిజం అని కూడా పలికిస్తారు రచయిత నవలా నాయకునితో (రమణారావుతో)

సందర్భానుసారంగా మధ్యమధ్యలో చెంచుల సాంప్రదాయాలను వారిలోని నేటి చిక్కని నిజాయితీని తెలుపుతుంటారు రచయిత. ఈ తీరు చూస్తుంటే చెంచుల పట్ల వారి జీవన విధానం పట్ల గౌరవభావాన్ని పెంపొందిస్తుంది మనకు. చెంచులు నాలుగు రకాలని, వారు అడవి చెంచులు, దేవ చెంచులు, బొంత చెంచులని వీరిలో 26 గోత్రికులు ఉంటారని సగోత్రీకులు ఎప్పుడూ వియ్యమందుకోవటం ఆచారం కాదని ఇలా చెప్తుంటే.. వీళ్లు మనకంటే ఎందులోనూ తీసిపోరని కేవలం విద్య, విజ్ఞానం ఆధారంగా వీళ్లను తక్కువగా అంచనా వేస్తున్నాం. ఇది ఎంత వరకు సబబని మనల్ని మన అంతరంగం ప్రశ్నించకపోదు?

తాటికల్లు, ఇప్ప సారా, తుమ్మ సారాలు సమీకరించుకొని దాచుకోవటం, రోజూ తాగటం అతి సాధారణమైన విషయం వీరిలో. డబ్బులతో కొనుక్కోకుండా స్వయంశక్తితో సాధించుకుంటారు వీటిని. మనకు టీ, కాఫీలు ఎలాగో ఈ తెగవారికి ఇది కూడా అలాగే. ఈ వ్యసనాలనేవి తొడుక్కున్న చొక్కాల్లాంటివి. చొక్కా అందంగా ఉన్నప్పుడు విప్పి విసిరి పారేయాలని ఎవరూ అనుకోరు కదా! మనం బలవంతంగా వదుల్చుకుంటేనే తప్ప వదలనివి ఈ వ్యసనాలు. వీటిని దూరం చేసుకోలేక బతుకుల్ని వ్యర్థం చేసుకుంటున్నారు. అవిద్య అనే కట్లపాముకు చుట్టబడిన శాపగ్రస్త జీవితాలు వీరివి.

పండంటి పాపాయిలకు జన్మనివ్వాల్సిన తరుణంలో నాటు మంత్రసానుల చేతుల్లో పడి ప్రాణాలు హరీమనటం ఆదివాసి మహిళల్లో చూస్తాం తరచుగా. ఇది చాలా విచారకరం. కొండకచో ఇలాంటి పరిస్థితుల్లో మార్పు వచ్చిందేమో గాని ఎక్కువ శాతం ఇప్పటికీ ఇలాగే బండి నడుస్తున్నట్లుగా మనం పేపర్లలో న్యూస్ చదివినప్పుడు హృదయం చలించిపోతుంటుంది.

> బిర్సా ముండా, కొమురం భీమ్, రాంజీ గోండ్ మొదలగు ఆదివాసీల రక్తతర్పణంతో పునీతమైనది గోండ్వానా రాజ్యం. ఈ గోండ్వానాలు ఎవరో కాదు. మూలవాశీల స్వేచ్ఛా ప్రవృత్తికి ప్రతిబింబాలే. వీరుతమ ఆత్మగౌరవాన్ని, ఉనికిని స్థిరపరచుకునే దిశగా చేసిన పోరాటాల ఫలితమే గోండ్వానా కదా! ఇలా వీరి వీర గాథలు, పురాణ గాథలు, త్యాగార్పణలు పఠితలలో ఎంతో ఆసక్తిని రేకెత్తించే విధంగా నవలీకరించారు రచయిత.

ఈ నవలా రచనలోని ఆధ్యాత్మిక కోణం...

"చెట్టులెక్కగలవా ఓ నరహరి ? గుట్ట లెక్కగలవా? ఓ నరహరి! చెట్టు లెక్కగలనే .. ఓ చెంచిత గుట్టలెక్కగలనే.." అనే సినీగీతం యదార్థమేనండోయ్. ఒకప్పటికి చెందిన ఈ నరహరి, చెంచితలే ఇప్పటి శ్రీశైలక్షేత్రంలో భక్తులతో కొలవబడుతున్న మల్లికార్జున స్వామి భ్రమరాంబికా దేవిలని వీరి నమ్మకం. వీరి ఆరాధ్య దేవతలు కూడాను. ఈ దేవాలయ నిర్మాణం చేపట్టింది కూడా మొదట చెంచుజాతి వారేనని రమణారావు ద్వారా చెప్పిస్తాడు రచయిత. నరసింహస్వామి జాతరలో దొంగల దోపు ఉత్సవ తంతును చేస్తారు ఇప్పటికీ.

శివాజీ అంతటి చక్రవర్తి కూడా ఒకానొక సందర్భంలో చెంచుల ఆశ్రయంలో ఉంటూ శత్రుసంహారానికి తగిన యుద్ధ కళలతో పాటుగా తక్కువ ఆయుధాలతో ప్రత్యర్థులను మట్టు పెట్టడం లాంటి విద్యలలో ఆరితేరాడట. దీనికి కృతజ్ఞతగానే నల్లమల అడవుల్లో మల్లన్న క్షేత్రంలో శ్రీశైలం గోపురాన్ని నిర్మించి నాడట. ఇది చారిత్రక సత్యం. ఈ సత్యాన్ని తమ పరిశోధన ద్వారా వెలికితీసి పాఠకులకు అందించిన రచయిత దిలావర్ మిక్కిలి అభినందనీయులు.

బిర్సా ముండా, కొమురం భీమ్, రాంజీ గోండ్ మొదలగు ఆదివాసీల రక్తతర్పణంతో పునీతమైనది గోండ్వానా రాజ్యం. ఈ గోండ్వానాలు ఎవరో కాదు. మూలవాశీల స్వేచ్ఛా ప్రవృత్తికి ప్రతిబింబాలే. వీరుతమ ఆత్మగౌరవాన్ని, ఉనికిని స్థిరపరచుకునే దిశగా చేసిన పోరాటాల ఫలితమే గోండ్వానా కదా! ఇలా వీరి వీర గాథలు, పురాణ గాథలు, త్యాగార్పణలు పఠితలలో ఎంతో ఆసక్తిని రేకెత్తించే విధంగా నవలీకరించారు రచయిత.

అడవిని రక్షించాల్సిన ఫారెస్ట్ వాళ్లే చెంచులను, వారి జీవన విధానంపై దెబ్బకొట్టే విధంగా అధికార దుర్వినియోగం చేయటం చూస్తుంటే వీరి పైత్యం ఎంతగా పెచ్చుమీరి పోయిందో తెలియ జేస్తుంది. స్వార్థం వెయ్యికాళ్ల జెర్రిలా పట్టి పల్లార్చుతున్నది కదా అని పలికిస్తారు రమణారావు పాత్ర ద్వారా.

గత అనుభవాల్ని గుణపాఠాలుగా స్వీకరిస్తూ కొత్త పాఠం నేర్చుకుంటూ ముందడుగు వేయగల సమాజానికే కదా! అభివృద్ధి సాధ్యమయ్యేది.? ఎట్టకేలకు పౌర సంక్షేమాన్ని కాంక్షించే వివిధ రకాల సంఘాలు చేపట్టిన ఆలోచనా భరిత కార్యక్రమాల ద్వారా చెంచుల్లో ఉన్న అమాయకత్వం తొలగి స్తబ్దత స్థానే పురివిప్పిన చైతన్యం తాండవిస్తూ వారంతా కలిసి జంగ్లా తోళ్ళతోటి పోరాటానికి సిద్ధమవుతున్నట్లుగా నవలను మలిచిన తీరు అదనపు ఆకర్షణ ఈ రచనకు.

"మా ఆదివాసీల రక్షణ చట్టాలు మాకు తెలుసు 'పెసా' లాంటివి." అంటూ పెంటవాసులంతా ఓ (సరిహద్దు రేఖను) బెర్రను గీసి "దీన్ని దాటి వస్తే మేము ప్రాణాలకు తెగించి అయినా మా అడవి తల్లిని కాపాడుకుంటాం. బాణాలు ఎక్కు పెడతాం" అని గర్జిస్తారు. శక్తి సింహాల మాదిరిగా జూలు విదిల్చి రణ నినాదాలు చేస్తారు. దీన్ని చూసి భయకంపితులైన జంగ్లా తోళ్ల పలాయనవాదం పఠిస్తారు. వివిధ సంస్థలకు కొమ్ముకాస్తూ అడవిలోకి దూరిన మహామాయగాళ్లు సైతం తోక ముడుస్తారు. ఇలా విజ్ఞాన దాయకమైన చైతన్యభరితమైన సందేశాత్మక ముగింపుతో నవల పాఠకుల మనోమందిరాన్ని చేరుతుంది.

అమెరికాలోని రెడ్ ఇండియన్లకు పట్టిన దుస్థితి మన దేశపు మూలవాసీలైన చెంచులకు పట్టకుండా అభ్యుదయవాది రమణారావు అతని శిష్యబృందం ద్వారా వారిని జాగ్రత్త పరచడం, ముఖ్యంగా యురేనియం దాని నుండి విడుదలయ్యే అణు ధార్మికత కారణంగా చికిత్సే లేని ప్రమాదకరమైన జబ్బులు ప్రబలి అవి మానవజాతిని ఎలా కబళించేది, రోగనిరోధక శక్తిని క్షీణింప చేస్తూ ఇటు పంట భూముల్లోనూ, ప్రాణులన్నింటిలోనూ (మానవులతో సహా) సంభవించే వంధ్యత్వాన్ని గూర్చి సవివరంగా రచయిత విశదపరచిన తీరు ఎంతో అబ్బుర పరుస్తుంది.

ఎంతో విజ్ఞానవంతమైన విలువైన చక్కని ఈ నవలను చదివిన పాఠకులు స్వయంగా ఈ సారాన్ని అనుభూతించాల్సిందే. ఈ నవలా రచనను వెలువరించటంలో రచయిత తీసుకున్న ప్రత్యేక శ్రద్ధాసక్తులు, జిజ్ఞాసతో కూడిన వీరి అధ్యయనాన్ని అభినందించాల్సిందే. ఇలాంటి మరిన్ని విజ్ఞానపూరిత, చారిత్రకంగా అడుగున పడిపోయిన వ్యధాభరిత గాథలను నవలీకరిస్తారని ఆశిస్తూ డాక్టర్ దిలావర్‌కి అభినందనలు, శుభాకాంక్షలు తెలుపుతూ ..



- సోంపాక సీత, 8639311050

సాహితీ వార్తలు

అక్టోబర్ 1న 'కండిషన్స్ అప్లయ్' పరిచయ సభ

పసునూరి రవీందర్ రచించిన 'కండిషన్స్ అప్లయ్' పుస్తక పరిచయ సభ జానుడి– సెంటర్ ఫర్ లిటరేచర్ అండ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో అక్టోబర్ 1న ఉదయం 10:00 గంటలకు ఒంగోలు డాక్టర్ మల్లవరపు రాజేశ్వర రావు భవన్‌లో నిర్వహించనున్నారు. ఈ సభలో ప్రముఖ సాహితీవేత్తలు కోయి కోటేశ్వరరావు, మల్లవరపు రాజేశ్వరరావు, పాటిబండ్ల ఆనందరావు, అనిల కుమారి, పి.రాజ్యలక్ష్మి, కత్తి కళ్యాణ్ పాల్గొని ప్రసంగిస్తారు.

- డా.నూకతోటి రవికుమార్

రచయిత జిల్లేళ్ళ బాలాజీకి 'కె.ఎస్.విరుదు' అనువాద పురస్కారం

కథా రచయిత, అనువాదకుడు జిల్లేళ్ళ బాలాజీకి అనువాదంలో "కె.ఎస్.విరుదు" పురస్కారాన్ని తమిళనాడు కోయంబత్తూరులోని "విజయ రీడర్స్ సర్కిల్" ప్రకటించింది. ఈ పురస్కారాన్ని అక్టోబరు 8న కోయంబత్తూరులో అందించనున్నారు.

ఎలనాగకు 'ఉకియోటో' అవార్డు

ఎలనాగ రచించిన ఆంగ్ల కవితా సంపుటి Dazzlers ను ఉకియోటో అనే అంతర్జాతీయ ప్రచురణ సంస్థ ప్రచురించి, టర్కిష్, ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్ భాషలలోకి అనువదింపజేసింది. ఆ పుస్తకాన్ని రచించినందుకు ఆయనకు "పొయెట్ ఆఫ్ ది ఇయర్ – 2023" అవార్డును ప్రకటించింది. వచ్చే ఏడాది జనవరి 12, 13, 14 తేదీలలో కలకత్తాలో నిర్వహించబోయే సాహిత్య సమారోహం (Kolkata Literary Carnival) లో ప్రదానం చేయనున్నట్టు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

సింహప్రసాద్ సాహిత్య సమితి శ్రీశ్రీ స్మారక కథల పోటీ ఫలితాలు

మహాకవి శ్రీశ్రీకి నివాళిగా సింహప్రసాద్ సాహిత్య సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కథల పోటీ ఫలితాలు వెల్లడించారు. బహుమతి పొందిన కథలు, రచయితలు.. చివరిచూపు కోసం – వెంకట శివకుమార్ కాకు (హైదరాబాద్), అగ్గిపుల్ల – భాస్కరాచారి కశివొజ్జల (వరంగల్), రెండు అగ్గిపుల్లలు చెప్పిన కథ – మల్లారెడ్డి మురళీమోహన్ (విశాఖపట్నం). అక్టోబర్ 14న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించే సభలో బహుమ తులు అందజేస్తారు. వివరాలకు 9849061668 నందు సంప్రదించవచ్చు.

28న ఆచార్య కొలకలూరి ఇనాక్‌కు 'మన కాలపు జాషువా' పురస్కారం

ఈ నెల 28న మహాకవి జాషువా జయంతి సందర్భంగా పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్‌కు 'మన కాలపు జాషువా' పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు జాషువా సాహిత్య వేదిక అధ్యక్ష, కార్యదర్శులు మువ్వా శ్రీనివాసరావు, పగిడిపల్లి వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఖమ్మం జెడ్‌పీ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మందకృష్ణ మాదిగ, గౌరవ అతిథులుగా జి.లక్ష్మి నర్సయ్య, ఆచార్య సి.ఖాసీం హాజరు కానున్నట్లు వారు వెల్లడించారు.

నీ పాటే చాలు బాలు !



పాటకు అమరత్వం అందించిన
గంధర్వ గాయకుడివై
ఘంటసాల వారసుడిగా
తెలుగు సినీ సంగీత
కాగడాను దేశమంతా
రగిలించిన వాడా!
పాటను ప్రేమించి
సంగీతాన్ని శ్వాసించి
గానమే ప్రాణమని
జీవితాన్ని వెలిగించిన రేడా!

నీ గొంతు మోగని సమయం
రేడియో టీవీలకు ఉంటాయా?
నీ పాట వినని రోజున
తెలుగు గుండె లయించదులే!
చిరుగాయకులను చేరదీసి
'పాడుతా తీయగా' అంటూ
సంగీత వినీలాకాశంలో
రెక్కలు తొడిగి విహరింపజేసి
'స్వరాభిషేకం' చేసిన నాదబ్రహ్మవు!
తీయని తెలుగుపాటల పూతోటలో
లేలేత కోయిల కుహూరవాలు నీవే!

ఇంటింటిలో గుండె గుండెలో
నీ మధుర గాన సవ్వడుల రవళులే!
పాట ఆయువు భావంలో ఉంటుందని
కవి ఎదను నీ పాటల్లో నిజాయితీగా
ఆవిష్కరించిన భాషా ప్రేమికుడా!
సంగీతానికి ఎల్లలుండవని
ఏ భాష ఏ యాస అడ్డుకావని
వేవేల పాటల విత్తుల్ని నాటి
తెలుగు నేలను పులకింప చేసిన
పాటల కృషీవలుడివి నీవు!
అందంగా ఇమిడ్చిన గొంతుతో

పాత్రల పరకాయ ప్రవేశం చేసి
పలికిన సప్తవర్ణ రాగాలు
పసి(డి) పలుకులు ప్రేమ విరహం
భక్తి, విప్లవ జానపదాలు నీ గొంతులో
పురివిప్పి నాట్యమాడేవి!
పాట పద్యం మాట నటన
సంగీతం అనుకరణలతో
బహుముఖీన సకళకళా ప్రపూర్ణుడివి!
నీవు మమ్ము వదిలివెళ్లినా
నీ పాట ఎప్పుడూ మాతోనే ఉంటుంది!
ఎదురులేని నాలుగు దశాబ్దాల

నలుభైవేల నీ పాటల మకరందం
గ్రోలేందుకై ఎగిరే తుమ్మెదలెందరో?
నీ సంగీత జైత్రయాత్రలో
నీ పాటల పరిమళాల గుబాళింపులు
సంగీత ప్రేమికుల ఎదల్లో సజీవంగా
సదా అలరిస్తూ ఉంటాయిలే!

(25న బాలు 3వ వర్ధంతి)

- డా. కె. దివాకరాచారి
9391018972

స్థూప దీపం

అడవీ మార్గంలోనో ఖాళీ మైదానాల్లోనో
అభయాన్ని ప్రకటిస్తూ నిలబడ్డ
ఎర్రటి స్థూపాల్ని చూసినపుడల్లా
ప్రాణాలను విడిచినా
కవచాలను వెనుక నడిచే వార్కి దాచి
యిచ్చే వీరుల్లా కనిపిస్తాయి

గోడలకు నోటినీ గాలికి గొంతునీ
అవసరాలకు చేతుల్నీ
వీరులకు చేతల్నీ యిచ్చి
బతుకును పసితనంతో నింపి
తలొంచని అమాయకత్వంలోనే
సిద్ధాంతాలు గుర్తుకొస్తాయి.

ఆయుధాలు వట్టిపోయి వెక్కిరించినా
తానే ఆయుధమై
ఊపిరి జెండా ఎగరేస్తాడు
వర్తమాన పతనానికి చింతించినా
రేపటి ఆకాశానికి వేగుచుక్కవుతాడు

రెండు గుండె చప్పుళ్లను
తనలో వినే అమ్మలాంటి
కోట్లాది జీవ స్పందనల
నేలతల్లి కోసం

దు:ఖాన్ని మోసుకిస్తున్న కాలం కడుపులో



ఉద్యమాలను మోస్తున్న అమ్మలు
చేతిలో తుపాకులున్నా
గుండె లోతుల్లో పూలగుత్తుల్ని
దాచుకున్నందుకేనేమో
ప్రవహించే వెన్నెలై
ప్రతి క్షణాన్నీ వసంతాన్ని
చేయాలనుకుంటాడు

కాలం గ్రీష్మమైనపుడు
అతనొక గొడుగై నిల్చుంటాడు
కూలిన దేహాల నిధులే
చరిత్ర గుర్తులే స్థూపాలై మొలుస్తాయి.

స్థూపాలు భౌతిక నిర్మాణాలు కాదు
ఆశయాల త్యాగాలతో నిర్మించినవవి

దీపస్తంభంలా నిలబడ్డ స్థూపమ్మీది
చిరునామాలో
అర్థరాత్రి బుద్ధుడై యిల్లొదిలినప్పటి
గాజు కళ్ల మెరుపుతో
అమ్మ బేల ముఖం
గుచ్చుకుంటూనే వుంటుంది

దు:ఖపు లోతు పెరిగేకొద్దీ
మనిషి శిఖరమై నిలుస్తాడు
పోరాటంలో పరాధీనమైనా
వీరుని నెత్తురు దట్టించిన
ఫిరంగవుతుంది.

అతని ప్రతి మాటా మనస్సే
ప్రతి చేతా తపస్సే !


శిక్షించడానిక్కాకుండా న్యాయాన్ని
తేల్చే వ్యవస్థలుండాలి
గడ్డకట్టిన వెన్నెల్లోనో
కరుగుతున్న గ్రీష్మంలోనో
కన్నీటి బొట్టు మీద ఆవిరౌతున్న జ్ఞాపకం

ఒక బతుకు కల కోసం
ప్రతి తల్లీ సూర్యుణ్ని కనాలి
ఆ శిశువుతోనే ప్రపంచం
మళ్లీ కొత్తగా పుడుతుంది.

- ర్యాలి ప్రసాద్, 9494553425

పుత్తూరు పిల'గోడు' సరదా కథలు

> బాల్యంలో మనం చేసిన అల్లరి చేష్టలు, చిలిపి పనులు అవన్నీ గుర్తుండడం కష్టం. పెద్దయ్యాక అవన్నీ గుర్తుకొచ్చినప్పుడు మనలో మనమే నవ్వుకుంటాం, సంతోషపడతాం. బాల్య జ్ఞాపకాల ఆధారంగా కథలు రాయడం మరీ కష్టం. అలాంటి ప్రయత్నమే చేశాడు ఆర్.సి.కృష్ణస్వామి రాజు. తిరుపతికి చెందిన ఈయన జీవిత బీమా సంస్థలో పనిచేసి పదవి విరమణ చేసినా కూడా అసలు సిసలైన పల్లెటూరి వాతావరణంతో తన జీవితంలో జరిగిన సంఘటనలు, వాటి తాలూకు విషయాలు బాల్య స్మృతులను కథల రూపంలో రాసి పాఠకుల హృదయాలను గెలుచుకున్న దిట్ట కృష్ణస్వామి రాజు. ఈయన కలం నుండి జాలు వారిన మరో స్వీయ సరదా కథల సంకలనం పుత్తూరు 'పిలగోడు'.



పుస్తకానికి పుత్తూరు పిల'గోడు' శీర్షిక పెట్టడం కూడా ఆలోచించదగ్గదే. ఇందులో పుత్తూరు పిలగోడుగా "కిష్టడు" కనిపిస్తాడు. ఈ కథల్లో చాలా పాత్రలు ఉన్నా కూడా, ఆ పాత్రలన్నీ కిష్టడివి అన్నట్టు అనిపిస్తాయి. నిజానికి కథలన్నీ మంచి సందేశంతో కూడుకున్నవిగా చెప్పవచ్చు. నిజానికి ఈ కథలలో ప్రతి పాత్ర మన చుట్టూ ఉన్నట్టే అనిపిస్తాయి. పల్లెటూర్లలో నివసించే వారికి తప్పనిసరిగా అసలు పేరుకంటే మారు పేర్లు చాలా ఉంటాయి. మారుపేరు చెబితేనే వారు గుర్తుంటారు. అలాగే కథా రచయిత కృష్ణస్వామి రాజు పాఠకులకు అందరికీ గుర్తుండేపోయే విధంగా కిష్టడి పాత్రను సృష్టించాడు. ఈయన రాసిన కథలన్నీ కూడా వ్యంగ్యంతో, హాస్యంతో చమత్కారంతో, ఎంతో శోభాయామానంగా కథలను రాశారు.

రచయిత పెట్టిన కథ శీర్షికలన్నీ ఒకటి రెండు పదాలతో కాకుండా వాక్య రూపంతో చాలా గమ్మత్తుగా అనిపిస్తాయి. అయినా అవి వాస్తవానికి దగ్గరగా ఉన్నవే అని ప్రతి పాఠకుడికి అనిపిస్తాయి.

ఇంకా చెప్పాలంటే ఈ కిష్టడి పాత్ర ఒక రకంగా బాల్యంలోని రచయితది కావచ్చు అనే సందేహం కలుగుతుంది. ఈ పాత్ర మనకు నారద మహర్షిలాగా కనిపించినా, కిష్టడి పాత్రలో మాత్రం జగడాలు పెట్టుకునే వాడు కాదు. ఊర్లో ఎక్కడ ఏ సంఘటన జరిగిన తనని పిలవకపోయినా, అక్కడికి చేరుకునేవాడు. గ్రామస్తులందరికీ అందరికీ ఒక వారధిగా కనిపిస్తాడు. వాడి అమాయకత్వాన్ని చూసి మనలో మనమే నవ్వుకుంటాం. తీరిక లేకుండా అలసిన మన మనసులకు కిట్టడు చెప్పే కథలు వింటే చాలు .మనసు చాలా తేలిక అయి పోతుంది. ఇంకా చెప్పాలంటే గురుగింజంత సంగతి దొరికితే, గుమ్మడికాయ అంత కథ అందిస్తాడు.

ఈ కథలన్నీ చదివితే మనం ఒక్కసారి మన బాల్యంలోకి తొంగి చూసుకుంటాం. మనకు కూడా బాల్య స్మృతులతో కథలు రాయాలి అనే ఆలోచన కలుగుతుంది. ఇలాంటి హాస్యంతో కూడుకున్న టువంటి, వాస్తవానికి దగ్గరగా ఉన్న కథలను ఒక చక్కటి పాత్ర ద్వారా పాఠక క్రియలకు అందిస్తున్న రచయిత కృష్ణస్వామి రాజుకు అభినందనలు శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ వారి కలం నుండి ఇలాంటి మరెన్నో కథలు వెలువడాలని కోరుకుందాం.



- యాడవరం చంద్రకాంత్‌గౌడ్
9441762105

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
ఖమ్మం
సోమవారం | సెప్టెంబర్ 25, 2023 | www.navatelangana.com



మసీదు అభివృద్ధికి లక్ష రూపాయలు విరాళం

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా నియోజకవర్గ బిఆర్ఎస్ అభ్యర్థి, మాజీ శాసనసభ్యులు బాణోత్ మదన్‌లాల్ వైరా మసీదు అభివృద్ధి పనులకు లక్ష రూపాయలను విరాళం ప్రకటించారు. ఆదివారం 50 వేల రూపాయలను మసీదు కమిటీకి అందజేశారు. మరో 50 వేల రూపాయలు రెండు రోజుల్లో ఇస్తానని తెలిపారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన తెలుగుదేశం మండల అధ్యక్షుడు చెరుకూరి చలపతిరావును పరామర్శించారు. కార్యక్రమంలో బాణాల వెంకటేశ్వరరావు, కట్టా క్రిష్ణార్జునరావు, వనమా విశ్వేశ్వరరావు, డాక్టర్ దారెల్లి కొటయ్య, మాదినేని దుర్గాప్రసాద్, దొంతేబోయిన వెంకటేశ్వర్లు, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



రక్త పరీక్షలు ఉచితం : ఎంపీపీ

నవతెలంగాణ- తల్లాడ

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరోగ్య శ్రీ పథకం ద్వారా అన్ని రకాల రక్త పరీక్షలు చేసుకునే అవకాశం ఉందని ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు అన్నారు. అన్నారుగూడెం గ్రామంలో ఆరోగ్యశ్రీ ద్వారా లేబర్ కార్డు కలిగిన వారికి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ లేబర్ కార్డు ద్వారా ప్రమాదవశాత్తు అవయవాలు కోల్పోతే మూడు లక్షలు, గాయాలయితే ఉచిత చికిత్సలు పొందవచ్చు అన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ గోవింద శ్రీనివాసరావు, ఇస్నపల్లి పిచ్చయ్య, పావురాల కృష్ణ, గుడ ప్రభాకర్, శ్రీనివాసరావు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



వల్లభిలో జడ్పీ చైర్మన్ పర్యటన

నవతెలంగాణ- ముదిగొండ

వల్లభిలో జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా క్రైస్తవ మత పెద్దలు నూతనంగా నిర్మించనున్న ఆర్సిఎం చర్చికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతి చెందిన పలు కుటుంబాల నివాసాలను ఆయన సందర్శించి పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ సామినేని హరిప్రసాద్, జడ్పీటిసి పసుపులేటి దుర్గవెంకట్, గ్రామసర్పంచ్ పోట్ల కృష్ణకుమారి ప్రసాద్, నాయకులు నీరుకొండ సతీష్, బిచ్చాల ధనమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

నవతెలంగాణ-కారేపల్లి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన కారేపల్లి మండలం భీక్యాతండా సమీపంలోని మూలమలుపు వద్ద ఆదివారం చోటుచేసుకుంది. పోలంపల్లి గ్రామానికి చెందిన మోతీలాల్ సూర్యతండా నుండి కారేపల్లి కి మోటర్ సైకిల్‌పై వస్తున్నాడు. బీక్యాతండా దాటిన తర్వాత మూలమలుపు వద్ద మోటర్ సైకిల్ అదుపుతప్పి క్రిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో మోతీలాల్‌కు తీవ్రగాయాలై స్పృహ కోల్పోయాడు. దీనిని గమనించిన బీఆర్ఎస్ యూత్ జిల్లా నాయకులు అజ్మీర వీరన్న వెంటనే 108కు ఫోన్ చేసి దాని ద్వారాయ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని కానిస్టేబుల్ సీతారాములు సందర్శించి విచారించారు.

పాలకుల విధానాలతో సంక్షోభం

నవతెలంగాణ-కారేపల్లి

పాలకుల విధానాలతో దేశం సంక్షోభంలో కూరకపోతుందని సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కెచ్చెల రంగారెడ్డి అన్నారు. కారేపల్లి వైఎస్ఎన్ గార్డెన్‌లో ప్రజాపంథా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి రాజకీయ శిక్షణాతరగతలు ఆదివారం ముగిశాయి. ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కేసీఆర్ నిరుద్యోగుల జీవితాలతో ఆటలు ఆడుకుంటున్నారన్నారు. ఏ ఒక్క నోటిఫికేషన్ పూర్తి అయిన దాఖలాలు లేకుండా పోయిందన్నారు. పథకాల పేరుతో ప్రజలను మోసం చేయటమే పనిగా పెట్టుకున్నారన్నారు. సమస్యలకు కారణమైన పాలకులపై ప్రజా సమీకరణలతో పెద్ద ఉద్యమాల నిర్మాణం జరగాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రజాపంథా జిల్లా క్యాదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు గుమ్మడి నర్సయ్య, జిల్లా నాయకులు ఆవుల అశోక్, సీవై.పుల్లయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, ఆర్,శివలింగం, జీ.రామయ్య, గుమ్మడి సందీప్, ఎస్వీ.రాకేష్, కంకణాల అర్జున్‌రావు, ఏ.వెంకటరెడ్డి పాల్గొన్నారు.



నంబూరి మధుకు సన్మానం

నవతెలంగాణ-వైరా

15 సంవత్సరాలుగా లయన్స్ క్లబ్ ,స్వచ్ఛంద సంస్థల ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న లయన్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్- 2 నంబూరి మధు వైరా మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ప్రభుత్వంచే నియమితులై రైతులకు సేవ చేసే అవకాశం కలిగిన సందర్భంగా వైరా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్థానిక వేద పాఠశాలలో జరిగిన కార్యక్రమం లో వైరా క్లబ్ అధ్యక్షులు పెనుగొండ ఉపేంద్రరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమం లో డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ చింతానిప్పు వెంకటయ్య మాట్లాడుతూ ఫలితాన్ని ఆశించకుండా కష్టపడి సేవా కార్యక్రమాలు కొన సాగించే వారికి సమాజంలో ఎల్లప్పుడూ గుర్తింపు లభిస్తుందని అన్నారు. లయన్స్ క్లబ్ వైరా వారి ఆధ్వర్యంలో వేద పాఠశాల గురువులచే వేద ఆశీర్వచనం చేయించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పెనుగొండ ఉపేంద్రరావు, డిస్ట్రిక్ట్ చైర్పర్సన్ చింత నిప్పు వెంకటయ్య, కార్యదర్శి అబ్బూరి రమేష్, కోశాధికారి చింతలపూడి వెంకటేశ్వరరావు మీల్స్ ఆన్ వీల్స్ కోఆర్డినేటర్ చింతోజు నాగేశ్వరరావు, కన్యదారి హనుమాయమ్మ, చింతోజు సీత, సిహెచ్ వాసవి, వేద పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీఎస్పీఎస్సీ కమిటీని రద్దు చేయాలి

నవతెలంగాణ-వైరా

రాష్ట్రంలో టిఎస్‌పిఎస్‌సి కమిటీని రద్దు చేయాలని, నిరుద్యోగులకు నష్టపరిహారం చెల్లించాలని బిఎస్‌పి డిమాండ్ చేసింది. ఆ పార్టీ జిల్లా నాయకులు రాంబాబు నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం వైరాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యోగ నోటిఫికేషన్లు ఇచ్చి నిరుద్యోగులను మోసం చేస్తున్నారని విమర్శించారు. గ్రూప్ వన్, గ్రూప్ టూ, పరీక్షల నిర్వహణలో అవకతవకలు జరిగాయని అన్నారు. రాష్ట్రంలో 30 లక్షల మంది విద్యార్థులు ఉద్యోగ నోటిఫికేషన్ ద్వారా తీవ్రంగా నష్టపోయారని అన్నారు. పరీక్షల నిర్వహించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. కార్యక్రమంలో బానోతు రాంబాబు నాయక్, బీఎస్పీ వైరా నియోజక వర్గ ఇంఛార్జి బానోతు రజినీ బాయి, బీఎస్పీ ఖమ్మం జిల్లా మహిళా కన్వీనర్, ఉదయ్ స్వేరో ఖమ్మం జిల్లా అధ్యక్షులు స్వేరోస్ నెట్వర్క్, మాడుగుల శరత్ బాబు, వైరా నియోజక వర్గ అధ్యక్షులు యంగల నరేష్ పాల్గొన్నారు.

ఐద్వా ప్రచార జాతాను జయప్రదం చేయండి

- ఐద్వా వైరా పట్టణ కార్యదర్శి గుడిమెట్ల రజిత

నవతెలంగాణ-వైరాటౌన్

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార జాతను జయప్రదం చేయాలని ఐద్వా వైరా పట్టణ కార్యదర్శి గుడిమెట్ల రజిత కోరారు. ఆదివారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాలలో ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తూ విస్తత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుడిమెట్ల రజిత మాట్లాడుతూ బిజెపి మహిళా వ్యతిరేక విధానాలను వివరించి మహిళలను చైతన్యం చేస్తూ జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న పచార జాత నేడు వైరా పట్టణానికి వస్తుందని, సోమవారం సాయంత్రం 5గంటలకు వైరా బస్ స్టాండ్ వద్ద నిర్వహించే సభలో ఐద్వా రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని తెలిపారు.



మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రచార జాతను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు గుమ్మా వెంకట సాయి లక్ష్మి, మల్లెంపాటి శకుంతల, చావా కళావతి, తాటి కృష్ణకుమారి, బత్తుల ప్రమీల, బందేల అమతమ్మ, దుద్దుకూరి వీరమ్మ, రాచబంటి విజయ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ మారణకాండ మరిపించి ...

ఎన్నికల్లో గద్దనెక్కేందుకే మహిళా రిజర్వేషన్ బిల్లు

ఐద్వా జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి

నవతెలంగాణ- నేలకొండపల్లి



మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న మారణకాండను ప్రజల దృష్టి నుండి మరలించి రానున్న ఎన్నికల్లో తిరిగి గద్దెనెక్కెందుకే కేంద్రంలోని బిజెపి సర్కారు మహిళ రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చిందని ఐద్వా జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి విమర్శించారు. బిజెపి మహిళా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అక్టోబర్ 5న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఐద్వా ఆధ్వర్యంలో చేపట్టిన భారీ నిరసన ర్యాలీని జయప్రదం కోరుతూ ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన జీపు జాత ఆదివారం మండలంలోని మోటాపురం గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఐద్వా మండల కార్యదర్శి బెల్లం లక్ష్మీ అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు పేరుతో రానున్న ఎన్నికల్లో మహిళా ఓట్లను దండుకొని లబ్ది పొందేందుకు మరోసారి మోసం చేసేందుకు బిజెపి సర్కార్ కుట్ర చేస్తుందని మండిపడ్డారు. గత తొమ్మిదిన్నర ఏళ్ళుగా పార్లమెంటులో అనేక బిల్లులను మెజారిటీ సభ్యులతో అవలీలగా ఆమోదింపు చేసుకున్న బిజెపి ప్రభుత్వం పార్లమెంట్ చివరి దశలో మహిళా బిల్లు తీసుకురావడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని? ఆమె ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ కూడా జనగణన, నియోజకవర్గాల పునర్విభజన తర్వాతనే అమలు చేస్తామంటూ అందని ద్రాక్షగా చూపించడం వెనుక బిజెపి ప్రభుత్వ కుట్ర దాగి ఉందని మహిళలు ప్రజలు గమనించాలన్నారు. మణిపూర్ మారణకాండపై చర్చ జరగకుండా ఉండేందుకే మహిళలపై కపట ప్రేమ చూపేందుకే మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చారన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం అపహస్యం పాలవుతుందని, భారత రాజ్యాంగాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవానికి దేశ ప్రథమ పౌరురాలు, ప్రథమ మహిళ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆహ్వానించకుండా అవమానపరచడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనన్నారు. ఒక గిరిజన జాతికి చెందిన వితంతురాలనే దుర్మార్గపు ఆలోచనతోనే పార్లమెంటు ప్రారంభోత్సవానికి ఆహ్వానించలేదనే విషయాన్ని ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. మణిపూర్ రాష్ట్రంలో నేటికీ మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు జరుగుతున్న బిజెపి ప్రభుత్వం, ప్రధాని మోడీ నోరు మెదపకపోవడం వారి ఉన్మాద రాజకీయాలకు అద్దం పడుతుందన్నారు. బిజెపి మతోన్మాద అరాచక పాలనను అంతమొందించేందుకు మహిళలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలని, మహిళల హక్కుల రక్షణకై భద్రత భరోసా కల్పించాలని, కేరళ తమిళనాడు తరహాలో 14 రకాల సరుకులను రేషన్ దుకాణాల ద్వారా అందించాలని, నిత్యవసర ధరలు నియంత్రించాలని, ఇండ్ల నిర్మాణానికి కేంద్రం 10 లక్షలు రాష్ట్రం 5 లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 5న ఢిల్లీలో జరిగే బిజెపి వ్యతిరేక నిరసన ర్యాలీకి భారీ సంఖ్యలో మహిళలు కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ, జిల్లా అధ్యక్షురాలు బండి పద్మ, మేరుగు రమణ, సుమతి, ఎస్ కే బేబీ, అమరావతి, భూక్య జ్యోతి, సిరికొండ వెంకట్రావమ్మ, శ్యామలైటి పద్మ, పడిశాల పుణ్యవతి, వీరమ్మ, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.



దళిత కాలనీలలో మౌలిక సౌకర్యాలు కల్పించాలి : కెవిపీఎస్

నవతెలంగాణ- నేలకొండపల్లి

గ్రామీణ ప్రాంతాల్లోని దళిత కాలనీలలో మౌలిక సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే సమస్యలను పరిష్కరించాలని కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు పాపేట్ల సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళితులకు దళిత బంధు, 100 యూనిట్ల ఉచిత కరెంటు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 4వ తేదీన స్థానిక శ్రీ సీతారామ ఫంక్షన్ హాల్ లో జరిగే మండల సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో మండలంలోని బోదులబండ, మంగ్రాజుపల్లి, చెన్నారం, సుర్దేపల్లి, కోరట్లగూడెం, కోనాయిగూడెం తదితర గ్రామాలలో గ్రూప్ మీటింగ్ లు నిర్వహించి విస్తత ప్రచారం చేశారు, ఈ సందర్భంగా దళిత కాలనీలలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తమ దష్టికి వచ్చిందన్నారు. కాలనీలలో రోడ్లు, డ్రైనేజీ సక్రమంగా లేకపోవడంతో కొద్దిపాటి వర్షానికే నీరు నిలిచిపోయి రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయన్నారు. నిలిచిపోయిన నీటిలో ఈగలు, దోమలు, పందులకు ఆవాసాలుగా మారి ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలలో దళిత బంధు లబ్ధిదారుల ఎంపికలో అధికార పార్టీ నాయకుల జోక్యంతో అనేక అవకతవకలు జరుగుతున్నాయన్నారు. ఒకటి రెండు యూనిట్లు మాత్రమే పంపిణీ చేసి చేతులు దులుపుకుంటున్నారన్నారు. 101 యూనిట్ల ఉచిత విద్యుత్తు దళిత కాలనీలలో ఎక్కడ అమలు కావడం లేదన్నారు. విద్యుత్ అధికారులు అధిక బిల్లులు వేసి బలవంతంగా వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని దళిత బంధు లబ్ధిదారుల ఎంపికలో అధికార పార్టీ నాయకుల జోక్యాన్ని నివారించి రాజకీయాలకతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి యూనిట్లు మంజూరు చేయాలని లేనియెడల దళితులను పెద్ద ఎత్తున సమీకరించి ఉద్యమాలను ఉదతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు, మండల కన్వీనర్ బండి రామమూర్తి, నాయకులు పెదపాక భాస్కర్ రావు, బొడ్డు బాబురావు సామేలు, వెంకట నరసయ్య, బాలు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



మెడికల్ పీజీ ఎంట్రన్స్‌లో

మెరిసిన ఆణిముత్యం

ఎంఎస్(ఓబీజీ)లో సీటు సాధించిన డాక్టర్ బానోత్ నివేదిత

నవతెలంగాణ-కారేపల్లి

మెడికల్ పీజీ ఎంట్రన్స్‌లో గిరిజన అణిముత్యం డాక్టర్ బానోత్ నివేదిత మెరిసింది. పీజీ ఎంట్రన్స్‌లో ప్రతిభ చూపి విజయవాడలోని ప్రభుత్వ సిద్దార్ధ మెడికల్ కళాశాలలో ఎంఎస్(ఒబీజీ) గైనిక్‌లో సీటు సాధించింది. నీట్ పీజీ ఎంట్రన్స్‌లో 455 మార్కులు, అల్ఇండియా కేటగిరిలో 313 ర్యాంకు సాధించిన డాక్టర్ బానోత్ నివేదిత ఆలిండియా కోటా లో మొదటి రౌండ్‌లోనే విజయవాడలోని ప్రభుత్వం సిద్ధార్ధ మెడికల్ కళాశాలలో సీటు సాధించింది శభాస్ అనిపించుకుంది. డాక్టర్ నివేదిత కారేపల్లిలోని నిర్మల హైస్కూల్‌లో పదోతరగతి వరకు చదివింది. తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడు టీఎస్‌యూటీఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి బానోత్ రాందాస్, తల్లి భారతి ఐద్వా నాయకురాలు. చెల్లి బానోత్ నిఖిత సైతం తిరుపతి పద్మావతి మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ఫైనలీయర్ చదువుతుంది. చిన్నతనం నుండి చదువులలో చురుకు ఉండే నివేదితకు తల్లిదండ్రుల ప్రోత్సహం తోడై ఒకోమెట్టు ఎక్కుతూ ఉన్నత స్థాయికి చేరుకుంటుంది. 10వ తరగతిలో 9.5జీపీఏతో మండల సెకండ్, ఇంటర్ ఖమ్మంలో శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో చదివి 968 మార్కులు సాధించింది. 2016-2021 వరకు గుంటూరులోని కాటూరి మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన నివేదిత డాక్టర్ పట్టా పొందింది. పేదలకు న్యాయమైన ఉచిత వైద్యం అందించటమే లక్ష్యమని తెలిపింది. మహిళలు ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలకు వైద్యం అందింతటమే తన తక్షణ కర్తవ్యమంటుంది. తాను మెడిసిన్ చదువుతున్న క్రమంలో తనకు కారేపల్లిలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ సామినేని రాఘవులు గైడ్ చేశారని వారికి కృతజ్ఞతలు తెలిపింది. మెడికల్ పీజీలో సీటు సాధించిన డాక్టర్ బానోత్ నివేదితను ఎంపీపీ మాలోత్ శకుంతలకిషోర్, జడ్పీటీసీ వాంకుడోత్ జగన్, సీపీఐ(ఎం)జిల్లా కమిటీ సభ్యులు మెరుగు సత్యనారాయణ, కొండెబోయిన నాగేశ్వరరావు, కే.నరేంద్ర, వజ్జా రామారావు, ముక్కా సీతారాములు, బాదావత్ రాములు అభినందించారు.

కాంగ్రెస్ గూండాల దాడి

- గాయపడ్డ సీపీఐ(ఎం) కార్యకర్తలు

- గ్రామపంచాయతీ తీర్మానం లేకుండా అక్రమ నిర్మాణాలు

- అడ్డుకున్న గ్రామపంచాయతీ పాలకవర్గంపై కాంగ్రెస్ గూండాల దాడి

- సర్పంచ్ తనయుడు రమేష్ వీరంగం

- గోవిందాపురం గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత

- భారీగా మోహరించిన పోలీసు బలగాలు

నవతెలంగాణ - బోనకల్

గ్రామపంచాయతీ పాలకవర్గం తీర్మానం లేకుండానే ఏకపక్షంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచ్ అక్రమ కట్టడం నిర్మాణాలు చేపట్టారు. మెజార్టీ పాలకవర్గ తీర్మానం కాకుండా ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలు చేపట్టడానికి వీలులేదని మెజార్టీ పాలకవర్గ సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. గ్రామపంచాయతీ తీర్మానం లేకుండా అక్రమంగా దేవాలయం పేరుతో కాంగ్రెస్ సర్పంచి నిర్మాణాలు చేపట్టడంతో మెజార్టీ సీపీఐ(ఎం) చెందిన పాలకవర్గం ఆదివారం అడ్డుకుంది. దీంతో కాంగ్రెస్ గూండాలు సీపీఐ(ఎం)కి చెందిన పంచాయతీ పాలకవర్గంపై కర్రలు, రాళ్లతో విచక్షణారహితంగా దాడులకు పాల్పడ్డారు. ఐదుగురు సిపిఎంకి చెందిన కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారు. అందరూ ఊహించినట్లుగానే కాంగ్రెస్ దాడులకు తెగబడటంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సంఘటన మండల పరిధిలోని గోవిందాపురం ఎల్ గ్రామంలో ఆదివారం జరిగింది. సిపిఎంకు చెందిన పంచాయతీ పాలకవర్గం తెలిపిన వివరాల ప్రకారం.. పాలకవర్గంలో మొత్తం పదిమంది సభ్యులు ఉన్నారు. ఇందులో ముగ్గురు కాంగ్రెస్, ఏడుగురు సిపిఎంకు చెందినవారు ఉన్నారు. పాలకవర్గం ఏర్పడినప్పటి నుంచి తీర్మానాలు లేకుండానే కాంగ్రెస్‌కు చెందిన సర్పంచ్ ఉమ్మనేని బాబు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడు. ఈ క్రమంలో పాలకవర్గం తీర్మానం, అనుమతి లేకుండా రైతు వేదిక, మసీదు మధ్యలో దేవుడి గుడి నిర్మాణం చేపట్టాడు. మసీదు పక్కనే దేవుడు గుడి నిర్మించవద్దని గ్రామస్తులందరూ వారించారు. అయినా సర్పంచ్ తన పట్టు వదలలేదు. రైతు వేదిక, గుడిమధ్య కొంత ఖాళీ స్థలం ఉంది. ఈ స్థలంలో పాఠశాలకు చెందిన విద్యార్థులకు క్రీడాస్థలం కోసం కేటాయించాలని మెజార్టీ పాలకవర్గం గత కొంతకాలంగా పట్టుబడుతూ వస్తుంది. ఈ క్రమంలో సర్పంచ్ శనివారం ఖాళీ స్థలంలో అక్రమ నిర్మాణం చేపట్టాడు. దీంతో సిపిఎంకు చెందిన మెజార్టీ పాలకవర్గం అక్రమ నిర్మాణాలను అడ్డుకుంది. దీంతో సర్పంచ్ ఉమ్మనేని బాబు అతని తనయుడు రౌడీ రమేష్ మరి కొంతమంది కాంగ్రెస్ గూండాలు రాళ్ళ, కర్రలతో వారిపై విరుచుకుపడ్డారు. గ్రామంలో ఈ సంఘటన దావణంలా వ్యాపించింది. దీంతో సిపిఎంకి చెందిన కార్యకర్తల కొంతమంది పంచాయతీ పాలకవర్గ సభ్యులకు మద్దతుగా వెళ్లారు. దీంతో కాంగ్రెస్ గుండాలు, ఉమ్మనేని రమేష్ దొరికిన వారిని దొరికినట్లు చితక బాదారు. ఈ దాడిలో సిపిఎంకి చెందిన ఉపసర్పంచ్ కారంగుల చంద్రయ్య కార్యకర్తలు తమ్మారపు తమ్మారపు కృష్ణ, కారంగుల కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ కొమ్ము కమలమ్మ, కారంగుల సురేష్, షేక్ మదార్, దొంతి బోయిన అచ్చయ్య, షేక్ రంజాన్, కారంగుల లక్ష్మణ, షేక్ సైదులు గాయపడ్డారు. ఉమ్మనేని రమేష్ గత కొంతకాలంగా గ్రామంలో అలజడులు సృష్టిస్తున్నాడు. కాంగ్రెస్ గూండాల దాడిని సిపిఎం కార్యకర్తలు అడ్డుకున్నారు. సంఘటన స్థలానికి పెద్ద ఎత్తున సిపిఎం కార్యకర్తలు చేరుకోవటంతో ఒక దశలో సర్పంచ్ ఉమ్మనేని బాబు, రౌడీ రమేష్ అక్కడ నుంచి పరారయ్యారు. ఈ విషయం ఒక్కసారిగా దావణంలా మండల వ్యాప్తంగా వ్యాపించింది. సిపిఎం నాయకులు ఘర్షణ విషయాన్ని స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై బొల్లెద్దు సాయికుమార్ తన సిబ్బందితో కలిసి ఉదయం 10 గంటల సమయంలో గోవిందాపురం ఎల్ వెళ్లారు. అప్పటికే కాంగ్రెస్‌కు చెందిన వారు కర్రలు, రాడ్లతో గ్రామంలో స్వైర విహారం చేస్తూనే ఉన్నారు. దాదాపు రెండు గంటల పాటు గ్రామంలో కాంగ్రెస్ గుండాలు స్వైర విహారం చేశారు. వైరా ఏసిపి మహమ్మద్ అబ్దుల్ రెహమాన్, సీఐ జానోట్ వసంత కుమార్ బోనకల్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. పరిస్థితి చేయి దాటి పోకుండా పోలీసు బలగాలను గోవిందాపురం ఎల్ గ్రామంలో పెద్ద ఎత్తున దింపారు. గోవిందాపురం ఎల్ గ్రామంలో 144 సెక్షన్ విధించారు.



కాంగ్రెస్ గూండాల దాడిలో గాయపడ్డ సీపీఐ(ఎం) కార్యకర్తలు

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రప్రభుత్వం దిష్టిబొమ్మ దగ్ధం

నవతెలంగాణ- ఖమ్మం

గ్రూప్- 1 రద్దు ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటికాల రామకృష్ణ అన్నారు. ఆదివారం ఖమ్మంలోని పీజీ కళాశాల ఎదుట రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న స్వరాష్ట్రంలో ఉద్యోగాలు వస్తాయని తమ భవిష్యత్తు బాగుంటుందని ఎదురుచూసిన నిరుద్యోగుల నోట్లల్లో మన్ను కొట్టే ప్రయత్నం చేయడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు యువరాజ్, శివ నాయక్, చందులాల్, సుకుమార్, నరేష్, గోపి, మల్సూర్, వినయ్ పాల్గొన్నారు.

సామినేని కోటేశ్వరరావుకు నివాళి

నవతెలంగాణ-మధిర

ఖమ్మంపాడు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సామినేని కోటేశ్వర రావు ఇటీవల అకాల మరణం చెందగా ఆదివారం పెద్దకర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ కోట రాంబాబు హాజరై కోటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, సర్పంచ్ పులి బండ్ల చిట్టిబాబు, అద్దంకి రవికుమార్, ధారా బాలరాజు, వై.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విలీన గ్రామాలకు గ్రామీణ ఉపాధి పనులు కల్పించాలి : వ్యకాస

నవతెలంగాణ- ఖమ్మం

ఖమ్మం కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాలకు ఉపాధి హామీ పనులు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నెకంటి సంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మంలోని కైకొండాయిగూడెం, రామన్నపేట గ్రామాలలో గ్రామ జనరల్ బాడీ సమావేశం గద్దల నాగయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని ,రోజు కూలి రూ 600 రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలందరికీ ప్రభుత్వం కూలి బందు, కూలి బీమా ప్రకటించి ఆదుకోవాలని ఆయన అన్నారు. అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తుందని ఆయన అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిరుపేదలందరికీ రేషన్ కార్డులు ఇండ్లు ఇండ్ల స్థలాలు ఆసరా పెన్షన్లు వికలాంగుల పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనియెడల వ్యవసాయ కూలీలులను పెద్ద ఎత్తున సమీకరించి ప్రత్యేక ఆందోళనకు పూనుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో వ్యకాస జిల్లా నాయకురాలు గద్దల రత్తమ్మ, గద్దల జనార్ధన్, మండల నాయకులు గద్దల వీరబాబు, గద్దల చిన్నప్ప, గుర్రం కృష్ణయ్య, తాటికొండ శ్రీనివాసరావు, కూచిపూడి గోపయ్య, వడిగల వీరయ్య, కూచిపూడి వెంకట్రావు, ముఠామేస్త్రిలు మంగ, ఎంకమ్మ, సత్యవతి, ప్రమీల, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.



పాలేరు టికెట్ మహిళకే కేటాయించాలి

వలస పక్షులకు టికెట్ ఇవ్వద్దు

కాంగ్రెస్ నాయకురాలు రామసహాయం మాధవరెడ్డి

నవతెలంగాణ- కూసుమంచి

పాలేరు టికెట్ మహిళకే కేటాయించాలని కాంగ్రెస్ అధిష్టానాన్ని ఆ పార్టీ నాయకురాలు రామసహాయం మాధవిరెడ్డి కోరారు. వలస పక్షులకు ఎట్టి పరిస్థితుల్లోనూ టికెట్ ఇవ్వదని కోరారు. ఈ మేరకు ఆమె పాలేరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎంఎల్ఏ పార్టీని వీడి అధికార పార్టీ చెంతన చేరితే పార్టీ కార్యకర్తలను పట్టించుకున్న నాథుడు లేడన్నారు. ఆ సమయంలో తాను కార్యకర్తలకు అండగా ఉన్నానని, ఎన్ని కష్టాలు వచ్చినా పార్టీని తాము వీడలేదన్నారు. ప్రస్తుతం పాలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా గెలుచు తీరుతుందన్నారు. జిల్లాలో మొదట గెలిచే సీటు కూడా పాలేరు అని ధీమా వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వలస పక్షులకు టికెట్ ఇస్తే గెలిచిన వెంటనే వారు కూడా పార్టీ మారుతారని, అందుకు స్థానికులు, మహిళ కోటాలో పార్టీనే నమ్ముకొని పనిచేస్తున్న తనకు టికెట్ ఇవ్వాలని కోరారు. సమావేశంలో నాయకులు మట్టె గురవయ్య, మీసా ముత్తయ్య, దండా సత్యనారాయణ, మునగంటి రాములు, గాజుల పిచ్చయ్య, మొక్క రామకృష్ణ పాల్గొన్నారు.



మహిళ రిజర్వేషన్ బిల్లు వెంటనే అమలు చేయాలి

నవతెలంగాణ-వైరాటౌన్

పార్లమెంటు ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లు అసమగ్రంగా ఉందని, చట్ట సభల్లో మహిళ రిజర్వేషన్ అమలుకు ఐదు సంవత్సరాల సమయం ఇవ్వటం సరికాదని వైరా మాజీ ఎంపిపి బొంతు సమత అన్నారు. ఆదివారం వైరా బోడేపూడి వెంకటేశ్వరరావు భవనంలో జరిగిన స్టడీ సర్కిల్ లో మహిళ రిజర్వేషన్ బిల్లు పై మాట్లాడుతూ 1996లో చట్ట సభల్లో మహిళ రిజర్వేషన్ బిల్లు కోసం ప్రయత్నాలు చేసినా 2023 వరకు ఆమోదం పొందలేదని అన్నారు. పార్లమెంటు ఆమోదం పొందిన తర్వాత వచ్చే ఎన్నికల్లో కాకుండా తర్వాత వచ్చే ఎన్నికల్లో అమలు చేయడం అంటే ప్రభుత్వం ఎన్నికల లబ్ధి కోసమే ప్రస్తుత ప్రయత్నం అన్నారు. దేశంలో రోజు రోజుకు మహిళలకు జీవన భద్రత లేకుండా పోయిందని, ప్రపంచం మహిళలలో రక్తహీనతతో బాధపడేవారు భారత దేశంలో అతిపెద్ద సంఖ్యలో ఉన్నారని, మహిళలు పైన సాముహిక దాడులు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బొంతు రాంబాబు, తోట నాగేశ్వరరావు, మందడపు రామారావు తదితరులు పాల్గొన్నారు.

భీక్యాతండాలో అన్నదానం ప్రారంభించిన సీఐ

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలంలో గణేష్ మండపాల వద్ద నిర్వాహకులు అన్నదానాల జోరు పెంచారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద అన్నదానాలు, సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తూ సందడిగా ఉత్సవాలను జరుపుతున్నారు. బీక్యాతండాలో బీఆర్ఎస్ యువజన విభాగం జిల్లా నాయకులు,జీవన్‌లాల్ సేనా ముఖ్యులు అజ్మీర వీరన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు ప్రారంభించారు. కారేపల్లిలోని పాత శివాలయం, పెద్దమ్మగడ్డ వద్ద గల గణేష్ మండపాల వద్ద ఏర్పాటు చేసిన అన్నదానంకు కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మేదరి వీరప్రతాఫ్(టోనీ) రూ.10 వేల చొప్పున మొత్తం రూ.20వేలు విరాళం అందజేశారు. ఈకార్యక్రమాలలో అప్పాయిగూడెం సర్పంచ్ అజ్మీర అరుణ, ఉపసర్పంచ్ భూక్యా రాజేష్, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

ముదిగొండలో అన్నదానం

నవతెలంగాణ-ముదిగొండ

ముదిగొండ గ్రామంలో తొమ్మిదో వార్డులో ఏర్పాటు చేసిన గణేష్ నవరాత్రుల సందర్భంగా ఏడవ రోజు ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేగినాటి బుచ్చిబాబు, నాని, వేగనాటి నాగేశ్వరరావు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అన్నదానం ప్రారంభించిన మదన్‌లాల్

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా మున్సిపాలిటీలో ఆదివారం వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ పర్యటించారు. వాసవి కళ్యాణ మండపం నందు ఏర్పాటుచేసిన గణపతి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మహా అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బాణల వెంకటేశ్వర్లు, ముళ్ళపాటి , సీతారాములు కట్టా కష్టార్జునరావు, వనమా విశ్వేశ్వరరావు, డాక్టర్ దారేల్లీ కోటయ్య, మాదినేని దుర్గాప్రసాద్, దోంతేబోయన వెంకటేశ్వర్లు, సాధం రామారావు, ఆదూరి ప్రేమ్ కుమార్, వజినేపల్లి చక్రవర్తి, మిట్టపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అక్రమ అరెస్టు నిరసిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ

నవతెలంగాణ- చింతకాని



మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ నిర్బంధాన్ని నిరసిస్తూ చింతకాని మండలం నాగుల వంచలో పార్టీలకతీతంగా నల్ల బ్యాడ్జీలు , కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అక్రమంగా చంద్రబాబును అరెస్టు చేయడం కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ ఖమ్మం పార్లమెంటరీ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం... తెదేపా జిల్లా కార్యదర్శి కేతినేని హరీశ్.. తాళ్లూరి జై చౌదరి.. కన్నేటి పృథ్వి, వంకాయలపాటి లచ్చయ్య, తోటకూరి వెంకట నరసయ్య, అంబటి వెంకటేశ్వరరావు, ఆలస్యం బసవయ్య, తుమ్మలపల్లి వెంకట్రావు, బైరుఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై ప్రభుత్వ అయిష్టత

- ఉద్దేశపూర్వకంగానే కాలయాపన
- అన్ని జిల్లాల్లో లేని అనుమతులు ఖమ్మంలోనే ఎందుకు..?
- ముఖ్యమంత్రి హామీమేరకు జర్నలిస్టులందరికీ ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇవ్వాలి
- ఈ నెల 30 లోపు అధికారిక స్పందన రాకుంటే రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు జర్నలిస్టు సంఘాల సమాయత్వంతో ఆందోళన చేపడతాం
- విలేకరుల సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ ఖమ్మం



జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వడం ప్రభుత్వానికి ఇష్టం లేకనే ఉద్దేశపూర్వకంగానే కాలయాపన చేస్తున్నారని, ఆర్థిక మంత్రి హరీష్ రావు ఇలాఖాలతో పాటు అన్ని జిల్లాల్లో లేని అనుమతులు ఖమ్మంలోనే ఎందుకనీ , ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన ప్రకారం వెంటనే జర్నలిస్టులందరికీ ఉచితంగా ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల విషయంలో తెలంగాణ రాకముందు హామీలు ఇచ్చారని, తెలంగాణ వచ్చినాక గత పది సంవత్సరాలుగా హామీలు ఇస్తున్నారే కానీ సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. పాత్రికేయ సంఘాలు చాలా కాలంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని, అదేవిధంగా సిపిఎం కూడా అనేక సందర్భాల్లో ఈ సమస్యను ప్రస్తావించామని, జర్నలిస్టుల సమస్యల కోసం జిల్లావ్యాప్తంగా ధర్నా కార్యక్రమం నిర్వహించామని, సిపిఎం పార్టీ జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యపై ధర్నా చేసిన రోజే అనేక సంఘాలు సంఘీభావం తెలిపాయని అన్నారు. ప్రభుత్వం నుండి కూడా హామీ ఇచ్చారని, రెండు జర్నలిస్ట్ మహాసభల్లో పాల్గొన్ని అధికార పార్టీ ఎమ్మెల్యేలు జిల్లా మంత్రి హామీ ఇచ్చారని, మూడు నెలల్లో సమస్య అయిపోతుందని అన్నారని తెలిపారు. ఖమ్మంలో బిఆర్ఎస్ ఆవిర్భ సభ జరిగిందని, సభలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇచ్చామని, ఆ సభలో సీఎం మాట్లాడుతూ కోర్టులో ఆటంకాలు తొలిగిపోయాయని, జిల్లా కేంద్రంతో పాటు జిల్లా అంతట జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సభలోనే మంత్రులు హరీష్ రావు, అజయ్ కుమారులకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. పది నెలలు కావస్తున్నా ఇంకా కార్యచరణ దాల్చలేదని, మొదట 5 ఎకరాలు, తరువాత 23 ఎకరాలు ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చిన ఆగిపోయాయని, అసలు ఎప్పుడిస్తారో తెలియని పరిస్థితి ఉందని, ఇళ్ల స్థలాల కోసం జర్నలిస్టులు, వాళ్ళ కుటుంబ సభ్యులు కళ్ళల్లో ఒత్తులేసుకొని ఇళ్ల స్థలాలు ఎప్పుడొస్తాయోనని ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయం దగ్గర పడిందని, ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తే ఇండ్ల స్థలాలు ఇవ్వడం సాధ్యం కాదని, ఎన్నికలు అయిపోయిన తర్వాత హామీలు ఇచ్చినవారు, వాగ్దానం చేసిన వారు ఉంటారనే గ్యారెంటీ లేదని, మళ్లీ సమస్య మొదటికి వచ్చే అవకాశం ఉందని అన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం ప్రభుత్వానికి ఇష్టం లేకనే ఆలస్యం జరుగుతోందని ఆరోపించారు. మనసుంటే మార్గం ఉంటుందని, అనేక జిల్లాల్లో చాలాచోట్ల జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చారని తెలిపారు. ఆర్థిక మంత్రి హరీష్ రావు తన ఇలాఖాలో కూడా జర్నలిస్టులకు ఇల్ల స్థలాలు ఇచ్చారని అన్నారు. అక్కడ లేని సమస్య ఇక్కడ ఎందుకు ఉంటుందని ప్రశ్నించారు. అందుకనే ఉద్దేశపూర్వకంగానే బిఆర్ఎస్ ప్రభుత్వం పైకి మాటలు చెప్పినా.. జర్నలిస్టులందరికీ హామీ ఇచ్చిని, వాగ్దానం చేసి మభ్యపెడుతూనే కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు .చిత్తశుద్ధితో ఇవ్వాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదనేది అర్థమవుతుందని అన్నారు. ఎకరం భూమి రిజిస్ట్రేషన్ వేల్యూ రూ.5 లక్షల కంటే ఎక్కడా లేదని, బహిరంగ మార్కెట్లో ప్రైవేట్ భూములు ఎకరానికి రూ.3 కోట్లు నుండి, 5, 6 కోట్లు ఉందని, కానీ ఆ భూమి రిజిస్ట్రేషన్ వ్యాల్యూ రూ.4 లక్షలే ఉందన్నారు. అయినా ప్రభుత్వ భూమికి అంత వ్యాల్యూ ఏంటని.. కుంటి సాకులు తప్ప మరేమీ లేదన్నారు. వాస్తవానికి జర్నలిస్టులు తెల్ల కార్డు కలిగి, తక్కువ ఆదాయం ఉన్నవారు అని, నాలుగో తరగతి ఉద్యోగులతో కూడా వీరికి పోలిక లేదన్నారు. ప్రభుత్వం జాప్యం చేయకుండా, కుంటి సాకులు చెప్పకుండా.. నిజాయితీ ఉంటే, చిత్తశుద్ధి ఉంటే జర్నలిస్టులను ఆదుకోవాలనే ఆలోచన ఉంటే ఆలస్యం చేయకుండా వెంటనే ఉచితంగా ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈనెల 30వ తేదీలోపు అధికారిక స్పందన రాకుంటే సిపిఎం పార్టీ చొరవు తీసుకొని అన్ని రాజకీయ పార్టీల వారిని, ప్రజా సంఘాలను, జర్నలిస్టు సంఘాలను సమావేశపరిచి ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.ఈ విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్రా శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై .విక్రమ్, బండి రమేష్, జిల్లా కమిటీ సభ్యులు ఎర్రా శ్రీనివాసరావు, నంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూపు -1 పరీక్ష రద్దు ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం

- నష్టపోయిన నిరుద్యోగులకు రూ.లక్ష పరిహారం అందించాలి
- డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం
- సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మద్దాల ప్రభాకర్, షేక్ బషీరుద్దీన్

నవతెలంగాణ- ఖమ్మం



మరోసారి తెలంగాణ గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష రద్దు కావడానికి ప్రభుత్వం, టీఎస్పీఎస్సీ నిర్లక్షమే నిదర్శనం అని, నష్టపోయిన నిరుద్యోగులకు లక్ష రూపాయల పరిహారం ఇవ్వాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మద్దాల ప్రభాకర్, షేక్ బషీరుద్దీన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మంలోని ఎన్ఎస్‌పి క్యాంప్ రోడ్డులో డివైయఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్కసారి పేపర్ లీకేజీ వల్లన ఈ రాష్ట్రంలో రెండవ సారీ పరీక్ష రాయాల్సిన పరిస్థితి వచ్చిందని, మళ్ళీ నిర్వహించిన పరీక్షలో కూడా అదనంగా ఓఎంఆర్ షీట్స్ వచ్చాయని, అభ్యర్థులు హైకోర్టుకు వెళ్ళారని, పేపర్ లీకేజీ తర్వాత కూడా ప్రభుత్వం, బోర్డు తగిన జాగ్రత్తలు తీసుకోలేదని, మళ్ళీ పరీక్ష పై అనుమానాలు వ్యక్తం అయినా వాటి గురించి చైర్మన్ కూడా స్పష్టంగా ప్రకటించలేదని అన్నారు. మళ్ళీ ఈ కమిషన్ నిరుద్యోగులకు భరోసా కల్పించేలా పరీక్ష నిర్వహించలేదని, ఈ పదేళ్ల కాలంలో వచ్చిన ఒకే ఒక్క గ్రూపు-1 నోటిఫికేషన్ మళ్ళీ మళ్ళీ పరీక్ష రద్దు అయ్యిందని, ఎంతోకాలం వెచ్చించి, కోచింగ్ సెంటర్లు, హస్టల్స్ లక్షలాది రూపాయలు ఖర్చు చేసి వయస్సు రీత్యా కూడా ఇదే చివరి నోటిఫికేషన్ అని బాధపడుతున్న అభ్యర్థులు ఎందరో ఉన్నారని అన్నారు. వారికి ప్రభుత్వం ఈ పరీక్ష నిర్వహణలో ఎలాంటి భరోసా ఇవ్వలేదని, అందుకే ముమ్మాటికి ఇది ప్రభుత్వం నిర్లక్ష్యం అన్నారు. తక్షణమే విశ్వాసం కోల్పోయిన బోర్డ్ చైర్మన్ జనార్దన్ రెడ్డిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మొత్తం కమిషన్ ప్రక్షాళన చేయాలని, ప్రస్తుతం కేసులో ఉన్న వారిని విధులు నుండి పూర్తిగా తొలగించి భవిష్యత్‌లో నిర్వహించే పరీక్షలు నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. 30 లక్షల నిరుద్యోగులకు ప్రభుత్వం టీఎస్పీఎస్సీ పై నమ్మకం కల్గించేలా బోర్డు ప్రక్షాళన చేయాలని వారు డిమాండ్ చేశారు. అభ్యర్థులు నష్టపోయిన సమయం, ఆర్థిక ఇబ్బందులు ప్రభుత్వం దృష్టిలో పెట్టుకొని లక్ష రుపాయాలు నష్టపరిహారం ఇవ్వాలని, గతంలో విద్యార్థులు, నిరుద్యోగులు డిమాండ్ చేసినట్లుగా ప్రభుత్వం కమిషన్ మార్చి పరీక్షలు నిర్వహించి ఉంటే ఇలాంటి పరిస్థితి మారే అవకాశం ఉండేది కాదని, తెలంగాణ ఉద్యమ కాంక్ష అయినా నియామకాలు ప్రభుత్వం తక్షణమే పారదర్శకంగా జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైయఫ్ఐ జిల్లా నాయకులు చింతల రమేష్, శీలం వీరబాబు, దిండు మంగపతి, బొడ్డు మధు, రావులపాటి నాగరాజు, చిత్తరు మురళి, రంసెట్టి సురేష్, శెభాష్ రెడ్డి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పట్టని ప్రభుత్వం

సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి

కళ్యాణం వెంకటేశ్వరరావు

నవతెలంగాణ- పెనుబల్లి



అంగన్వాడీ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం దృష్టి సారించకపోవడం వల్లే రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు సమ్మెకు దిగారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం విఎం బంజర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కల్లూరు ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీల జనరల్ బాడీ సమావేశం సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి చలమాల విఠ్రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పెనుబల్లి మండలంలోని పలువురు అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు సిఐటియులో చేరారు. వారికి సిఐటియు కండవాలతో జిల్లా కార్యదర్శి తుమ్మ విష్ణు, కళ్యాణ వెంకటేశ్వరరావులు సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 9 ఏళ్ల తెలంగాణ ప్రభుత్వం అంగన్వాడీల సమస్య పరిష్కరించడంలో విఫలమైందని, సమస్యల పరిష్కారం కోసమే సమ్మె నోటీస్ ఇవ్వడం జరిగిందన్నారు. వేతనం ఉద్యోగ భద్రత కల్పించడంలో కెసిఆర్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లనే అంగన్వాడీల ఉద్యమ రూపం ముందుకొచ్చిందన్నారు. కేంద్రం ఇచ్చిన కనీస 1500 రూపాయలు కూడా అంగన్వాడీలకు ఇవ్వకుండా వారితో వెట్టి చాకిరీ చేయించుకుంటూ అంగన్వాడీలను ఇబ్బందులకు గురి చేస్తున్నా నన్నారు. ఇతర రాష్ట్రాల్లో అంగన్వాడీలకు ఇస్తున్న సౌకర్యాలు కూడా ఇవ్వడం లేదన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాడుతామని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రావాలని డిమాండ్ చేశారు.



కార్యక్రమంలో వ్యకాస రాష్ట్ర నాయకులు జాజిరి శ్రీనివాస్, డివైఎఫ్ఐ నాయకులు సర్వేశ్వర రావు, అంగన్వాడి సంఘం జిల్లా నాయకులు కోటేశ్వరి, కాంగ్రెస్ నాయకులు వడ్లమూడి కృష్ణయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బెజవాడ శేషు సాయి, సీపీఐ(ఎం) నాయకులు గుడిమెట్ల బాబు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బలోపేతానికి కృషి

నేలకొండపల్లి ఏఎంసీ డైరెక్టర్ బత్తుల వీరారెడ్డి

నవతెలంగాణ-ముదిగొండ



గ్రామ గ్రామాన భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీని బలోపేతం చేయాలని బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు బూత్ కమిటీ ఇన్చార్జ్, నేలకొండపల్లి ఏఎంసీ డైరెక్టర్ బత్తుల వీరారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు.జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు ఆదేశాల మేరకు మండలపరిధిలో ముత్తారంలో ఆదివారం ముఖ్యకార్యకర్తల సమావేశం పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు వల్లభనేని ప్రభాకర్ రావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో మధిర నియోజకవర్గంలో గులాబి జెండా ఎగరవేయాలన్నారు. బిఆర్ఎస్ అభ్యర్థి లింగాల కమల్ రాజును అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి ముత్తారం, కోదండరామపురం గ్రామ కార్యకర్తలు నాంది పలకాలన్నారు. బారాస ప్రభుత్వం పల్లెలతోపాటు, ప్రజాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు అందించారన్నారు. అనంతరం బూత్ స్థాయి11 మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ బూత్ స్థాయి ఇంచార్జ్ నీరుకొండ సతీష్, గ్రామ శాఖ కార్యదర్శి కొప్పుల నాగరాజు, ఎస్సీ సెల్ గ్రామ అధ్యక్షులు నారపొంగు కిరణ్, నాయకులు ఆడపా నాగేందర్, మూల శ్రీనివాస్ గౌడ్, నేలవల్లి చక్రధర్‌రావు, రైతు సమన్వ యసమితి గ్రామ కన్వీనర్ తాళ్ల రామారావు, వార్డ్ మెంబర్స్ మూల రమణ, మరీదు ఎల్లయ్య, నారపొంగు పుల్లయ్య, తాళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జనావాసంలోకి కొండచిలువ

నవతెలంగాణ- ముదిగొండ



మండల కేంద్రమైన ముదిగొండ కామ స్రవంతి అనే గృహిణి ఇంటి వద్ద 12 అడుగుల ఉన్న పెద్ద కొండచిలువ ఆదివారం ప్రత్యక్షమైంది. కొండచిలువ జనావాసంలోకి రావడంతో స్థానికులు అవాక్కై అటవీ అధికారులకు సమాచారం ఇవ్వటంతో వారి వచ్చి కొండచిలువ పామును పట్టుకొని అడవుల్లో వదిలేస్తామని తీసుకెళ్లారు.

భవన నిర్మాణ కార్మికులకు వైద్య పరీక్షలు

నవతెలంగాణ-ముదిగొండ



మండల కేంద్రమైన ముదిగొండ వీఎస్ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ భవన నిర్మాణ ఇతర కార్మిక సంక్షేమ మండలి ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు ఆదివారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్మిక శాఖ నుండి ఇన్సూరెన్స్ కార్డు కలిగిన వారందరూ భవన నిర్మాణ ఇతర కార్మికలు వైద్యపరీక్షలు చేయించుకోవాలని భవన నిర్మాణ కార్మిక కార్మికుల (సిఐటియు అనుబంధం) మండల కార్యదర్శి శెట్టిపోగు వెంకటేశ్వర్లు కోరారు. బీపీ, షుగర్‌తో పాటు, 65 రకాల వైద్యపరీక్షలకు రక్తాన్ని శాంపిలుగా సేకరించి ల్యాబ్ కు పంపించారు. కార్యక్రమంలో హెల్త్ క్యాంపు కో-ఆర్డినేటర్ సమీర్, సిబ్బంది రవికుమార్, నరేందర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



10వ రోజు రిలే నిరాహార దీక్షలు

నవతెలంగాణ- ఖమ్మం

తెలుగుదేశంపార్టీ ఖమ్మం జిల్లా కార్యాలయంలో జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా రిలే నిరాహార దీక్షల్లో భాగంగా ఆదివారం పదవ రోజు ఖమ్మం పార్లమెంట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం పార్లమెంట్ అధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం సందర్శించి మాట్లాడారు. రిటైర్డ్ లేబర్ ఆఫీసర్ వెలగపూడి విజయలక్ష్మి దీక్షా శిబిరానికి సంఘీబావం తెలిపారు. కార్యక్రమంలో కేతినేని హరీష్, కొండబాల కరుణాకర్, మల్లెంపాటి అప్పారావు, రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి చుండూరు రాజేశ్వరి, టి యన్టియుసి నాయకులు వెంకటనారాయణ, కొలికొండ మురళి, చిరుమామిళ్లరవి, గులం మహ్మద్ నూరు హుల్లాఖాన్, పత్రి కిరణ్ కుమార్, కూచిపూడి జై, నాగండ్ల లక్ష్మణ్, కన్నేటి పద్వీ, రాచకొండ అశోక్, పద్మనాభుల నారాయణరావు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నమ్మగ తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | సెప్టెంబర్ 25, 2023 | www.navatelangana.com

చికిత్స పొందుతూ వివాహిత మృతి

నవతెలంగాణ-దుమ్ముగూడెం

పురుగుమందు తాగిన ఓ వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. సీఐ దోమల రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.... సిరిగుండం గ్రామానికి చెందిన మృతురాలు ఊకే సునీత(28) 9 సంవత్సరాల క్రితం రాజు అనే వ్యక్తితో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. సునీత తరచూ భర్తతో గొడవ పడి చచ్చిపోతాను అని బెదిరింపులకు పాల్పడేది. ఆ క్రమంలో రెండు సార్లు పురుగుల మందు తాగగా కుటుంబ సభ్యులు వైద్యశాలకు తరలించి వైద్యం అందించారు. ఆ క్రమంలో ఈ నెల 21వ తేదీన భర్త రాజుతో ఘర్షణ పడిన సునీత గుర్తు తెలియని పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా ఆదివారం మృతి చెందింది. కేవలం భర్తతో గొడవపడి పురుగుల మందు తాగి చనిపోయిందని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రాజేంద్ర కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అన్నదానం ఎంతో పవిత్రమైనది

- **ఎమ్మెల్యే వనమా**

నవతెలంగాణ-పాల్వంచ

అన్నదానం కార్యక్రమం ఎంతో పవిత్రమైనదని ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో కొంత దానధర్మాలకు ఖర్చు పెట్టాలని కొత్తగూడెం నియోజకవర్గం శాసనసభ్యులు వనమా వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పాల్వంచలోని గణపతి మండపాల వద్ద ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాలను వనమా ప్రారంభించారు. పాత పాల్వంచ బిసిఎం రోడ్ లోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో, గౌండ్ల బజార్‌లో, శివనగర్ లో సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో దాబా, నెహ్రూ నగర్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలలో వనమా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న అన్నారు. గణపతిని పూజిస్తే ఎలాంటి విఘ్నాలైనా తొలగిపోతాయన్నారు. ఈ కార్యక్రమాల్లో డిసిఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, కొత్వాల సత్యనారాయణ, కాల్వ ప్రకాశరావు, కాల్వ భాస్కర్ రావు, దాసరి నాగేశ్వరరావు, కందుకూరి రాము, సంతోష్ రెడ్డి, చిన్న పండు, బేతంశెట్టి వెంకట్, బందెల శ్రీనివాస్, దాబా శంకర్, వీరన్న, రాంబాబు మరియు నవభారత్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఈ. బయ్యారంలో డివిజన్ స్థాయి పోస్టల్ సమావేశం

నవతెలంగాణ-పినపాక

పినపాక మండలం ఈ బయ్యారంలో ఏర్పాటు చేస్తున్న పోస్టల్ అవగాహన సమావేశంపై పినపాక, కరకగూడెం, మణుగూరు, మండలాలకు చెందిన పోస్టల్ ఉద్యోగులతో ఆదివారం ఈ బయ్యారం క్రాస్ రోడ్ లో పోస్టల్ ఎంవోలు సుధీర్, సత్యనారాయణ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. నేడు జరిగే సమావేశానికి మూడు మండలాల ప్రజాప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చూడాలన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో సర్పంచులకు ప్రజాప్రతినిధులకు సమావేశం వివరాలు తెలపాలన్నారు. రేపు ఉదయం 10 గంటల నుండి జరిగే సమావేశంలో పోస్టల్ శాఖ అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి పోస్టల్ ఎస్పీతో పాటు ఉన్నత అధికారులు హాజరవుతారని తెలిపారు. తపాలాశాఖ ఆధ్వర్యంలో మహిళలకు అధిక వడ్డీ ఇచ్చే కొత్త పథకాన్ని కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిందని, మహిళా సమ్మాన్ సేవింగ్ ఖాతా పేరిట అమల్లోకి వచ్చిన ఈ పథకాన్ని మహిళలు సద్వినియోగపరుచుకునే విధంగా కృషి చేయాలని కోరారు. పోస్టల్ ద్వారా ఆన్‌లైన్ నగదు లావాదేవీలపైన అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది శ్రీనివాసరావు, సర్వేశ్వరరావు, దీక్షితులు, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఈనెల 30న జరిగే కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావ్ అన్నారు. స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ నియోజకవర్గ ఇన్చార్జి మానే రామకృష్ణ, మండల అధ్యక్షులు అరికెళ్ల తిరుపతిరావు, మండల ప్రధాన కార్యదర్శి కొండిచెట్టి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు రత్నం రమాకాంత్, చింతాడు చిట్టిబాబు, ఎండి నవాబు, రత్నం, రజినీకాంత్, జాయింట్ సెక్రెటరీ బంబోతుల రాజీవ్, యూత్ డివిజన్ అధ్యక్షులు మల్లెల లోకేష్ మండల యూత్ అధ్యక్షులు గాడి విజయ్, సెక్రటరీ వెంకట్ కార్మిక జిల్లా అధ్యక్షులు చుక్క సుధాకర్థిశ కమిటీ సభ్యులు ఆత్మ కమిటీ చైర్మన్ లక్కవత్ వెంకటేశ్వర్లు, అభయాంజనేయ స్వామి టెంపుల్ చైర్మెన్ తాళ్ల రవికుమార్ కనకదుర్గ అమ్మవారి చైర్మెన్ చింతల రామకృష్ణ గ్రంథాలయం చైర్మన్ మామిడి పుల్లారావు, మాజీ మండల అధ్యక్షులు యశోద నగేష్, నాయకులు నక్క ప్రసాద్, చాట్ల రవికుమార్, మండల మహిళా అధ్యక్షురాలు గంగాభారతి, ప్రధాన కార్యదర్శి ములకలపల్లి మదారి, సీనియర్ నాయకులు కేతినేని లలిత, ఎండి ముంతాజ్, మానే కమల సీతామాలక్ష్మీ, అనురాధ, మైదులి బీబీ తదితరులు పాల్గొనారు.

భూపతి రావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

- **ఎంబి నర్సారెడ్డి**

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు భీమపాక భూపతిరావు మొదటి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి మాట్లాడుతూ భద్రాచలం డివిజన్‌లో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నాయకులుగా పనిచేశారని అనేక పోరాటాలకు నాయకత్వం వహించారని ముఖ్యంగా భద్రాచలం రూరల్ కూనవరం ప్రాంతాల్లో జరిగిన వ్యవసాయ, కూలీ పోరాటాలకు నాయకత్వం వహించి వారి సమస్యలు పరిష్కారం కోసం కృషి చేశారని చివరిదాకా నీతిగా నిజాయితీగా నిరాడంబరంగా జీవించారని అన్నారు.

మంత్రిగారు మీ అబద్ధపు ప్రచారాలతో మా చెవిలో పువ్వులు పెట్టకండి

- **చెవుల్లో పువ్వులతో అంగన్వాడీల వినూత్న నిరసన**

నవతెలంగాణ-చర్ల



ఐసిడిఎస్ మంత్రి సత్యవతి రాథోడ్ 14 రోజులుగా అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు చేస్తున్న నిరవధిక సమ్మెపై అబద్ధాల గారడి మాటలతో అంగన్వాడీ చెవులలో పువ్వులు పెట్టే పని చేస్తున్నారని, ప్రజల్లో తప్పుడు ప్రచారాన్ని వెదజల్లుతున్నారని సీఐటియు విమర్శించింది. రాష్ట్ర ప్రభుత్వ ఐసిడిఎస్ మంత్రి చేస్తున్న అబద్ధపు ప్రచారాలను నిరసిస్తూ తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటియు చర్ల ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటియు రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎం విజయశీల సిఐటియు మండల కన్వీనర్ పాయం రాధాకుమారి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా జీతాలు పెంచామని మంత్రి అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. సమ్మె డిమాండ్లన్నీటిని పరిష్కారం చేయడం కోసం సమ్మెకు నాయకత్వం వహిస్తున్న సంఘాలతోటి ప్రభుత్వం వెంటనే చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అబద్ధాలతోటి ప్రజలను గందరగోళ పరిచే చర్యల్ని ఖండించారు. ఎటువంటి బెదిరింపులు లెక్క చేసేది లేదని సమ్మె పరిష్కారం అయ్యేంతవరకు పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో మండల నాయకులు శ్యామల వెంకటేశ్వర్లు, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు నాయకులు కృష్ణవేణి, స్వరూప, విజయలక్ష్మి, త్రివేణీ, భారతి, అనురాధ సత్యవతి, శోభారాణి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులకు సహకరిస్తే ఉపేక్షించేదిలేదు

- **సీఐ రాజగోపాల్**



సీఐ రాజగోపాల్

చర్ల : ఏజెన్సీ అభివృద్ధికి అడ్డుగా ఉండే నిషేధిత మావోయిస్టు పార్టీకి సహరిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేదిలేదని సీఐ రాజగోపాల్ అన్నారు. సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా పార్టీ మండల కార్యదర్శిగా పనిచేస్తున్న కొండా చరణ్ గత కొంతకాలంగా మావోయిస్టు పార్టీకి కొరియర్ గా వ్యవహరిస్తున్నాడని పోలీసులకు తెలియడంతో అతనిపై నిఘా పెట్టడం జరిగిందన్నారు. రోజు వారి కార్యక్రమాలలో భాగంగా ఆదివారం చర్ల మండలంలోని చింతగుప్ప గ్రామంలోని ప్రధాన రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా అటుగా వస్తున్న కొండా చరణ్‌ను విచారించగా పొంతనలేని సమాధానం చెప్పడంతో అదుపులోకి తీసుకొని విచారించగా ఆయన వద్ద వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లు, బ్యానర్లతో పాటు పేలుడు సామగ్రి లభ్యమయ్యాయని తెలిపారు. దీంతో కొండా చరణ్ పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు సిఐ తెలిపారు. మావోయిస్టు పార్టీకి మరి కొంత మంది సహరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అటువంటి వారు తమ పద్ధతి మార్చుకోకపోతే వారిపైన చర్యలు తప్పవన్నారు.



కొండ చరణ్

ప్రభుత్వంతో కలబడతాం...

అంగన్వాడీల పోరాటానికి వెన్నుదన్నుగా నిలబడతాం



- అంగన్వాడీ సమ్మెకి మద్దతుగా అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశం ఏకగ్రీవ తీర్మానం.

నవతెలంగాణ-కొత్తగూడెం

అంగన్ వాడీ సిబ్బంది గత 14 రోజులుగా సమ్మె చేస్తున్న వారికి వెన్ను దన్నుగా నిలబడతామని, ప్రభుత్వంతో కలబడతామని అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్, సీపీఎం, సిపిఐ, సీపిఐ ఎంఎల్, ప్రజా పంథా, న్యూ డెమొక్రసీ, బీఎస్పీ రాజకీయ పార్టీలు సీఐటియూ, ఏఐటియూసీ అంగన్వాడీ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశాయి. అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ఈసం వెంకటమ్మ, గోనె మణి అధ్యక్షతన సిఐటియూ జిల్లా కార్యాలయంలో అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు.

అంగన్వాడీ సిబ్బంది పర్మినెంట్, కనీస వేతనం మ్యానిఫెస్టోలో పొందు పరుస్తాం.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఎడవల్లి కృష్ణ

రాష్ట్రంలో 90 రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని, కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో అంగన్వాడీ పర్మినెంట్, కనీస వేతనం పొందుపరుస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఎడవల్లి కృష్ణ అన్నారు. తెలంగాణ ఏర్పాటు సమయంలో ధనిక రాష్ట్రంగా ఉంటే ప్రస్తుతం అప్పుల తెలంగాణాగా మారిపోయిందని, ఐదు లక్షల కోట్ల రూపాయల అప్పు ఉన్నదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవినీతి కంపు కొడుతోందన్నారు. కుటుంబ పాలన నడుస్తుందని, లక్షల కోట్ల రూపాయలను వెనక్కి వేసుకునే పనిలో ఉన్నారన్నారు. రాష్ట్రానికి పట్టిన పేద త్వరలో వదల బోతున్నదని అన్నారు.

అంగన్వాడీ సిబ్బంది పై నిర్బంధం హేయమైన చర్య : సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు జి.రాములు

అంగన్వాడీ సిబ్బంది మొత్తం మహిళలు పని చేస్తున్నారని, సమ్మెలో పెట్టిన డిమాండ్లను పరిష్కరించమని కోరడానికి కలెక్టర్ కార్యాలయాలకు వెళ్లిన అంగన్వాడీ సిబ్బందిపై విచక్షణా రహితంగా లాఠీ ఛార్జ్ చేశారని, కాళ్ళు, చేతులు పగులగొట్టి, మగ పోలీసులే మహిళలపై అనుచితంగా ప్రవర్తించారు. అంగన్వాడీ సిబ్బంది సమస్యలను సానుకూలంగా పరిష్కరించకుండా నిర్బంధం ప్రయోగిస్తే ఈ ప్రభుత్వానికి పతనం తప్పదు.

అంగన్వాడి సిబ్బంది వేతనాలు,ఇతర సౌకర్యాలపై బహిరంగ చర్చకు సిద్ధమేనా.. ?

సీపిఐ రాష్ట్ర నాయకులు సింగు నరసింహారావు

రాష్ట్ర ప్రభుత్వం తరపున దేశంలో ఏ రాష్ట్రంలో లేని వేతనాలు తెలంగాణాలో ఉన్నాయని చెప్పే మంత్రి సత్యవతి రాథోడ్ బహిరంగ చర్చకి సిద్ధమేనా అని సవాల్ విసిరారు. అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్న అంగన్వాడీ సిబ్బంది కనీస వేతనం అడిగింది కేవలం రూ.26 వేలు మాత్రమే అని, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో పోల్చినప్పుడు ఇది తక్కువే అని, ప్రమాద భీమా, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేకుండా వెట్టి చాకిరీ చేస్తున్నారన్నారు.

రైతు బంధుతో లాభం తప్ప... అంగన్వాడీ వేతనం పెంచితే ప్రభుత్వానికి ఏం లాభం...!

సీపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా నాయకులు ఎల్.విశ్వనాథం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు బంధు పథకం అమలు వల్ల ప్రభుత్వానికి లాభం తప్ప అంగన్వాడీ వేతనాలు పెంచితే లాభం లేదు కాబట్టే రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు పెంచడం లేదని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అంగన్వాడీ యూనియన్ లను చర్చలకు పిలవాలి :

సీపిఐ ఎంఎల్ ప్రజా ప్రంథా జిల్లా నాయకులు సత్యం

సమ్మెలో ఉన్న అంగన్వాడీ యూనియన్లను వెంటనే చర్చలకు పిలిచి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపిఐ ఎంఎల్ ప్రజా పంథా నాయకులు సత్యం అన్నారు.లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోన తప్పదని హెచ్చరించారు.

ఒక రోజు నిరసన తెలుపుతాం : సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య

అన్ని రాజకీయ పార్టీలు కలిసి ఒక రోజు సమ్మెకు మద్దతుగా నిరసన తెలుపుతామని సిపిఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. ఇప్పటికే అన్ని రాజకీయ, ప్రజా సంఘాలు అంగన్ వాడీల పోరాటానికి మద్దతుగా ఉన్నయని, ప్రభుత్వం వెంటనే స్పందించకుంటే నిసన కార్యక్రమం తప్పదన్నారు.



అంగన్వాడి సిబ్బంది అంటే అంత చులకనా ? : బీఎస్పీ జిల్లా సలహాదారులు మల్లిఖార్జున్

అంగన్వాడీలలో అత్యధిక మంది దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాలకు చెందిన వారు ఉండడం వల్లనే ప్రభుత్వం వారి పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. బలహీన వర్గాలకు చెందిన వారంటే ఈ ప్రభుత్వానికి ఇంత అలుసా....? అని బీఎస్పీ జిల్లా సలహాదారులు మల్లిఖార్జున్ అన్నారు.

ఈ అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో సిఐటియూ జిల్లా కార్యదర్శి ఏజె.రమేష్, ఏఐటియూసీ జిల్లా అధ్యక్షులు నారాటి ప్రసాద్, ఐఎఫ్‌టియూ జిల్లా కార్యదర్శి కె.సారంగపాణి, మధ్యాహ్న భోజనం కార్మికులు సంఘం జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కాలంగి హరి కృష్ణ, సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవి కుమార్, సహాయ కార్యదర్శి డి.వీరన్న, ఏఐటియూసీ జిల్లా సహాయ కార్యదర్శి వేల్పుల మల్లికా ర్జున్, అంగన్వాడి యూనియన్ సిఐటియూ, ఏఐటియూసీ నాయకులు జిలకర పద్మ, వెంకటరమణ, రమ్య, కళావతి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

రేపు జీపీ కార్మికుల, ఉద్యోగుల సమ్మె సన్నాహక జిల్లా సదస్సు

- **జయప్రదం చేయండి :**

జిల్లా జేపీసీ చైర్మెన్ ఏజె.రమేష్

నవతెలంగాణ-కొత్తగూడెం

ఈ నెల 26 న జరిగే గ్రామ పంచాయతీ కార్మికుల, ఉద్యోగుల సమ్మె సన్నాహక జిల్లా సదస్సుని జయప్రదం చేయాలని గ్రామ పంచాయతీ కార్మికుల ఉద్యోగుల జిల్లా జేపీసీ చైర్మన్ ఏజె.రమేష్ పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జిల్లా గ్రామ పంచాయతీ కార్మికుల ఉద్యోగుల జెపీసీ సమావేశం జిల్లా జేపీసీ కన్వీనర్, ఏఐటియూసీ నాయకులు జాడి సురేష్ కుమార్ అధ్యక్షతన జరిగింది. జూలై, ఆగస్ట్ నెలల్లో 34 రోజుల పాటు జరిగిన గ్రామ పంచాయతీ కార్మికుల ఉద్యోగుల సమ్మె విరమణ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, కార్మికులను మోసం చేశారని, ఈ మోసాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అక్టోబర్ 2 నుండి నిరవధిక సమ్మె లోకి వెళ్తున్నామని, సమ్మె సన్నాహక జిల్లా సదస్సు ఈ నెల 26 వ తేదీన కొత్తగూడెంలో జరుగుతుందని, కార్మికులు, ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని జేపీసీ తరపున చైర్మన్ ఏజె.రమేష్ పిలుపు నిచ్చారు. గ్రామ పంచాయతీ కార్మికుల ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర డిమాండ్ల సాధనకు 34 రోజులు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున సమ్మె జరిగిందని, ప్రజల నుండి అపూర్వమైన మద్దతు లభించిందని తెలిపారు. సమ్మె సందర్భంలో జరిగిన శాసన సభ సమావేశాలలో అధికార, ప్రతిపక్ష సభ్యులు మొత 42 మంది సమ్మె డిమాండ్లను పరిష్కారం చేయాలని ప్రభుత్వాన్ని నిలదీశారని, దీనితో ప్రభుత్వం తరపున చర్చలకు వచ్చిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమస్యల పరిష్కారానికి 15 రోజుల గడువు కోరారని, అందుకు రాష్ట్ర జెపీసీ చర్చించి అంగీకరించిందన్నారు. కానీ, మంత్రి ఇచ్చిన మాట మీద నిలబడకుండా, మాట తప్పారని, కార్మికులను మోసం చేశారని ఆరోపించారు. ఈ మోసానికి వ్యతి రేకంగా అక్టోబర్ 2 నుండి నిరవధిక సమ్మె చేయాలని రాష్ట్ర జెపిసి నిర్ణయించిందన్నారు. ఈ నిరవధిక సమ్మె స్థానిక జిల్లా సదస్సు ఈ నెల 26న కొత్తగూడెంలో జరుగుతుందని, దీనికి రాష్ట్ర నాయకులు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని, జిల్లా వ్యాప్తంగా కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఏజె.రమేష్ పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర జెపిసి కన్వీనర్, ఐఎఫ్‌టియూ నాయకులు జగతి వెంకన్న, జిల్లా జెపిసి కన్వీనర్, ఐఎఫ్‌టియూ నాయకులు ప్రసాద్, సిఐటియూ నాయకులు కాంతారావు, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాలలో అన్ని సదుపాయాలు కల్పించాలి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ స్టేషన్లు ఓటర్లందరికీ సదుపాయంగా ఉండే విధంగా సౌకర్యాలు ఏర్పాటు చేయవలసిన బాధ్యత సంబంధిత బీఎల్ఓలపై ఉందని భద్రాచలం ఆర్డీవో మంగీలాల్ అన్నారు. ఆదివారం 119 భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గం పోలింగ్ స్టేషన్లను ఆయన పరిశీలించారు. మొత్తం 27 పోలింగ్ స్టేషన్లో గాను 20 పోలింగ్ స్టేషన్లను ఆయన పరిశీలించి ఓటర్లకు ఏర్పాటు చేసిన సౌకర్యాలు అలాగే వికలాంగులకు ర్యాంపులు ఏర్పాట్లు ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి పోలింగ్ స్టేషన్లో విద్యుత్ సౌకర్యం మంచినీటి సదుపాయం ఓటర్లు కూర్చునే విధంగా సౌకర్యాలు కల్పించాలని వర్షం వస్తే గనక తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అలాగే మెడికల్ క్యాంపు తప్పనిసరిగా ఉండాలని అన్నారు. సంబంధిత బీఎల్వోలు ఇప్పటి నుండే పోలింగ్ స్టేషన్లలో అన్ని సౌకర్యాలు సక్రమంగా ఉన్నవి లేనివి తెలుసుకొని దానికి సంబంధించిన సమాచారం తమ కార్యాలయానికి తెలియజేయాలని అన్నారు. ప్రస్తుతం 20 పోలింగ్ స్టేషన్లో సౌకర్యాలు సంతృప్తి కారంగా ఉన్నాయని అన్నారు. ముందుగా చర్ల మండలంలోని జగన్నాథపురం పోలింగ్ స్టేషన్ మంచి సౌకర్యంగా ఉందని ఇదేవిధంగా అన్ని పోలింగ్ స్టేషన్లలో సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డిటి అపక రమేష్ మరియు సంబంధిత బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో బాలింత మృతి

నవతెలంగాణ - ఆళ్ళపల్లి



హృద్రోగంతో గిరిజన బాలింత మృతి చెందిన ఘటన ఆళ్ళపల్లి మండలంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గత మూడు నెలల క్రితం మండల పరిధిలోని జిన్నెలగూడెం గ్రామానికి చెందిన పూకె మమత (25) కవల పిల్లలకు జన్మనిచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో బాలింత హృద్రోగానికి గురైందని తెలిపారు. దాంతో వైద్యుల సలహాతో మందులు వాడుతున్నారని చెప్పారు. ఈ క్రమంలో ఆదివారం ఇంటి వద్ద మరోసారి ఆరోగ్య సమస్య తలెత్తడంతో ఆళ్ళపల్లి ఓ ఆర్ఎంపీ దగ్గరకు వైద్యానికి భర్త రవీందర్ ఆటోలో తీసుకుని వచ్చారు. పరీక్షించి ఆర్ఎంపీ పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తీసుకుని వెళ్ళమని సూచించారు. దాంతో హుటాహుటిన మమతను ఆటోలో కొత్తగూడెం తరలిస్తుండగా మార్గం మధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు. మమత మృతితో భర్త, బంధువులు కన్నీటి పర్యంతం అయ్యారు. మూడు నెలల కవల పిల్లలు తల్లి పాలకు దూరమై విగతజీవిగా పడి ఉన్న తల్లి దగ్గర విలపిస్తున్న దృశ్యాన్ని చూసి గ్రామస్తులు సైతం కంటతడి పెట్టారు.

పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు

నవతెలంగాణ -దుమ్ముగూడెం

పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులపై స్థానిక పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయింది. సిఐ దోమల రమేష్ తెలిపిన వివరాల ప్రకారం..... పెద్ద నల్లబల్లి గ్రామ శివారులో డబ్బులు పణంగా పెట్టి పేకాట ఆడుతున్నారని సమాచారం ఎస్సై కేశవరావు పోలీస్ సిబ్బంది తో కలిసి పేకాట స్థావరం పై ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులు పోలీస్ వారిని చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. పోలీసులు వెంబడించి వారిని పట్టుకొని వారి వద్ద ఉన్న రూ 5,350 నగదు తోపాటు 4 మోటార్ సైకిళ్ళు,106 పేకముక్కలు లను స్వాధీనం చేసుకుని వారిని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఎస్సై పోటు గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రహదారి కాదు... మృత్యు మార్గం



- రోడ్డుపై భారీగా ఏర్పడిన గుంతలు..
- అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని బిటిపిఎస్, ఆర్అండ్‌బి, సింగరేణి అధికారులు

నవతెలంగాణ-మణుగూరు

ఏటూరు నాగారం ప్రధాన రహదారిపై ప్రయాణించాలంటే వాహనదారులు ఇక్కట్లు వర్ణనాతీతంగా మారాయి. బీటీపీఎస్‌కు సింగరేణి ఓసి గనుల నుండి నిత్యం వందలాది బొగ్గు లారీలు తిరుగుతుండడంతో రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. సింగరేణి వ్యూ పాయింట్ నుండి సాంబాయిగూడెం చిక్కుడు గుంట బిటిపిఎస్ గేట్ వద్ద లారీలు ప్రయాణించడం వల్ల ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలు కురిసినప్పుడల్లా ఈ గుంతల్లో నీరు చేరి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది రోడ్లపై ఉన్న గుంతలను తప్పించబోయి ప్రమాదాల బారిన పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. నిత్యం ఈ రహదారిపై వందలాది సంఖ్యలో వాహనాలు పలు పనులపై ప్రయాణం చేస్తుంటారు. గుంతలు ఎక్కువగా ఉండటం వల్ల పలుమార్లు రోడ్డుపై అకస్మాత్తుగా ట్రాఫిక్ జామ్ కూడా అవుతుంది. పాడైపోయిన రహదారికి మరమ్మతులు చేయకుండా సంబంధిత అధికారులు నిర్లక్ష్య వైఖరి వ్యవహరించడం వల్ల రోజుకు ప్రధాన రహదారిపై గుంతలు పెరిగిపోతున్నాయి. అయినా అధికారులు గుంతలకు మరమ్మతులు నిర్వహించడంలో చొరవ చూపడం లేదని వాహనదారులతో పాటు స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి నుండి వందలాది బొగ్గు లారీలు నిత్యం బిటిపిఎస్‌కు రాకపోకలు సాగించడం వల్లే ప్రధాన రహదారి పాడైపోతుందన్న వాదన ప్రజల్లో వినపడుతుంది. సింగరేణి అధికారులకు, బిటిపిఎస్ అధికారులకు రాజకీయ పార్టీల నాయకులతో పాటు పలు సంఘాల నాయకులు మరమ్మతులు చేయించాలని వినతి పత్రాలు అందజేసిన ప్రయోజనం లేకుండాపోయింది. కొంతమంది ప్రజాసంఘాల కార్యకర్తలు, పార్టీల నాయకులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ దృష్టికి వినతి పత్రం ద్వారా తెలియచేశారు. అయిన రోడ్డు మరమ్మతు విషయంలో కలెక్టర్ చొరవ చూపించకపోవడం ప్రజలను విస్మయానికి గురిచేస్తుంది. ఇప్పటికైనా కలెక్టర్‌తో పాటు ఆర్ అండ్‌బి, బీటీపిఎస్, సింగరేణి అధికారులు స్పందించి మరమ్మతులు నిర్వహించి వాహనదారుల ప్రాణాలు కాపాడాలని వాహనదారులు, ప్రజలు ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

ఆటోలో ప్రయాణం.. అరచేతిలో ప్రాణాలు...: పాలపాటి ప్రేమయ్య, పగడేరు



మణుగూరు నుండి బిటిపిఎస్ రహదారిపై ఆటోలో ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తుంది. గతంలో అనేక ప్రమాదాలు జరిగినాయి. అనేక మంది మృత్యువాతకు గురయ్యారు. చీకటి పడితే ప్రయాణం నరకయాతన అవుతుంది. రోడ్డుకు మరమ్మతులు చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలి.

కేజీబీవీ సిబ్బందిని రెగ్యులర్ చేయాలి

- **టీపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ హరిలాల్ నాయక్**

నవతెలంగాణ-కొత్తగూడెం టౌన్

తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాఖ ఆధ్వర్యంలో కేజీబీవీ బోధన, బోధనేతర సిబ్బందిని రెగ్యులర్ చేసి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ నిరసన ప్రదర్శననుద్దేశించి టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ హరిలాల్ నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమాలలో కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేస్తానని చెప్పి ఇప్పుడు అదే వ్యవస్థను కొనసాగిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు వ్యవస్థను రద్దుచేసి కేజీబీవీ బోధన సిబ్బందిని రెగ్యులర్ ఉపాధ్యాయులుగా, బోధనేతర సిబ్బందిని రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని,కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేసే వరకు కనీస మూలవేతనం చెల్లించాలని, గురుకుల ఉపాధ్యాయినులతో సమానంగా 27 రోజుల సాధారణ సెలవులు, పిల్లల సంరక్షణ సెలవులు, హిస్టరెక్టమి సెలవులు ఇవ్వాలని, అందరి ఉద్యోగుల మాదిరిగా హెల్త్ కార్డులు జారీ చేయాలని, ఉపాధ్యాయినులను రాత్రి వీధుల నుండి తొలగించి వారి స్థానంలో మ్యాట్రిన్లను నియమించాలన్నారు. తదనంతరం మెమొరాండంను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్‌కి అందజేశారు. ఈ నిరసన ప్రదర్శనలో టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జోగా రాంబాబు, కార్యదర్శులు బి.రమేష్, బి.బాలు,ప్రధానోపాధ్యాయుల ప్రతినిధి కే.వెంకటేశ్వర్లు, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఏ.రామ్మూర్తి, మండల బాధ్యులు ఎం.రమణ, డి.సుధాకర్, కేజీబీవీ ఉపాధ్యాయులు పార్వతి, సీత,లక్ష్మి పాల్గొన్నారు.



ఖమ్మం రూరల్ మండలం పెద్ద తండా గ్రామ పంచాయతీ పరిధిలోని జలగంనగర్‌లో బాల గణేష ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని ఆదివారం రాత్రి ఎమ్మెల్యే కందాళ ఉపేందరరెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులకు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | సెప్టెంబర్ 25, 2023 | www.navatelangana.com

28న తలపెట్టిన బైక్ ర్యాలీని జయప్రదం చేయండి

- ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోయం కామరాజు

నవతెలంగాణ-దుమ్ముగూడెం



జీవో నెంబర్ 3కి చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఈనెల 28న భద్రాచలం ఐటిడిఏ ముట్టడికి తలపెట్టిన బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోయం కామరాజు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని మహాదేవపురం, చిన్న ఆర్లగూడెం, పెద్ద ఆర్లగూడెం, సింగవరం, ఆర్‌సి పేట, కొత్తపల్లి, కమలాపురం, గిరిజన గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కామరాజు మాట్లాడుతూ లంబాడాల కంటే అతి భయంకరమైన జాతి గిరిజనేతరులు అని వీరి వలన తాతల ముత్తాతల నాటి భూములు కోల్పోవలసి వస్తుందన్నారు. ఇప్పటికే విద్య ఉద్యోగ అవకాశాలకు దూరమైన గిరిజనులు భవిష్యత్తులో మన హక్కులు మన రిజర్వేషన్లు సర్వం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. 28న తలపెట్టిన బైక్ ర్యాలీలో రాజకీయాలకు అతీతంగా ఆదివాసీలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి నూప సీతయ్య మండల అధ్యక్షులు కుర్సం రవి, నూపా చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొండా చరణ్‌ను బేషరతుగా విడుదల చేయాలి

నవతెలంగాణ - అశ్వారావుపేట

సీపీఐ ఎంఎల్ (ప్రజా పంథా) భద్రాచలం డివిజన్ కార్యదర్శి కొండా చరణ్‌ను చర్ల సీఐ అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. గొత్తి కోయలు సాగుచేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని సోమవారం భద్రాచలం ఐటిడిఎ పీఓ కార్యాలయం వద్ద తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయడం కోసం ప్రచారం చేస్తున్న కొండా చరణ్ అక్రమంగా పోలీసులు అరెస్టు చేసారని, బేషరతుగా ఆయన్ను విడుదల చేయాలని పార్టీ పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్ ఆదివారం డిమాండ్ చేశారు. ఒక పార్టీ డివిజన్ కార్యదర్శిని వేరే పార్టీ నాయకుడిగా చిత్రీకరించి అక్రమంగా అరెస్టు చేయడాన్ని ప్రజలు, ప్రజాస్వామిక వాదులు తీవ్రంగా ఖండించాలన్నారు.

చెవిలో పువ్వు తో నిరసన

నవతెలంగాణ-ఇల్లందు

సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు చేస్తున్న సమ్మె ఆదివారానికి 14వ రోజుకు చేరుకున్నది. చెవిలో పువ్వులు పెట్టొద్దు అంటూ చెవిలో పువ్వులతో నిరసన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు అబ్దుల్ నబి, ఏఐటీయుసి రాష్ట్ర నేత సారయ్య, బంధం నాగయ్య మాట్లాడారు. ప్రభుత్వం మోసపూరిత ప్రకటనలు చేస్తూ మినీ వర్కర్లను మెయిన్ టీచర్లు గా చేస్తామని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం మినీ టీచర్లను మెయిన్ టీచర్లుగా ప్రమోషన్ ఇస్తామని ఈ పథకం కేంద్ర ప్రభుత్వంకు సంబంధించి కాబట్టి అనుమతి కోరుతూ లేఖ రాశారు. దానికి కేంద్రం అనుమతిని ఇచ్చింది. ఆ లేఖను చూపుతూ జీఓ జారీ చేసినట్లుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని నిరసిస్తూ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో మరియ, ఫాతిమా, రాంబాయి, దేవేంద్ర, మమత నాగలక్ష్మి కారం పద్మ అరుణ , యాకమ్మ సోమ లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొరటాల సత్యనారాయణ శత జయంతి

నవతెలంగాణ-ఇల్లందు

సీపీఐ(ఎం) మండల కమిటీ అధ్వర్యంలో ఆదివారం సీపీఎం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు, అగ్ర నాయకులు కొరటాల సత్యనారాయణ శత జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు అబ్దుల్ నబి, మన్యం మోహన్ రావు, కూకట్ల శంకర్, తాళ్లూరి పద్మ హుస్సేన్, పాషా, సురేష్,రాజు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి ఆశా వర్కర్ల నిరవదిక సమ్మె

నవతెలంగాణ-ఇల్లందు

25 నుండి ఆశా వర్కర్లు నిరవధిక సమ్మెలోకి వెళుతున్నట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి తెలిపారు. ఇల్లందు, రొంపేడు, కోమరరం, గుండాల, ఆళ్ళపల్లి, టేకులపల్లి మండల సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న అరోగ్య కార్యకర్తలు (ఆశా)ల ప్రాంతీయ సమ్మె సన్నాహక సమావేశం వజ్జ సుశీల అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి పాల్గొని మాట్లాడుతూ ఆశా వర్కర్లకు 18 వేలు ఫిక్స్ వేతనం ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, బీమా సౌకర్యాలు కల్పించాలనే డిమాండ్ల సాధనకు సెప్టెంబర్ 25నుండి నిరవధిక సమ్మె లోకి వెళుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మండలాలలో టెంట్ నిర్వహణ కమిటీలు వేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో గుండాల ఆదిలక్ష్మి, విజయ కుమారి, ఆళ్ళపల్లి సడియం సుగుణ, చంద్రకళ, టేకులపల్లి, మజహరి, విజయ, హైమావతి, ఇల్లందు సీహెచ్సీ ఉమాదేవి,సునిత, రొంపేడు మల్లేశ్వరి, కోమరారం చీమల రమణ, రాధ, స్వప్న, చుంచు విజయ తదితరులు పాల్గొన్నారు.

కొండా చరణ్ అక్రమ అరెస్టును ఖండించండి

నవతెలంగాణ-ఇల్లందు

కొండ చరణ్‌ను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఇల్లందు డివిజన్ కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షులు బుర్ర వెంకన్న తెలిపారు. ఆదివాసుల సమస్యలపై ఈనెల 25న భద్రాచలం ఐటీడీఏ ముందు ఆందోళన కార్యక్రమానికి ప్రజల్ని కలిసి వస్తున్న నాయకుని అక్రమంగా అరెస్టు చేసి, తన వద్ద ఆయుధాలు, కరపత్రాలు ఉన్నాయని తప్పుడు కేసులు పెట్టి, మావోయిస్టు ముద్ర వేయడం సరికాదన్నారు.


నిబద్ధత, నిజాయితీ,

నిరంతర శ్రామికుడు ముక్తార్ పాష

- వర్ధంతి సభలో ఐఎఫ్టియు జాతీయ అధ్యక్షులు సాదినేని

నవతెలంగాణ-ఇల్లందు

మారుమూల అటవీ ప్రాంతమైన గుండాలలో జన్మించి ఇల్లందులో హమాలీ కార్మికులతో మమైకమై ఉద్యమ అక్షం జ్ఞానం నేర్చుకొని దేశవ్యాప్తంగా కార్మిక వర్గానికి దశాదిశను చూపించే అగ్రస్థాయి నాయకుడిగా, జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎదిగాడని ఉద్యమ జ్ఞానాన్ని నేర్పిన ఇల్లందుకు ఇది ఎంతో గణత దక్కుతుందని ఐఎఫ్టియు జాతీయ అధ్యక్షులు సాదినేని అన్నారు. పెన్షనర్ల భవన్ లో కొండపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన ముక్తార్ మూడో వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ సభలో ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జే సీతారామయ్య, జిల్లా కార్యదర్శి ఎండి.రాసుద్దీన్, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు మోకాళ్ళ రమేష్, యూనియన్ జిల్లా నాయకులు పోలు లింగయ్య ప్రసంగించారు.



మద్దిశెట్టి వెంకటేశ్వరరావుకి విద్యాజ్యోతి పురస్కారం

నవతెలంగాణ - జూలూరుపాడు

ఈ నెల 17న త్యాగరాయ గాన సభ చిక్కడపల్లి హైదరాబాద్ నందు ప్రముఖులు విశ్వ కళ విరాట్ బ్రహ్మశ్రీ డాక్టర్ వంగాళా శాంతి కృష్ణ ఆచార్య, ప్రముఖులు రావూరి గిరిధర్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ రాచకొండ కమిషనరేట్స్, బ్రహ్మశ్రీ దుర్వేటి రవిచంద్ర అసిస్టెంట్ ఆఫ్ పోలీస్ స్టేషన్ ఘనాపూర్ (జనగాం జిల్లా), డాక్టర్ దైవజ్ఞ శర్మ సరస్వతీ మాత ఉపాసకులు బ్రహ్మశ్రీ తుమ్మలపల్లి పూర్ణచంద్ర చార్యులు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు తెలుగు వెలుగు మరియు తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు, ఒరిస్సా తెలుగు వెలుగు అధ్యక్షులు, బ్రహ్మశ్రీ పోలోజ్ రాజకుమార్ చేత బంగారు పతకం మెమెంటో శాలువాలతో వెంకటేశ్వరరావును ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులైన రావూరి గిరిధర్ ఐ.పి.ఎస్ అభినందించి బంగారు పతకంతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. గతంలో నాలుగు బంగారు పతకాలు, 10 అవార్డులు వచ్చినందుకు గాను వెంకటేశ్వరావుని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

తెలంగాణ - ఆంధ్రా సరిహద్దులో వాహనాల తనిఖీలు

చంద్రబాబుకు ముద్దుగా వెళ్తున్న ఉద్యోగుల నిలువరించే యోచన

నవతెలంగాణ-అశ్వారావుపేట



చంద్రబాబు అరెస్టుకు నిరసనగా, ఆయనకు నైతిక మద్దతు కోసం ఐటీ ఉద్యోగులు ఆదివారం హైదరాబాద్ నుండి రాజమండ్రి వరకు ర్యాలీ చేపట్టారు. హైద్రాబాద్ టూ రాజమండ్రి వయా అశ్వారావుపేట మీదుగా హైవే 325 బీటీ ప్రధాన రహదారి కావడంతో అశ్వారావుపేట నుండి ఆంధ్రా ప్రవేశ ప్రాంతం జీలుగుమిల్లి వద్ద ఏపీ పోలీసులు తెలంగాణ వైపు నుండి వెళ్ళే ప్రతీ వాహనాన్ని నిలువరించే ప్రయత్నంలో తనిఖీలు చేపట్టారు. సాధారణ వాహనాలు మాత్రమే తమ రాష్ట్రంలోకి అనుమతించారు.

పోరు తెలంగాణకు ఆ గొంతుకే ఆయుధం..

- పీడిత, తాడిత, అణగారిన వర్గాలకు గద్దర్ ఆట..పాట ఒక భరోసా
- స్మారక స్ఫూర్తి సదస్సులో వక్తలు గద్దర్, జహీర్ అలీఖాన్‌కు నివాళులర్పించిన కవులు, కళాకారులు

నవతెలంగాణ -కొత్తగూడెం

బతికున్నంతకాలం తన పాట... ఆటను... ఆయుధంగా మలిచి సమాజంలోని పీడిత, తాడిత, అణగారిన వర్గాలకు అందించి పోరాడే తత్వాన్ని నేర్పిన గద్దర్ ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడని, ప్రజాస్వామ్య విలువల ప్రతిష్టాపన లక్ష్యంగా తన తుదిశ్వాస వరకు పోరాడిన జహీర్ అలీఖాన్ అమరుడని, వీరి మరణం తెలంగాణలోని ప్రతి మానవ హృదయాన్ని తీవ్రంగా కలిచివేసిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ప్రొఫెసర్ కోదండరాం, సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు రాములు, కాంగ్రెస్ నాయకులు పోట్ల నాగేశ్వర్ రావు, న్యూ డెమొక్రసీ రాష్ట్ర నాయకులు సాధినేని వెంకటేశ్వర రావు, అవునూరు మధు, సీపీఎం రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య, రచయిత జయరాజ్, గద్దర్ కుమార్తె డాక్టర్ వెన్నెల అన్నారు. గద్దర్ అమరత్వం, జహీర్ లౌకికత్వంపై ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కొత్తగూడెం క్లబ్ లో ఆదివారం ఏర్పాటు చేసిన స్మారక స్ఫూర్తి సదస్సుకు వారు హాజరై మాట్లాడారు. పేద ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకై గద్దర్ ముందుకు నడిచారని, నాటి నైజాం పోరాటం నుండి తెలంగాణ పోరాటం వరకు దొర గడీల పాలన పోవాలని, ప్రజల మాటలనే పాటలుగా అల్లి ప్రజలను చైతన్యం చేశారని, ఎక్కడ అన్యాయం జరితే అక్కడ నేను ఉన్నా అంటూ ప్రజలపక్షా ప్రభుత్వాన్ని ప్రశ్నించే వాడన్నారు. జన చైతన్యం కోసం తాను నమ్మిన సిద్ధాంతం కోసం చివరి శ్వాస వరకు పోరాటం చేసిన ప్రజా యుద్ధ నౌక గద్దర్ అని పేర్కొన్నారు. గొంగలి, గజ్జలు, ఎర్ర తువ్వలు, చేతి కర్రలో కనిపించే గద్దర్ సాంస్కృతిక విప్లవానికి ఐకాన్ గా నిలిచాడన్నారు. ఏ మతమైనా ప్రజాస్వామ్య రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తించకూడదని, రాజ్యాంగ స్ఫూర్తితో లౌకిక విధానాన్ని కొనసాగించాలని కోరుకున్న సియాసత్ ఉర్దూ పత్రిక మేనేజింగ్ ఎడిటర్, విద్యావేత్త జహీర్ అలీఖాన్ మరణం బాధాకరమని, గద్దర్ అంతిమ యాత్రలో పాల్గొంటూ ప్రాణాలొదలడం వారి మధ్య ఉన్న బంధానాన్ని స్పష్టం చేస్తోందన్నారు. మతాన్ని, రాజకీయాలకు అంటగట్టి లబ్ది పొందే హిందూ, ముస్లీం మతోన్మాదాన్ని వ్యతిరేకించిన లౌకిక, ప్రజాస్వామ్య వాది జహీర్ అలీఖాన్ అని కొనియాడారు. యస్ పాల్, బల్లేపల్లి మోహన్, మిట్టపల్లి సురేందర్ బందాలు సాంస్కృతిక నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే. సాబీర్ పాషా, నిర్వాహక కమిటీ కన్వీనర్ జెబి. శౌరి, సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అధ్యక్షతన జరిగిన సదస్సులో కార్మిక సంఘాల నాయకులు గొల్లపల్లి దయానంద్, న్యూ డెమొక్రసీ రాష్ట్ర నాయకులు ముద్ద బిక్షం, ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు కూసపాటి శ్రీనివాస్, బందెల నర్సయ్య, డాక్టర్ వాసిరెడ్డి రమేష్ బాబు, మారపాక రమేష్, ఎస్సి-ఎస్టీ నాయకులు కాల్వ దేవదాస్, టివిపిఎస్ నాయకులు జి.సతీష్, జర్నలిస్ట్ సంఘాల నాయకులు కల్లోజి శ్రీనివాస్, ఇమంది ఉదయ్ కుమార్, సుగుణారావు, సలిగంటి శ్రీనివాస్, కె. రత్న కుమారి, మైనార్టీ మహిళా నాయకురాలు ఫర్వీన్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.



పేదల భూమి కబ్జా చేసిన అధికార పార్టీ నేతలు

- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్

నవతెలంగాణ-కొత్తగూడెం



కొత్తగూడెం మున్సిపల్ పరిధిలోని పాత కొత్తగూడెంలో పేదలకు ఇచ్చేందుకోసం ప్రతిపాదించిన స్థలంలో రాత్రికి రాత్రి అధికార పార్టీ మున్సిపల్ పాలకపక్షంలోని కీలక వ్యక్తి కబ్జాకి పాల్పడ్డాడని బీఎస్పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ఆరోపించారు. ఆదివారం పాత కొత్తగూడెంలోని పేదల కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీలో, మున్సిపాలిటీలో కీలక పదవిలో ఉన్న వ్యక్తి, క్రీడా ప్రాంగణం కోసం కేటాయించిన 2000 గజాల స్థలాన్ని ఆక్రమించారని ఆరోపించారు. ఈ విషయాన్ని గుర్తించిన రెవెన్యూ అధికారులు హుటాహుటిన ఇక్కడకు చేరుకొని కబ్జా చేసిన స్థలాన్ని రాత్రికి రాత్రే వెలసిన కాంపౌండ్ వాల్‌ను తొలగించారని తెలిపారు. తూతూ మంత్రంగా కూల్చివేతలు చేస్తే సరిపోదని సదరు వ్యక్తులపై పోలీస్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. క్రీడా స్థలం పేరుతో ప్రభుత్వ స్థలాన్ని సొంతంగా ఆక్రమించుకోవడం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారని అన్నారు. మరికొద్ది నెలల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కొత్తగూడెంలోని తహసీల్దారులను వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారని, వీరి స్థానంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దారులకు కొత్తగూడెం నైసర్గిక స్వరూపం తెలియదని, దీన్ని ఆసరాగా చేసుకొని కొందరు అధికార పార్టీ నాయకులు ప్రభుత్వ స్థలాలను తమదిగా చెప్పుకుంటూ దరఖాస్తులు చేసుకుంటున్నారని ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారంపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాల్సి ఉందని కోరారు. కొత్తగూడెం నడిబొడ్డులో రైతు బజార్ స్థలాన్ని సైతం ఈ విధంగానే ఆక్రమించేందుకు పాల్పడిన వ్యక్తులపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. కొత్తగూడెంలో అధికార పార్టీ నాయకుల భూ దోపిడీకి, కబ్జాలకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. లేని పక్షంలో బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సలహాదారు గంధం మల్లికార్జున రావు, జిల్లా సహాయ కార్యదర్శి చెనిగారపు నిరంజన్ కుమార్, అసెంబ్లీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగుల రవికుమార్, అల్లకొండ శరత్, విన్సాలి తదితరులు పాల్గొన్నారు.

హిందూ ముస్లిం ఐక్యతకు కృషి చేద్దాం.....

- బాధిత కుటుంబాలకు అండగా ఉందాం

నవతెలంగాణ-చంద్రుగొండ



సమాజంలో హిందూ ముస్లీం ఐక్యతకు కృషి చేద్దామని, బాధితులకు, అనాథలకు అండగా ఉండామని జమాతె ఇస్లామిక్ హిందు(జేఐహెచ్) సంస్థ జిల్లా అధ్యక్షులు ఫారూఖ్ యస్రాని అన్నారు. ఆదివారం చంద్రుగొండలో జరిగిన జేఐహెచ్ మండల కమిటీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రజల కోసం పనిచేసే సంస్థలకు ఎల్లప్పుడూ సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. రాబోయే నాలుగు సంవత్సరాల చతుర్వర్ష ప్రణాళిక అమలుకై జేఐహెచ్ కృషి చేస్తుందన్నారు. అన్ని మతాల సారాంశం ఒక్కటేనని, పరమత సహనం గొప్పదన్నారు. ఈ సమావేశంలో జేఐహెచ్ అధ్యక్షులు మహ్మద్ షబ్బీర్ హుస్సేన్, మౌలాలి యూసఫ్ పటాన్, ఖాజాహుస్సేన్, నాగుల్‌మీరా, రబ్బానీ, ఆల్తాఫ్, సయూద్, హుస్సేన్, అష్రఫ్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

28న యాస కొండలరావు వర్ధంతి

నవతెలంగాణ - జూలూరుపాడు

ఈ నెల 28న జరిగే సీపీఐ(ఎం) మాజీ మండల కార్యదర్శి, ఉమ్మడి గుండెపుడి పంచాయతీ మాజీ ఎంపిటిసి యాస కొండలరావు రెండవ వర్ధంతిని జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు వల్లమల్ల చందర్ రావు కోరారు. వెంగన్నపాలెం శాఖ సమావేశం గార్లపాటి పవన్ కుమార్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ మండల కమిటీ సభ్యులు వల్లమల్ల చందర్ రావు హాజరై మాట్లాడారు. ఈ వర్ధంతి సభకు సిపిఎం రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, వైరా నియోజకవర్గ ఇన్చార్జ్ భూక్య వీరభద్రం హాజరవుతారని అన్నారు. 28వ తారీకు సాయంత్రం 6 గంటలకు జరిగే వర్ధంతి సభకు మండల ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు గార్లపాటి వెంకటి, శాఖ నాయకులు బోల్లు లక్ష్మయ్య కార్తీక్, అఖిల్, రవి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆపన్న హస్తం

నవతెలంగాణ-చర్ల



నిరుపేద విద్యార్థికి తేగడ విలేజ్ గ్రూప్ ఆపన్న అస్తం అందించింది. మండలంలోని మేడువాయి గ్రామంలో సూదుల శృతి 9వ తరగతి చదువుతున్నది. ఆమెకు ఆకస్మాత్తుగా కడుపులో నొప్పి రావడంతో వెంటనే వెంటనే తల్లిదండ్రులు వైద్యశాలకు తీసుకువెళ్లారు. అక్కడ వైద్యులు వైద్య పరీక్షలు చేసిన అనంతరం కడుపులో గడ్డలు ఉన్నాయని వెంటనే ఈమెకి పెద్ద ఆపరేషన్ చేయాలని వైద్యులు తెలిపారు. సూదుల రాము, భార్య రాణి వృత్తిరీత్యా కూలి పని చేస్తుంటారు. వీరికి ఇద్దరు అమ్మాయిలు. వీరు ఉండే ఇల్లు కూడా 2022లో వచ్చిన గోదావరి వరదలో కూలిపోయింది. వీరు ఆర్థిక ఇబ్బందుల కారణంగా తేగడ విలేజ్ గ్రూపును సంప్రదించగా వైద్య ఖర్చుల నిమిత్తం శెట్టిపల్లి శ్రీనివాస్ రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. ఆ నగదును గ్రూప్ అడ్మిన్ దినసపు సంజీవరెడ్డి, అక్కిన రమేష్ చేతుల మీదుగా సూదుల రాము కుటుంబ సభ్యులకు అందజేశారు. మేడువాయి గ్రామస్తులు తేగడ విలేజ్ గ్రూపు శెట్టిపల్లి శ్రీనివాస్, అడ్మిన్‌లకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పూసం ముత్యాలరావు, మడకం రాము, కంచర్ల పెద వెంకటేశ్వర్లు, గద్దల బాబు, కొప్పుల చిలకమ్మ చెన్నం సమ్మక్క, సూదుల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పోడు పట్టాలు అందజేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల

నవతెలంగాణ-దుమ్ముగూడెం



పోడు సాగు భూములనే నమ్ముకొని జీవనం సాగిస్తున్న అర్హులైన ప్రతి పేద గిరిజనులకు పోడు పట్టాలు అందజేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సింగవరం గ్రామంలో జరిగిన పోడు రైతుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలుకు నోచుకుని పథకాలను ప్రవేశపెడుతూ ఒకరికి ఇద్దరికీ పథకాలు అందజేస్తూ మమ అనిపిస్తుందని ఎద్దేవ చేశారు. మండల వ్యాప్తంగా అనేక మంది పోడు రైతులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన పోడు పట్టాలు నేటికీ అందలేదని, పోడు పట్టాలు అందజేసే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా అనేక మంది పేద కుటుంబాలకు నేటికీ రేషన్ కార్డులు అందలేదన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డులతో పాట గృహలక్ష్మి పథకం ద్వారా రూ.5 లక్షల అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. అమర జీవులు కుంజా బొజ్జి, సున్నం రాజయ్య, యలమంచి సీతారామయ్యల ఉద్యమ స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం, బిఆర్ఎస్ పార్టీని గిరిజన గ్రామాల నుండి తరిమికొట్టేందుకు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే దశల వారి ఉద్యమాలలో గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిల్లా ముత్యాలరావు, కల్లూరి భద్రయ్య సురేష్, పాయం అశోకు, పాయం నాగరాజు, కల్లూరి రామకష్ణ, పూసం రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జేకే ఉపరితల గని ఉద్యోగుల భద్రతపై అవగాహన

నవతెలంగాణ-ఇల్లందు

జేకే 5 ఉపరితల గని నందు ఉద్యోగుల భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ప్రాజెక్ట్ ఆఫీసర్ బొల్లం వెంకటేశ్వర్లు హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూపర్ వైజర్స్ పని స్థలాలలో రక్షణ సూత్రాలు పాటిస్తూ పని చేయాలని, అదే విధంగా ఈపీ ఆపరేటర్లు, లైట్ మోటార్స్ వాహన డ్రైవర్లు వారికి క్వారీ కేటాయించిన పార్కింగ్ స్థలంలో మాత్రమే పార్కింగ్ చేయవలెనని, ఈపి ఆపరేటర్లు, లైట్ మోటార్ వెహికల్ డ్రైవర్లు వారి వాహనము అధికారులు సూచించిన వేగంతో (యస్.ఓ.పి)ప్రకారం మాత్రమే నడపవలేనని, తేలిక పాటి వాహన డ్రైవర్లు తమ వాహనం ఫిట్నెస్ లో ఉండేలా చూసుకోవాలని, ఎర్రజెండాను అమర్చాలని, డ్రైవర్లు తమ వ్యక్తిగత రక్షణ పరికరాలైన టోపీ, బూట్లు, రేడియం జాకెట్ ధరించాలని, ఉద్యోగులు తెలిపిన భద్రతా నియమాలను పాటిస్తూ, (జీరో హర్మ్) సింగరేణిని సాధించాలని తెలిపారు. అదే విధంగా ఇటీవల జరిగిన సేఫ్టీ వీక్ నందు జేకే 5 ఉపరితల గని 3 కేటగిరీలలో ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుపొందిందని ఉద్యోగులందరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ పూర్ణచందర్, సేఫ్టీ ఆఫీసర్ శివప్రసాద్, ఎస్.ఇ(ఇ&యం) నరసింహారావు, సీనియర్ పర్సనల్ అధికారి సుధాకర్, యూనియన్ నాయకులు ఎస్ఎస్. రంగనాథం, కోటయ్య సంజీవ చారి, సేవ్యా ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో సీసీ రోడ్లు ప్రారంభోత్సవం

నవతెలంగాణ- టేకులపల్లి



మండలంలోని పలు గ్రామాలలో సీసీ రోడ్లు ప్రారంభించి, గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు ఇల్లందు నియోజకవర్గ శాసన సభ్యురాలు బానోత్ హరిప్రియ నాయక్ ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం టేకులపల్లిలో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. టేకులపల్లి, బద్దు తండ, ఎర్రాయిగూడెం, కిష్టారం, లచ్చగూడెం, గంగారం, చింతోని చిలుక, ముత్యాలంపాడు క్రాస్ రోడ్, గ్రామ పంచాయతీలలో సిసి రోడ్లను ప్రారంభించి, నూతన గ్రామపంచాయతీ భవనాల శంకుస్థాపనలు చేశారు. డి.ఎం.ఎఫ్‌టి, ఈజీఎస్, ఎస్‌డిఎల్‌ల ద్వారా 2 కోట్ల17 లక్షల, 50 వేల నిధులతో చేపట్టినున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బొమ్మెర్ల వరప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి బోడ బాలు నాయక్, జిల్లా నాయకులు బానోత్ రామా నాయక్, కంబంపాటి చంద్రశేఖర్ రావు, మండల అధికార ప్రతినిధి బానోత్ కిషన్ నాయక్, రైతు బంధు సమితి అధ్యక్షులు లక్కినేని శ్యామ్, మండల ఉపాధ్యక్షులు చీమల సత్యనారాయణ, మండల కో ఆప్షన్ మౌలాన్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ చౌదరి, దళపతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొండా చరణ్ అరెస్ట్ ను తీవ్రంగా ఖండిస్తున్నాం

- ప్రజాపంథా జిల్లా కార్యదర్శి రంగారెడ్డి

నవతెలంగాణ-కొత్తగూడెం

మావోయిస్టు పేరుతో సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకుడు కామ్రేడ్ కొండ చరణ్‌ను చర్ల పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపడాన్ని ప్రజాస్వామిక వాదులు ఖండించాలని సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కెచ్చుల రంగారెడ్డి కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రజాపంద కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొండ చరణ్ ప్రజాపంథా భద్రాచలం డివిజన్ కార్యదర్శిగా పోడు పట్టాలు, గుత్తి కోయిల సమస్యలపై భద్రాచలంలో ప్రదర్శనని ఐటిడిఏ ఎదుట జరగనున్న కార్యక్రమానికి ప్రచార నిమిత్తం చర్ల మండలంలోని బూరుగుపాడు వలస ఆదివాసీ గ్రామానికి వెళ్ళగా పోలీసులు అరెస్టు చేసి మావోయిస్టుగా ముద్ర వేసి అక్రమంగా ఖమ్మం జైలుకు పంపించడం దుర్మార్గమని, ఇట్టి చర్యలను సిపిఐఎంఎల్ ప్రజా పంథా తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ సమావేశంలో ప్రజాపంథా నాయకులు ముద్దా బిక్షం, మాచర్ల సత్యం, జాటోత్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం : సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా భద్రాచలం డివిజన్ కార్యదర్శి కొండా చరణ్‌ను చర్ల పోలీసులు అరెస్టు చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా మండల కార్యదర్శి సాయన్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిషేధిత మావోయిస్టు పార్టీ నాయకులను కలిసి తిరిగి వస్తుండగా చర్ల సిఐ రాజగోపాల్ ఆధ్వర్యంలో చింతగుప్ప అటవీ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నట్లు సోషల్ మీడియా ద్వారా తెలుసుకోవడం జరిగింది అన్నారు. మావోయిస్టు పార్టీకి చెందిన కరపత్రాలు, బ్యానర్లు పేలుడు పదార్థాలు వివిధ రకాల సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లుగా పోలీసులు కట్టుకథలు అల్లుతున్నారని ఆయన అన్నారు. సిపిఎం(ఎల్) ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో ఆదివాసీల సమస్యలపై ఈనెల 25వ తేదీన భద్రాచలం ఐటిడిఏ పిఓ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగిందని దానికి సంబంధించిన ప్రచారం కోసం గ్రామాల్లోకి వెళ్లడం జరిగింది అన్నారు. ఇలాంటి అరెస్టులు నిర్బంధాలు ప్రజాపంథా పార్టీకి కొత్త కావని, అదిరింపులు బెదిరింపులకు కార్యకర్తలు నాయకులు బెదిరేది లేదని అన్నారు. నిత్యం ప్రజల కోసం పనిచేసే ప్రజాపంథా పార్టీని ఏమి చేయలేరని అక్రమంగా అరెస్టు చేసిన కొండ చరణ్‌ను బేషరతుగా విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అరెస్టును ఖండించిన వారిలో సున్నం, వీరభద్రం సుక్కయ్య, శంకర్, శాంత తదితరులు ఉన్నారు.



ప్రజలు సుఖ శాంతులతో ఉండాలి

నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావేద్

నవ తెలంగాణ - ఖమ్మంకార్పొరేషన్

ప్రజలంతా సుఖశాంతులతో సంతోషంగా ఉండాలని నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావేద్ ఆకాంక్షించారు. ఆదివారం నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావేద్ గణపతి ఉత్సవాలను పురస్కరించుకుని పలు డివిజన్లో గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక 29వ డివిజన్లో విద్యాసాగర్ ఆధ్వర్యంలో మహమ్మద్ జావిద్ ను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రావులపాటి పద్మజా, శ్రీనివాస్, రావులపాటి నిఖిల్, అనిల్, నాగరాజు, శంకర్ నాయక్, ఎస్టీ సెల్ టౌన్ అధ్యక్షులు సాధు శంకర్, శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు.



అన్నదానం ప్రారంభించిన చైర్మన్

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా మున్సిపాలిటీ పరిధిలోని రేచర్ల బజార్ నందు గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీ సాయి గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని వైరా మున్సిపాలిటీ చైర్మన్ సూతకాని జైపాల్, వైస్ చైర్మన్ ముల్లపాటి సీతారాములు, ఐద్వా వైరా పట్టణ కార్యదర్శి గుడిమెట్ల రజిత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మిట్టపల్లి నాగేశ్వరరావు, దార్నా శేఖర్, రెచర్ల వెంకటేష్, కంబంపాటి సత్యనారాయణ, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



వినాయక మండపాల్లో ప్రసాద్‌రెడ్డి ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

పాలేరు ప్రజలకు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ఆ వినాయకుడిని కోరుకున్నట్లు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కొక్కిరేణి, ఎర్రగడ్డ, గోపాలపురం, తిమ్మక్కపేట, తెట్టెలపాడు, పిండిప్రోలు, తిరుమలాయపాలెం గ్రామాల్లో గణేష్ విగ్రహ ఉత్స కమిటీలకు పూజా సామాగ్రి కొరకు 5000 రూపాయలు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి అందజేశారు. చావా శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఈ సహాయాన్ని అందించారు. మొదట కొక్కిరేణి స్టేజి వద్ద శీనన్న అభిమానులు పెద్ద ఎత్తున వారికి ఘన స్వాగతం పలికారు. సుమారు 200 బైకులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి, బెల్లం శ్రీనివాస్, రామ సహాయం మహేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్, మాజీ వైస్ ఎంపీపీ చామకూరి సురేందర్, ఎర్రగడ్డ సర్పంచ్ గడ్డి కొప్పుల రాజు, తిమ్మక్కపేట సర్పంచ్ చుంచు రాములు, తిమ్మకపేట మాజీ సర్పంచ్ సంద్ర వెంకటేశ్వర్లు, పిండిప్రోలు మాజీ సర్పంచ్ తాతా బిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శాంతినగర్ స్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం శాంతినగర్ హై స్కూల్ 1975 -76 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అత్యంత వైభవంగా శ్రీ శ్రీ హెూటల్ నందు జరిగింది. ఆనాటి గురువులైన కృష్ణమూర్తి, డిఎస్ చారి, సీతారామ రావు, రామారావులను సన్మానించారు. అదేవిధముగా ప్రస్తుత హెచ్ఎం క్రిష్ణవేణిని కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆనాటి విద్యార్థులు గుర్రం ఉమామహేశ్వరరావు, ఉండీల గంగాధర్, వంటి కొమ్ము శ్రీనివాస్ రెడ్డి, షేక్ సైదులు, రాజేశ్వరరావు, పలగాని రవి, అక్బర్ బాషా, ప్రభాకర్ రెడ్డి, విద్యాసాగర్, సి హెచ్ రంగయ్య ,అల్లిక నరసయ్య తదితరులు సుమారు 60 మందితో అత్యంత వైభవంగా ఆనందోత్సాహాలతో అలనాటి అనుభూతులను గుర్తుకు తెచ్చుకుని ఆనందించారు. సత్యానందం చక్కటి పాటలతో అందరినీ అలరించారు



పొడుచుకున్న కత్తులు ఒకే 'ఒరలో'

- మొన్నటిదాకా మన పార్టీలోఉంటూ కత్తులు దూసుకున్నారు
- ఇప్పుడేమో వేరే పార్టీలోకి వెళ్లి మళ్లీ పొడుచుకుంటారు
- సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

నవతెలంగాణ-సత్తుపల్లి

ఇంతకుముందు ఎవరైతే మన పార్టీలో ఉంటూ కత్తులతో పొడుచుకున్నారో మళ్లీ ఆ వ్యక్తులు వేరే పార్టీలోకి వెళ్లారని వాళ్లంతా ఇవాళ ఒకే రథంపై వస్తున్నారని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఎద్దేవా చేశారు. ఇప్పుడు ఒకరిపై ఒకరు పైపై ప్రేమలు చూపించుకుంటున్నారన్నారు.బీఆర్ఎస్ పార్టీలో లబ్ధిపొందిన వీళ్లంతా అదే పార్టీకి ద్రోహం చేసేందుకు కూడా వెనకాడలేదన్నారు. ఎవరు నిజమైన ప్రజా సేవకులు అనే విషయం ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. సంక్షేమ అభివద్ధి ఫలాలను అందించే విషయంలో కేసీఆర్ రాజకీయ కోణం చూడటం లేదన్నారు. పేదరికమే గీటురాయిగా సంక్షేమ ఫలాలను అందిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు అందుకుంటున్న విషయంలో తెలంగాణ ప్రజలంతా



సంతప్తికరంగా ఉన్నారని ఎమ్మెల్యే సండ్ర స్పష్టం చేశారు. నవంబర్ చివరి వారంలో గాని, డిసెంబర్ మొదటి వారంలో గాని ఎన్నికలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ఇప్పటి నుంచే సమాయత్తంగా ఉండాలన్నారు. ఈ 60 రోజుల పాటు కేసీఆర్ అందించిన సంక్షేమాభివద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యేలా సత్తుపల్లిలో గులాబీ జెండా ఎగిరేలా అహర్నిశలు కషి చేయాలని సండ్ర పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

5203 మందికి....రూ.26.30కోట్లు

నాలుగున్నర యేండ్లలో సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులు

సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

నవతెలంగాణ-సత్తుపల్లి

2019 నుంచి ఇప్పటివరకు ఈ నాలుగున్నర యేండ్ల కాలంలో సత్తుపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో 5203 మంది లబ్ధిదారులకు రూ. 26.30 కోట్ల మేర ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక చేయూత అందిందని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. ఆదివారం సత్తుపల్లిలోని లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాలులో 200 మంది లబ్ధిదారులకు రూ.1.3 కోట్లు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. ఇంత పెద్ద మొత్తంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సాయం అందించిన దాఖలాలు గతంలో లేవన్నారు. ఊరికి ఒకటో రెండో వస్తే గొప్ప విషయంగా ఉండేదన్నారు. తాను హైదరాబాదు వెళ్లిన ప్రతిసారీ 100 పైగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను తీసుకురావడం జరుగుతుందన్నారు. అలా పెట్టగానే ఇలా వస్తుందని కొందరు అనుకోవచ్చు గాని వాటిని మంజూరు చేయించడంలో ఎంతో శ్రమ ఉందన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ సీఎంఆర్ఎఫ్ ద్వారా కోట్లాది రూపాయలను బాధిత కుటుంబాలకు అందిస్తూ వస్తున్నారన్నారు. ఒక్క సత్తుపల్లికే రూ. 26.30 కోట్లు ఇస్తే 119 నియోజకవర్గాలకు ఎన్ని కోట్లు ఇచ్చి ఉంటారన్నారు. ఆస్పత్రుల పాలై ఆర్థికంగా చితికపోయిన కుటుంబాలను ఆదుకునే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్ద మనసుతో ఇంత పెద్ద మొత్తంలో ఈ సాయాన్ని అందించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ఎంపీపీలు దొడ్డా హైమావతిశంకర్రావు, లక్కినేని అలేఖ్యవినీల్, డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, డిసిసిబి డైరెక్టర్ చల్లగుండ్ల కష్ణయ్య, నాయకులు శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, దొడ్డా శంకర్రావు, బీఆర్ఎస్ పట్టణ మండల అధ్యక్షులు ఎస్కే రఫీ యాగంటి శ్రీనివాసరావు, కొత్తూరు సర్పంచ్ ఒగ్గు విజయలక్ష్మి శ్రీనివాసరెడ్డి ఉపసర్పంచ్ పెద్దిరెడ్డి పురుషోత్తం పాల్గొన్నారు.

అణగారిన జనాల కోసం విప్లవ మార్గం ఎంచుకున్న చాకలి ఐలమ్మ

రుద్రంపూర్‌లో ఐలమ్మ 38వ వర్ధంతి

నవతెలంగాణ-కొత్తగూడెం

అణగారిన జనాల కోసం విప్లవ మార్గాన్ని చాకలి ఐలమ్మ ఎంచుకుందని జిల్లా రజక వృత్తిదారుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు ముదిగొండ రాంబాబు, చిటికెన మునలయ్యలు అన్నారు. ఆదివారం కొత్తగూడెం, రుద్రంపూర్‌లో రజక వృత్తిదారుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు కంచల శ్రీనివాస్, శేఖర్, సమ్మయ్య ఆధ్వర్యంలో ఐలమ్మ 38వ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముదిగొండ రాంబాబు చిటికెన మునలయ్య మాట్లాడుతూ ఆనాడు చాకలి ఐలమ్మ భూమికోసం, భుక్తి కోసం బానిస (వెట్టి) చాకిరి విముక్తి కోసం. అణగారిన జనాల కోసం విప్లవ మార్గం ఎంచుకున్నదన్నారు. ఆ మార్గం ద్వారానే పీడిత జనాల బానిసత్వాన్ని పోగొట్టడానికి బీసీ సామాజిక అన్ని కులాలను ఏకం చేసి భూమి కోసం భుక్తి కోసం వ్యక్తి చాకిరీ విముక్తి కోసం పోరాటాలు జరిపించారని చెప్పారు. ఆమె ఆధ్వర్యంలో పది లక్షల ఎకరాల భూమి పంపకం జరిగిందని చెప్పారు. ఆ పోరాటంలో సుమారు 4000 మంది అమరులయ్యారని, వారిని యాదిలో పెట్టుకోవడానికి చాకలి ఐలమ్మ వర్ధంతి జరుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాగుల రాజయ్య, రాము, ధర్మవరపు సదానందం, గుడి కందుల తెల్లబాయి,



కోలిపాక కొమరమ్మ, కుమ్మరి కుంట్ల వెంకటేశ్వర్లు, కొత్తపల్లి శంకర్, కొత్తపల్లి రాజ్ కుమార్, దేవరకొండ లక్ష్మయ్య, పొన్నాల కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షునిగా బూరుగు దాసు

నవతెలంగాణ-సత్తుపల్లి

రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం సత్తుపల్లి యూనిట్ ఉపాధ్యక్షునిగా బూరుగు దాసును నియమించింది. ఇప్పటివరకు ఈ పదవిలో ఉన్న వనమారెడ్డి సత్యనారాయణరెడ్డి ఇటీవల మరణించిన నేపథ్యంలో సంఘ కార్యవర్గంలో ఖాళీగా ఉన్న ఈ పదవిని ఆదివారం ఆ సంఘ భవన్ లో జరిగిన అత్యవసర సమావేశంలో ఈ పదవిని దాసుకు అప్పగించారు. సంఘ కార్యవర్గం సంఘ సభ్యులు దాసుకు పదవి ఇవ్వడాన్ని ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

ఖమ్మం నగరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు బండారు రవికుమార్ మాతృమూర్తిని ఆదివారం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్, ఎర్ర శ్రీనివాసరావు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఐ

అన్నపురెడ్డిపల్లి : మండల పరిధిలోని రాజపురం గ్రామంలో గల ఎస్సీ కాలనీలో గల వినాయక మండపం దగ్గర ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సబ్ ఇన్‌స్పెక్టర్ షాహిన హాజరై అన్నదాన కార్యక్రమం ప్రారంభించి భక్తులకు వడ్డించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవరాత్రులు పూర్తి చేసుకునే వరకు కమిటీ వారిదే పూర్తి బాధ్యత అని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు.



నిర్విఘ్నంగా నిర్వహిస్తున్న 'నెల నెల వెన్నెల'కు అభినందనీయం

జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు

నవతెలంగాణ- ఖమ్మం

నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రం ఖమ్మం లో నెల నెల వెన్నెల 74వ నెల కార్యక్రమం నిర్వహించారు . ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ లింగాల కమల్రాజు మాట్లాడుతూ 74 నెలలుగా నిర్విఘ్నంగా తెలంగాణ తొలి అమరవీరుడు అన్న భక్తుల రవీంద్రనాథ్ పేరుతో ఆర్బ్, ప్రజానాట్యమండలి ,ఖమ్మం కళాపరిషత్ ఈ మూడు కళా సంస్థల ఆధ్వర్యంలో ఐక్యంగా సాంస్కృతిక కార్యక్రమాలను మరుగున పడుతున్న నాటక రంగానికి వెలుగులనదుతూ నెల నెల వెన్నెలను కొనసాగించడం అభినందనీయమని ఆయన అన్నారు. జడ్పీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలకు ఒక పెద్ద వేదికగా భక్త రామదాసు ఉండటం సంతోషమని, సౌకర్యాలతో ఉన్నప్పటికీ ఇంకా నాటక రంగానికి అవసరమైనటువంటి ఇంకొన్ని సౌకర్యాలు కావాలని అభ్యర్థించారు. అభ్యర్థనను పరిగణలోకి తీసుకొని నా సాయి శక్తుల భక్త రామదాసు అభివృద్ధికి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాట ఇచ్చారు. ఆత్మీయ అతిథి చాంబర్ ఆఫ్ కామర్స్ వైస్ ప్రెసిడెంట్ సోమ నరసింహారావు మాట్లాడుతూ ఒక అద్భుతమైన సంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నెలనెలా వెన్నెల కార్యక్రమ నిర్వాహకులు అందులో నాకు కూడా భాగం పంచుకునే అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు మునుముందు కూడా ఈ కార్యక్రమానికి నా పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు.తొలుత స్థానిక కళాకారులు పొన్నేకంటి స్వప్న పున్నయ్య,ఇజ్రాయిల్, ఆకుల గణపతిరాజు, శేఖర్ బాబు ,అయితా రాజ్ కుమార్ గీతాలాపనలు చేశారు. అమరజీవి అన్న బత్తుల రవీంద్రనాథ్ చిత్రపటానికి జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు పూలమాల వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అన్న బత్తుల సుబ్రహ్మణ్య కుమార్, మోటమర్రి జగన్మోహన్రావు కళా పరిషత్ అధ్యక్షులు డాక్టర్ నాగబత్తిని రవి ,ఆర్బ్ ఉపాధ్యక్షులు జాబిశెట్టి పాపారావు, అన్నా బత్తుల ప్రదీప్ కుమార్, ప్రజానాట్యమండలి అధ్యక్షులు నామ లక్ష్మీనారాయణ ,ఉపాధ్యక్షులు నందిగామ కృష్ణ, వ్యాఖ్యాత రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా బిల్లును తక్షణమే అమలు చేయాలి : ఐద్వా

నవతెలంగాణ-ముదిగొండ



మహిళలకు 33% రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్లో తక్షణమే అమలు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు అఫ్రోజ్ సమీనా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో జరిగిన ఘటనలకు నిరసనగా, మహిళలకు రక్షణ కల్పించాలని మహిళా బిల్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యంలో గత రెండు రోజుల నుండి జిల్లాలో నిర్వహిస్తున్న జీపుజాతా ఆదివారం ముదిగొండకు చేరుకుంది. ఈసందర్భంగా ఐద్వా మండల అధ్యక్షులు మందరపు పద్మ అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ పార్లమెంట్లో తమకు అనుకూలంగా ఉన్న అనేక బిల్లులను ప్రవేశపెట్టి పాస్ చేయించుకున్నారన్నారు. మహిళా బిల్లును పాస్ చేయకుండా నిర్లక్ష్యం చేయటం ఏమిటని ఆమె ప్రశ్నించారు. రానున్న ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని ప్రధాని మోడీ ఆడుతున్న నాటకమన్నారు. మహిళా బిల్లును జనగణన తర్వాత అమలు చేస్తామని చెప్పటం ప్రధాని మోడీ ద్వంద నీతికి నిదర్శనమన్నారు. జనగణనకు సంబంధం లేకుండానే 2024 ఎన్నికల్లోనే మహిళా బిల్లును అమలు చేయాలన్నారు. జనగణనకు మహిళా బిల్లుకు ముడిపెట్టడం ఎన్నికల్లో మహిళల ఓట్లతో ప్రధాని మోడీ లబ్ది పొందాలని చూస్తున్నారన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశంలో మత ఘర్షణలు పెరిగాయన్నారు. మనుషుల మధ్య కులమతాల అడ్డుగోడలుగా పెట్టి హిందుత్వం పేరుతో మతోన్మాదాన్ని ప్రధాని మోడీ రెచ్చగొడుతున్నారని ఆమె విమర్శించారు. మణిపూర్ లో మహిళల పట్ల జరిగిన ఘటనలు బాధాకరమన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించకపోతే దేశం మొత్తం మణిపూర్ లా మారుతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు తమ హక్కులకే నినదించి ఉద్యమించాలన్నారు.ఐద్వా రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళ మాట్లాడుతూ దేశంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు.ప్రతిరోజు దేశంలో ఎక్కడో ఒక చోట మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. హింసకు వ్యతిరేకంగా మహిళలు గొంతెత్తలన్నారు. బిజెపిని తరిమికొడితేనే భవిష్యత్తున్నారు. మహిళల సమస్యలపై పోరాడే ఐద్వాకు అండగా ఉండాలన్నారు. మహిళా బిల్లును పాస్ చేయకుండా బిజెపి ప్రభుత్వం దోబూచు లాడుతుందని ప్రధాని మోడీ ప్రజా వ్యతిరేక విధానాలపై ఆమె ధ్వజమెత్తారు. దేశాన్ని నాశనం చేసి,ప్రజాసంపదను లూటీ చేసి,ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా అమ్మేస్తున్నారని ఆమె తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మోడీ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ,మహిళా బిల్లులు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 5న ఢిల్లీలో ర్యాలీ నిర్వహించినట్లు ఈర్యాలీలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్న జయప్రదం చేయాలని ఆమె కోరారు.తొలిత మహిళ జిబు జాతకు ఐద్వా మండల కమిటీ ఆధ్వర్యంలో మహిళలు అధిక సంఖ్యలో హాజరై ముదిగొండలో భారీగా బతుకమ్మ పువ్వులతో ఘనంగా స్వాగతం పలికారు. ఈసభలో ఐద్వా జల్లా అధ్యక్షకార్యదర్శి బండి పద్మ, మాచర్ల భారతి, ఉపాధ్యక్షులు మెరుగు రమణ, సహాయ కార్యదర్శి మొహిర్నిషాబేగం, నాయకులు భాగం అజిత, అమరావతి, బేబీ, ఫరీదా, మండల కార్యదర్శి పయ్యావుల ప్రభావతి, మండల ఉపాధ్యక్షులు కటారి రోజా, నాయకురాలు కోలేటి అరుణ, వినుకొండ రాణి, జయమ్మ లాల్ బి.అరుణ, రేణుక, లక్ష్మిమోర గట్టమ్మ తదితరులు పాల్గొన్నారు.



గణపతి మండపాలను దర్శించుకున్న ఎమ్మెల్యే సండ్ర

నవతెలంగాణ- కల్లూరు

కల్లూరులోని పలు ప్రాంతాలలో వినాయక విగ్రహాల కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా కల్లూరు శాంతినగర్ 1, 2, 3లలో, ఏకలవ్య నగర్‌లో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో, అదేవిధంగా పుల్లయ్య బంజారా వీధిలో రెండు విగ్రహాలను, వెల్లంకి ఎస్టేట్, మరియు కల్లూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో, బొమ్మరిల్లు కాలనీ, కప్పల బంధం రోడ్డు, అదేవిధంగా డబల్ బెడ్ రూమ్ కాలనీల నందు,ఆయా కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణపతి పందిర్లలో గణపతి విగ్రహాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు ఎమ్మెల్యే సండ్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సండ్ర ప్రారంభించి నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో జడ్పిటిసి కట్ట అజయకుమార్, లక్కినేని రఘు, కాటేపల్లి రజిని, గుర్రం వెంకటేశ్వరరావు, పసుమర్తి రాంబాబు పాల్గొన్నారు.

శ్రీ ద్వారక గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం

నవతెలంగాణ- ఖమ్మం

నగరంలోని గట్టయ్య సెంటర్‌లో శ్రీ ద్వారక గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, కిరణ్, పగడాల నాగరాజు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మండపంలో పర్యావరణ హితం అయిన 6 అడుగుల మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేసినందులకు ఇటికాల భాస్కర్‌ను నిర్వాహకులు అభినందించారు. ఈ సందర్భంగా బత్తుల మురళి, స్వరూప రాణి లను నిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండపం నిర్వాహకులు వసంత రావు, రామకృష్ణ, హరినాధ్ పాల్గొన్నారు.





వినాయక మండపాల్లో పొంగులేటి ప్రత్యేక పూజలు

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం నియోజకవర్గంలో ఆదివారం పర్యటించారు. పర్యటనలో భాగంగా ఖమ్మం నగరంలోని సుందరయ్య నగర్, గాంధీనగర్, జహీర్ పుర తండా, శ్రీనివాసనగర్, బోనకల్ రోడ్, శ్రీరామ్‌నగర్, బి.కె.బజార్, రిక్కాబజార్, ఖైకొండాయిగూడెం, పాండురంగాపురం, గాంధీచౌక్‌తో పాటు రఘునాథపాలెం మండలంలోని రాంక్యా తండా తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లేలా చూడాలని వినాయకున్ని వేడుకున్నారు. ఆయా మండపాల్లో ఏర్పాటు చేసిన అన్నదాన, ప్రత్యేక పూజాది కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులు పొంగులేటిని ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కారించారు.

ఖమ్మంరూరల్ : తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఖమ్మం రూరల్ మండలంలో ఆదివారం పర్యటించారు. పర్యటనలో భాగంగా మండలంలోని కె.ఎల్.ఆర్. బందావనం, రాజీవ్ గహకల్ప, నడిమితండా, సత్యనారాయణపురం తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లేలా చూడాలని వినాయకున్ని వేడుకున్నారు. ఆయా మండపాల్లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులు పొంగులేటిని ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కారించారు.

కూసుమంచి: ఏకదంతాయ... వక్రతుండాయ... గౌరీతనయాయ వినాయక..అంటూ ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలందరినీ సుఖసంతోషాలతో వర్ధిల్లేలా చూడాలని... సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో సస్యశ్యామలం కావాలని కోరుకుంటూ గణనాథునికి తెలంగాణ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండలంలో ఆదివారం పర్యటించారు. పర్యటనలో భాగంగా నాయకన్ గూడెం, కూసుమంచి, పాలేరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పలు వినాయక మండపాలను సందర్శించారు. ప్రత్యేక పూజలు చేశారు. విరాళాలను కానుకగా సమర్పించారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిటీ నిర్వాహకులు పొంగులేటిని ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు.

స్కీమ్ వర్కర్స్ ను క్రమబద్ధీకరించాలి

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

- స్కీమ్ వర్కర్లకు ప్రత్యేక పే కమిషన్
- మూడు స్కీమ్ వర్కర్స్ ఉమ్మడి సదస్సులో తపన్ సేన్
- పార్లమెంటరీ నియోజకవర్గాల్లో ఆందోళనలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

స్కీమ్ వర్కర్స్ ను క్రమబద్ధీకరించాలని, ప్రభుత్వంగా అన్ని ప్రయోజనాల చట్టబద్ధమైన చెల్లింపులను నిర్ధారించాలని సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రాయోజిత పథకాల కింద స్కీమ్ వర్కర్లకు ప్రత్యేక పే కమిషన్‌ను డిమాండ్ చేశారు. ఆదివారం నాడిక్కడ హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్ లో ఎఐఎఫ్ఎడబ్ల్యుహెచ్, ఎడబ్ల్యుఎఫ్ఎఫ్ఐ, ఎండిఎంఎం డబ్ల్యుఎఫ్ఐ సంఘాల అధ్వర్యంలో ఉమ్మడిగా "స్కీమ్ కార్మికుల హక్కుల అఖిల భారత కన్వెన్షన్" జరిగింది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను బహిర్గతం చేయడానికి పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా నిరసనలు నిర్వహించాలని సదస్సు నిర్ణయించింది. మత



అనుకూల కార్పొరేట్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇంటింటికి ప్రచారం చేయాలని, 50 లక్షల కుటుంబాలను కలవనున్నట్టు పేర్కొంది. ఎఐఎఫ్ఎడబ్ల్యుహెచ్ అధ్యక్షురాలు ఉషారాణి, ఎడబ్ల్యుఎఫ్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి మధుమితా బందోపాధ్యాయ, ఎండిఎంఎండబ్ల్యుఎఫ్ఐ అధ్యక్షురాలు కృష్ణరాయ్ ఛటర్జీలతో కూడిన అధ్యక్ష వర్గంగా ఈ సమావేశాన్ని నిర్వహించింది. కన్వెన్షన్‌ను ఎఐకెఎస్ ఆర్థిక కార్యదర్శి పి కృష్ణప్రసాద్, ఐద్వా ప్రధాన కార్యదర్శి మరియం ధావలే, ఎఐఎడబ్ల్యుయు సహాయ కార్యదర్శి విక్రమ్ సింగ్ సంఘీభావం తెలుపారు. సిఐటియు కార్యదర్శి, ఎఐఎఫ్ఎడబ్ల్యూహెచ్ ప్రధాన కార్యదర్శి ఎఆర్ సింధు డిక్లరేషన్‌ను విడుదల చేశారు. హర్యానా, జమ్మూ కాశ్మీర్‌లో ఆశా వర్కర్లు చేస్తున్న నిరవధిక సమ్మెకు మద్దతుగా సమావేశం తీర్మానం చేసింది. 24 మంది ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించిన డిక్లరేషన్‌కు మద్దతుగా మాట్లాడారు. ప్రతినిధులు తమ పోరాటాలు, విజయాల అనుభవాన్ని, అలాగే రాజ్య అణచివేతను ఎదుర్కొని పోరాటాలను ఎలా విజయం సాధించారో వివరించారు. క్రమబద్ధీకరణ, కనీస వేతనాలు, సామాజిక భద్రతతో పాటు పౌష్టికాహారం, ఆరోగ్యం, విద్య, ప్రజల హక్కులు వంటి డిమాండ్ల కోసం పోరాడాలని ఈ సమావేశం పునరుద్ఘాటించింది. కార్పొరేట్ మతోన్మాదంతో వ్యాప్తి చెందుతున్న మత విషానికి వ్యతిరేకంగా ప్రచారం చేపట్టాలని కూడా నిర్ణయించింది.సదస్సును సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ ప్రారంభించారు. సామాజిక భద్రత, పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సేవల స్కీమ్ లకు తగిన బడ్జెట్ కేటాయింపు చేయాలని, స్కీమ్ ల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. 45వ ఐఎల్ఓ ప్రతిపాదనల మేరకు స్కీమ్ కార్మికులకు రూ.26 వేలకు తక్కువ లేకుండా కనీస వేతనాలు అమలు చేయాలని అన్నారు. అంగన్ వాడీ వర్కర్స్ కు సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు.

లేబర్ కోడ్స్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.అక్టోబర్ 30న ఆశా వర్కర్స్ పార్లమెంట్ మార్చ్ పిలుపు ఇచ్చారు. అక్టోబర్ 3 దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బ్లాక్ డేకి పిలుపు ఇచ్చింది. నవంబర్ 26 నుంచి 28 వరకు మూడు రోజుల పాటు రాజ్ భవన్ ల ఎదుట రాత్రి పగలు మహా పడావ్ పోరాటం చేయాలని పేర్కొంది. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఇంటింటికి ప్రచారం, జాతాలు, ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహణ చేయాలని పిలుపు ఇచ్చింది. అక్టోబర్‌లో ప్రతి పార్లమెంటరీ నియోజకవర్గంలో ఉమ్మడి సదస్సులు నిర్వహించి, ఎన్డీఏ ఎంపీలకు చార్జి షీట్ సమర్పించాలని సదస్సు పిలుపు ఇచ్చింది. 24 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుండి మూడు వందల మందికి పైగా ప్రతినిధులు కన్వెన్షన్‌లో పాల్గొన్నారు.

ట్యాంక్ బండ్‌పై సందడి వాతావరణం

- నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగరంలోని ట్యాంక్‌బండ్ వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనం అత్యంత వైభవంగా కొనసాగుతోంది. హుస్సేన్‌సాగర్‌కు తరలుతున్న గణనాథులతో, ప్రజల ఆటపాటలతో నగరం సందడిగా మారిపోయింది. ఆదివారం కావడంతో ఎటుచూసినా కోలాహలమే కనిపించింది. ఖైరతాబాద్, ట్యాంక్‌బండ్, టెలిఫోన్ భవన్, లక్డీకాపూల్, లిబర్టీ, ఆబిడ్స్, హిమాయత్‌నగర్, సికింద్రాబాద్‌తోపాటు పలు ప్రాంతాల్లో సందర్శకుల సందడి నెలకొంది. ఈనెల 18న గణేష్ ఉత్సావలు ప్రారంభం కావడం, మూడు రోజుల నుంచే నిమజ్జనం ప్రక్రియ మొదలు కావడంతో పెద్దఎత్తున విగ్రహాలను ట్యాంక్ బండ్‌కు తీసుకొస్తున్నారు. అలాగే నిమజ్జనాన్ని తిలకించేందుకు సందర్శకులు.. పిల్లాపాపలతో తరలివస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మూడు కమిషనరేట్ల పోలీస్ అధికారులు ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బందిని అప్రమత్తం చేశారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తున్నారు. గణేషులను తీసుకెళ్లే రహదారులతోపాటు ఘాట్ల వద్ద అదనంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మహిళల భద్రత, ఆకతాయిల ఆటకట్టించేందుకు షీ బృందాలతో ప్రత్యేక నిఘా వేశారు. ఆదివారం హైదరాబాద్ కమిషనరేట్‌లో సీపీ సీవీ ఆనంద్ ట్యాంక్ బండ్‌పై జరుగుతున్న నిమజ్జన ప్రక్రియను పరిశీలించి నిమజ్జన ఏర్పాట్లపై ఆరా తీశారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో సిబ్బందిని అప్రమత్తం చేశారు. భక్తులతో ట్యాంక్ బండ్ కిక్కిరిసిపోవడంతో నిర్వాహకులకు, పోలీస్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలను అందించారు. సీపీతో సెంట్రల్‌జోన్ డీసీపీ వెంకటేశ్వర్లు తదితర అధికారులున్నారు.

ఖైరతాబాద్ గణేశుడి దర్శనానికి పోటెత్తిన సందర్శకులు

ఖైరతాబాద్‌లో కొలువుదీరిన మహాగణపతిని దర్శించుకునేందుకు సందర్శకులు భారీ సంఖ్యలో తలివచ్చారు. ఆదివారం సెలవు కావడంతో భక్తులు ఉదయం నుంచే పిల్లాపాలతో తరలివచ్చారు. దాంతో ఖైరతాబాద్ మెట్రో స్టేషన్, ట్యాంక్‌బండ్, టెలిఫోన్ భవన్ వైపు నుంచి వచ్చే భక్తుల కోసం నిర్వాహకులు క్యూలైన్లను ఏర్పాటు చేశారు. క్యూలైన్లలోనే భక్తులను అనుమతిస్తున్నారు. ఈ సారి ఖైరతాబాద్‌లో 63 అడుగుల గణపతిని ఏర్పాటు చేశారు. ఈ నెల 28న ఖైరతాబాద్ గణేశ్ నిమజ్జనం జరగనుంది. నిమజ్జనానికి ముందు వీకెండ్ శని, ఆదివారం కావడంతో నగరంతోపాటు వివిధ జిల్లాలు, నగర శివారుప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు.

బీఆర్ఎస్‌లో చేరిన ఏపూరి సోమన్న

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రముఖ గాయకుడు ఏపూరి సోమన్న బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆదివారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ మధుసూదనాచారీ సోమన్నకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి విప్ బాల్క సుమన్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఇతర కవులు, కళాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపూరి సోమన్న మాట్లాడుతూ పదేండ్లైనా తెలంగాణలో ప్రత్యామ్నాయం కలగన్నా అది కాలేదనీ, రాలేదని తెలిపారు. తన ఇంటికి తాను వచ్చిన భావనలో ఉన్నట్టు తెలిపారు. ఎవరి పాలయింది తెలంగాణ అంటే కేసీఆర్ పాలయిందనీ, కేసీఆర్ పాలే కావాలని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో తనకూ భాగముందని గుర్తుచేశారు. బీఆర్ఎస్ కు కట్టుబడి పని చేస్తామనీ, తాను తిరిగిన పార్టీలు అట్టర్ ఫ్లాప్ అయ్యాయని తెలిపారు. సీఎం కేసీఆర్ దారిలో నడుస్తాననీ, కేసీఆర్ పాటలు పాడుతాననీ సోమన్న తెలిపారు.

ఆసియా, ఆఫ్రికాపై ప్రభావం

- అక్కడ 'సామాజిక అశాంతి' ప్రమాదం : భారతదేశ బియ్యం ఎగుమతి నిషేధంపై యూఎన్ నిపుణుడు

న్యూఢిల్లీ: బియ్యం ఎగుమతులపై నిషేధం విధిస్తూ భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ఆసియా, ఆఫ్రికాల్లో రాజకీయ అస్థిరత ఏర్పడే ప్రమాదం ఉందని ఐక్యరాజ్యసమితి(యూఎన్)కు చెందిన ఇంటర్నేషనల్ ఫండ్ ఫర్ అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్ అధిపతి అల్వారో లారియో అన్నారు. జులై రెండో వారంలో భారత్ తన బియ్యం ఎగుమతులను నిషేధించిన విషయం తెలిసిందే. దీంతో పెరుగుతున్న దేశీయ ధరలను అదుపు చేసే ప్రయత్నంలో, గ్లోబల్ మార్కెట్‌లో బియ్యం ధర 15 ఏండ్ల గరిష్టానికి పెరిగింది. ప్రపంచ బియ్యం వ్యాపారంలో భారతదేశం వాటా 40 శాతంగా ఉన్నది. భారత్ చేసిన ఎగుమతి నిషేధం, ప్రపంచ జనాభాలో దాదాపు సగం మందిని ప్రభావితం చేసిందనీ, వీరికి బియ్యం ప్రధాన ఆహారమని నిపుణులు తెలుపుతున్నారు. " ముఖ్యంగా ఆఫ్రికాలో, ఖచ్చితంగా సంభావ్య సంఘర్షణ లేదా సామాజిక అశాంతిని తెస్తుంది. ఈ సమయంలో ఇది చాలా ప్రమాదకరం" అని లారియో బ్లూమ్‌బెర్గ్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో యూఎన్ నిపుణుడు చెప్పారు. ఎగుమతి నిషేధాలు ధరలను పెంచుతాయనీ, అక్కడి ప్రజలపై చాలా ప్రభావం చూపుతాయని అన్నారు. బియ్యం దిగుమతులపై ఎక్కువగా ఆధారపడిన ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాలు ఇప్పటికే అధిక ధరల కారణంగా ప్రతికూల ప్రభావాలను ఎదుర్కొంటున్నాయని ఆయన విచారం వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీల జేఏసీని చర్చలకు పిలవాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య
- ప్రణాళిక సంఘం వైస్ చైర్మెన్ వినోద్‌కుమార్ ఇల్లు ముట్టడి..
- రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె దీక్షలు



నవతెలంగాణ - కరీంనగర్/విలేకరులు

ప్రభుత్వం మొండి వైఖరి వీడి అంగన్‌వాడీల జేఏసీని చర్చలకు పిలవాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య కోరారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు జాయింట్ యాక్షన్ కమిటీ (సీఐటీయూ, ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్తంగా 14 రోజుల నుంచి సమ్మె కొనసాగుతున్న విషయం తెలిసిందే. అందులో భాగంగానే కరీంనగర్‌లో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు ఆదివారం.. శిబిరం నుంచి ర్యాలీగా.. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ వినోద్ కుమార్ ఇల్లు ముట్టడించారు. కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకోవడంతో అంగన్‌వాడీలు ఆగ్రహించారు. తమ సమస్యలు పరిష్కరించాలని 14 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం చర్చలకు పిలవకుండా కాలయాపన చేస్తున్నదని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య మాట్లాడుతూ.. 14 రోజుల నుంచి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా మంత్రులు, ప్రభుత్వ అధికారులను అడ్డుకుంటామని తెలిపారు. అంగన్‌వాడీలవి గొంతెమ్మ కోరికలు కావని, కొన్నేండ్లుగా ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన సమస్యలే అడుతున్నారని, వెంటనే చర్చలకు పిలిచి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో అంగన్‌వాడీలు మానవహారం నిర్వహించారు. మిర్యాలగూడ మండలంలో ఒంటి కాలుపై నిలబడి దండం పెట్టి నిరసన వ్యక్తం చేశారు. దేవరకొండలో సమ్మె కొనసాగింది. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట బతుకమ్మ ఆడి నిరసన వ్యక్తం చేశారు. రాజాపేట మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు మౌనదీక్ష నిర్వహించారు. వికారాబాద్ జిల్లా మర్పల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు ఆందోళన చేశారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో చేపట్టిన సమ్మెకు కాంగ్రెస్ చౌదరిగూడ మండల అధ్యక్షులు రాజు మద్దతు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల, ఇల్లందులో శిబిరం వద్ద చెవిలో పూలుపెట్టుకొని నిరసన తెలిపారు.

మహిళలపై మీ వైఖరేమిటి ?

- సంఘ్ పరివార్‌ను ప్రశ్నించిన కాంగ్రెస్

జైపూర్ : మహిళల విషయంలో వైఖరిని వెల్లడించాలని కాంగ్రెస్ పార్టీ సంఘ్ పరివార్‌ను ప్రశ్నించింది. లింగ సమానత్వం కోసం స్వాతంత్ర్య సమరయోధులు చేసిన కృషిని గుర్తు చేసింది. బీజేపీలో ఎవరైనా మహిళా సాధికారత కోసం పని చేశారా అని నిలదీసింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే శనివారం జైపూర్‌లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'పురుషులు, మహిళలకు సమాన హక్కులు ఉండాలని గాంధీజీ కలలు కన్నారు. మరి ఆర్ఎస్ఎస్ నేతలు ఎవరైనా లింగ సమానత్వం గురించి మాట్లాడారా? గురు గోల్వాల్కర్ ఈ విషయం చెప్పారా?' అని నిగ్గదీశారు.సరోజినీ నాయుడు 1925లోనే కాంగ్రెస్ అధ్యక్షురాలు అయ్యారని అంటూ గత వంద సంవత్సరాలలో ఆర్ఎస్ఎస్ చరిత్రలో అలా ఎవరైనా ఆ స్థాయికి చేరారా అని ప్రశ్నించారు. సంఘ్ పరివార్ తన సంస్థలో మహిళలకు స్థానం కల్పించదని, కానీ మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్నానని గొప్పలు చెప్పుకుంటుందని ఎద్దేవా చేశారు. రాజ్‌కుమారి అమృత్ కౌర్, సుచేతా కృపలానీ, సరోజినీ నాయుడు, ప్రతిభా పాటిల్, ఇందిరాగాంధీ, మీరాకుమార్ వంటి మహిళా మణులకు 1947 నుండే కాంగ్రెస్ పదవులు కట్టబెట్టిందని గుర్తు చేశారు. సోనియాగాంధీ సుదీర్ఘ కాలం కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షురాలిగా పనిచేశారని చెప్పారు. ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును నూతన పార్లమెంట్ ప్రారంభోత్సవానికి ఆహ్వానించని చరిత్ర సంఘ్ పరివార్‌దేనని ఎత్తిపొడిచారు. 'ద్రౌపది ముర్ము శంకుస్థాపన రాతిని తాకి ఉంటే బీజేపీ వారు దానిని గంగాజలంతో శుద్ధి చేసి ఉండేవారు. వారి దృష్టిలో ఎస్సీ, ఎస్టీలు అంటరానివారు' అని విమర్శించారు. పాత భవనం నుండి నూతన భవనానికి పార్లమెంట్‌ను మార్చిన సందర్భంగా కూడా రాష్ట్రపతిని ఆహ్వానించలేదని ఖర్గే అన్నారు. 'బీజేపీ నేతలను పిలిచారు. సినీ నటీనటులను పిలిచారు. మరి ముర్మును ఎందుకు పిలవలేదు? నేను ఎస్సీ, ఎస్టీలను అడుగుతున్నా. అది అవమానకరం కాదా?' అని ప్రశ్నించారు. ఎన్నికల గిమ్మిక్కుల కోసమే బీజేపీ మహిళలను ఉపయోగించుకుంటుందని విమర్శించారు. వారికి అంతా ఎన్నికల స్టంటేనని అన్నారు. 2029లోగా మహిళా రిజర్వేషన్లను అమలు చేయబోరని, మోడీ అబద్ధం చెబుతున్నారని ఖర్గే విమర్శించారు.ఖర్గేతో పాటు సమావేశంలో ప్రసంగించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ ఈ రోజే మహిళలకు సీట్లు రిజర్వ్ చేయవచ్చునని, కానీ ఆ పని చేయడం బీజేపీకి ఇష్టం లేదని అన్నారు. మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు ఉప కోటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశం పేరును మార్చాలనే ఉద్దేశంతోనే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేశారని, అయితే ప్రజాగ్రహానికి తలవంచి దానిపై వెనక్కి మళ్లారని రాహుల్ చెప్పారు.

చంద్రబాబు కుటుంబాన్ని చంపే కుట్ర

- ఎపి సీఎం జగన్‌పై మోత్కుపల్లి ఫైర్
- ఎన్టీఆర్ ఘాట్‌లో దీక్ష



నవతెలంగాణ-హైదరాబాద్

చంద్రబాబు కుటుంబాన్ని చంపేందుకు ఏపీ సీఎం జగన్ ప్రయత్నిస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత మోత్కుపల్లి నర్సింహులు ఆరోపించారు. ఎఫ్ఐఆర్‌లో పేరు లేని వ్యక్తిని అరెస్ట్ చేయడం రాజ్యాంగ విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు చనిపోతే తనకు ఎదురుండదని జగన్ అనుకుంటున్నారని చెప్పారు. ఇంకోసారి జగన్ వస్తే ఆ రాష్ట్రం రావణకాష్టం అవుతుందని తెలిపారు. నీకు తల్లీ, చెల్లీ , ప్రజలు, ఎస్సీ, ఎస్టీలు అక్కర్లేదని అన్నారు. 15 ఏండ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబును ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్‌ఘాట్ వద్ద మోత్కుపల్లి అన అనుచరులతో కలిసి దీక్ష చేపట్టారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు దీక్ష కొనసాగింది. దీనికి టీడీపీ సీనియర్‌నేత, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఇతర టీడీపీ శ్రేణులు సైతం పాల్గొని సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంటు వ్యవహారంపై 2021లో కేసు నమోదైతే, నాలుగేండ్ల తర్వాత అరెస్టు చేయించిన ఘనత ఏపీ సీఎం జగన్‌దేనని విమర్శించారు. 'జగన్..నిన్ను నీ విధానాలను చూసి ప్రజలు నవ్వుతున్నారు..వచ్చిన అధికారాన్ని కాపాడుకోలేని అసమర్థుడివి..ప్రజలు నిన్ను చీత్కరిస్తున్నారు. నియంతగా పేరుతెచ్చుకున్నావు..చంద్రబాబును అరెస్టు చేసి ఏం ఆనందం పొందారో అర్థం కాలేదు..నారా భువనేశ్వరి ఏడుపు నీకు తగులుతుంది..ఎదుటివారిని ఇబ్బందిపెడితే నీకే నష్టం..రానున్న రోజుల్లో నాలుగు సీట్లు కూడా వైసీపీకి రావు..సొంత చెల్లికి తండ్రి ఆస్తిలో కూడా భాగం ఇవ్వకుండా బయటకు పంపారని' వ్యాఖ్యానించారు. సొంత బాబాయ్‌ని చంపిన నేరస్థుడిని పట్టుకోలేని జగన్ ఎలాంటి నాయకుడు ? నేను జగన్‌కు వ్యతిరేకం కాదు..ఆయన దుర్మార్గానికి వ్యతిరేకమని చెప్పారు. దీక్షలో సోమిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టు సందర్భంగా ఏపీలో చోటుచేసుకున్న పరిణామాలను వివరించారు. ఈ దీక్షలో మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన, సీనియర్ నేత పరిగి చంద్రయ్య, అశోక్‌గౌడ్, శ్రీనివాస్‌కుమార్, సాయిబాబా, మహేందర్, గోపాల్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'కేసీఆర్‌ను నమ్మి మోసపోయా'

ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును నమ్మి మోసపోయానంటూ మోత్కుపల్లి నర్సింహులు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్టీఆర్ ఘాట్ దగ్గర మీడియాతో మాట్లాడుతూ కేసీఆరే నన్ను పిలిచారనీ, ఆయనే దూరం పెట్టారని అభిప్రాయపడ్డారు. ఆరు నెలలుగా అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా నన్ను అవమానించారని విమర్శించారు. ఎన్టీఆర్, చంద్రబాబు దగ్గరకే సులభంగా వెళ్లగలిగానని గుర్తుచేశారు. కేసీఆర్ మాత్రం సమయం ఇవ్వడం లేదన్నారు. దళితుడు ఇంట్లోకి వస్తే ఆవు మూత్రంలో శుభ్రం చేసుకునే రకం కేసీఆర్ అని ఆరోపించారు. చంద్రబాబు అరెస్టుపై స్పందించాలని కోరారు. లేకపోతే బీఆర్ఎస్‌కే నష్టమని హితవు పలికారు. నా మద్దతు లేకుండా నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్, ఒక్కసీటు కూడా గెలవలేదని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాదని అన్నారు. రేవంత్‌రెడ్డి వల్లే తెలంగాణలో కాంగ్రెస్ బలపడిందన్నారు. 30 నియోజకవర్గాల్లో ఏపీ సెటిలర్లు గెలుపోటములను ప్రభావితం చేస్తారని చెప్పారు. రేవంత్‌రెడ్డి నాకు తమ్ముడనీ, ఆయనతో నాకు శత్రుత్వం లేదని చెప్పారు.

మీసేవా ఉద్యోగులపై వేధింపులు ఆపాలి

- వేతనాలపెంపు, ఉద్యోగ భద్రత కోసం పోరాడండి : తెలంగాణ మీసేవా ఎంప్లాయిస్ యూనియన్ సదస్సులో జె.వెంకటేశ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో 100 మీసేవా కేంద్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగులపై ఈఎస్‌డీ అధికారులు వేధింపులు సరిగాదనీ, వాటిని వెంటనే ఆపాలని తెలంగాణ మీసేవా ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) గౌరవాధ్యక్షులు జె.వెంకటేశ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆ యూనియన్ రాష్ట్ర స్థాయి సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ..మీసేవా ఉద్యోగులకు మూడేండ్ల నుంచి వేతనాలు పెంచకుండా శ్రమదోపిడీకి గురిచేస్తున్నారన్నారు. 20 ఏండ్లకుపైగా సర్వీసులో ఉన్నప్పటికీ పర్మినెంట్ చేయకపోవడం అన్యాయమని చెప్పారు. మీసేవా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సదస్సులో జెనీమా, సురేశ్, లక్ష్మి, కవిత, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

34 స్థానాలు బడుగులకు కేటాయించాలి

- రాహుల్, సోనియాలను కలుస్తాం :మధుయాష్కీ గౌడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గతంలో టీపీసీసీ చెప్పినట్టుగానే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 34 స్థానాలను బడుగులకు కేటాయించాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్ మధుయాష్కి కోరారు. ఆదివారం తెలంగాణ కాంగ్రెస్ ఒబీసీ నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మధుయాష్కి మాట్లాడుతూ ఈ విషయంపై ఏఐసీసీ అధ్యక్షులు ఖర్గే, పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియాగాంధీలతో పాటు టీపీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలను కలువనున్నట్టు తెలిపారు. పార్టీ బలోపేతం కావడంలో బహుజనుల పాత్ర ఉందని ఆయన గుర్తుచేశారు. సామాజిక సమీకరణలు పాటించినప్పుడే పార్టీ బలపడుతుందని స్పష్టం చేశారు.

మహిళా బిల్లు ఆమోద సమయంలో

66 మంది బీజేపీ ఎంపీలెందుకు లేరు?

-కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందే సమయంలో బీజేపీకి చెందిన 66 మంది ఎంపీలు ఎందుకు లేరో చెప్పాలని కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్ల మెంటు సమావేశాలకు వస్తున్న తాము ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయినందువల్లే పార్లమెంటులో లేమని స్పష్టం చేశారు. చిల్లర రాజకీయాలు మానుకోవాలని కిషన్ రెడ్డికి హితవు పలికారు.

గుజరాత్‌లో మళ్లీ కూలిన వంతెన...

- నదిలో పడ్డ వాహనాలు ... నలుగురు గల్లంతు



గాంధీనగర్ :. ప్రధాని మోడీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో వంతెనలు కూలిపోతున్నాయి. గతేడాది మోర్బీ ప్రాంతంలో తీగల వంతెన కూలి వంద మందికి పైగా సందర్శకులు చనిపోయిన విషయం విదితమే. తాజాగా గుజరాత్‌లోని సురేంద్రనగర్ జిల్లాలో ఆదివారం ఘోర ప్రమాదం జరిగింది. సమాచారం ప్రకారం, సురేంద్రనగర్ జిల్లా వస్తాడి గ్రామ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఇక్కడ జాతీయ రహదారిని చరకు కలుపుతూ వంతెనను నిర్మించారు.ఈ వంతెనపై వాహనాలు వెళుతుండగా ప్రమాదం జరిగింది. వంతెన అమాంతంగా పేకమేడలా కూలిపోయింది. ట్రక్కులతో సహా పలు వాహనాలు నదిలో పడిపోయాయి. ఆ వాహనాల్లో ఉన్న పదిమంది కూడా మునిగిపోయారు, వారిలో ఆరుగురిని కాపాడారు. గల్లంతైన వారి కోసం రెస్క్యూ టీములు గాలిస్తున్నాయి.

చంద్రబాబుకు మద్దతుగా నేడు

- టీడీపీ శ్రేణుల మౌన ప్రదర్శన

నవతెలంగాణ-హైదరాబాద్

చంద్రబాబుకు మద్దతుగా హైదరాబాద్‌లో మౌన ప్రదర్శన నిర్వహించాలని తెలుగుదేశం రాష్ట్ర శాఖ నిర్ణయించింది. ఈమేరకు ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు సోమవారం ఉదయం 10 గంటలకు ట్యాంక్‌బండ్ వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి ఎన్టీఆర్ ఘాట్ వరకు ర్యాలీలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్‌తోపాటు పొలిట్‌బ్యూరో సభ్యులు, కేంద్ర, రాష్ట్ర కమిటీల నాయకులు హాజరుకానున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి...

- నేటి నుంచి విధుల బహిష్కరణ, నిరవధిక సమ్మె : తెలంగాణ ఆల్ యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ



నవతెలంగాణ-కేయూ క్యాంపస్

యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని నేటి నుంచి విధుల బహిష్కరణ, నిరవధిక సమ్మెకు ఆల్ యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ పిలుపునిచ్చింది. ఆదివారం యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులతో కేయూలో జరిగిన సమావేశంలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ చైర్మెన్ డాక్టర్ శ్రీధర్ కుమార్ లోధ్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న 1445మంది కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. 143 రోజుల నుంచి విశ్వవిద్యాలయాల్లో అనేక విధాలుగా సదస్సులు, రౌండ్ టేబుల్, రిలే నిరాహార దీక్షలు చేపట్టామని తెలిపారు. గతంలో అనేకసార్లు యూనివర్సిటీ అధికారులను, ప్రభుత్వ అధికారులను, విద్యాశాఖ మంత్రిని, ఉన్నత విద్యామండలి చైర్మెన్‌ను కూడా కలిసినట్టు చెప్పారు. అయినా నేటి వరకు సమస్య పరిష్కరించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో నేటి నుంచి 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు అందరూ తమ విధుల్ని బహిష్కరించి నిరవధిక సమ్మెకు వెళ్తున్నారని తెలిపారు. డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను ఏ విధంగా అయితే రెగ్యులరైజ్ చేశారో అదేవిధంగా యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని కోరారు. నిరవధిక సమ్మెలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ నాయకులు డాక్టర్ మధుకర్‌రావు, డాక్టర్ జరుపుల చందులాల్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సంగీత్ కుమార్, డాక్టర్ జి.రమేష్, డాక్టర్ రఘు వర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నలభైవేల మంది కంటే ఎక్కువ మంది మహిళలు ప్రవాస భారతీయులను (ఎన్‌ఆర్‌ఐ) వివాహం చేసుకుని మోసపోయారు. అలాంటి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేస్తుంది. తనలా మరెవరూ ఇబ్బందులు పడకూడదనుకుంది. తాను మోసపోయినట్టు మరో మహిళ మోసపోకూడదని నిర్ణయించుకుంది. అందుకే ఓ సంస్థను స్థాపించింది. బాధిత మహిళలకు న్యాయ సలహాలు అందిస్తూ వారికి అవసరమైన సహాయం చేస్తుంది. ఆమే లూథియానాకు చెందిన సత్వీందర్ కౌర్.

మీ హక్కు కోసం పోరాడండి

ప్రీతమ్ కౌర్‌కి పెండ్లయినపుడు వయసు 18 ఏండ్లు. వివాహం జరిగిన కొద్దికాలానికే భర్త కెనడాకు వెళ్లాడు. త్వరలోనే ఆమెను కూడా ఆ దేశానికి తీసుకెళతానని మాట ఇచ్చాడు. అక్కడ కొత్త జీవితాన్ని ప్రారంభించ వచ్చని హామీ ఇచ్చాడు. ఆమె చాలా ఆశగా ఎదురు చూసింది. కానీ పరిస్థితులు చాలా త్వరగా మారిపోయాయి. తన భర్తకు కెనడాలో మరో కుటుంబం ఉందని ప్రీతమ్ తెలుసుకుంది. దాంతో ఆమె లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ద్వారా సహాయం కోసం వెళ్ళింది. అయితే తన భర్తకు వ్యతిరేకంగా ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఎఫ్ఐఆర్) దాఖలు చేయలేకపోయింది. ఎందుకంటే ఆమె వారి వివాహానికి సంబంధించిన డాక్యుమెంటేషన్‌ను అందించలేకపోయింది. అందుకే ఆమెకు న్యాయం జరగలేదు. ఆస్ట్రేలియా, జర్మనీ, కెనడా వంటి దేశాల్లో నివసిస్తున్న నాన్-రెసిడెంట్ భారతీయులను (ఎన్‌ఆర్‌ఐలను) వివాహం చేసుకుని మోసపోతున్న వేలాది మంది భారతీయ మహిళల్లో ప్రీతమ్ ఒకరు.

నివేదిక ప్రకారం

ది ఫుల్లర్ ప్రాజెక్ట్ నివేదిక ప్రకారం భారతదేశంలో 40,000 కంటే ఎక్కువ మంది మహిళలు నాన్-రెసిడెంట్ ఇండియన్స్ (ఎన్‌ఆర్‌ఐలను) పెండ్లి చేసుకుని మోసగించబడ్డారు. అబ్ నహీ వెల్ఫేర్ సొసైటీని నడుపుతున్న 41 ఏండ్ల లూథియానా నివాసి అయిన సత్వీందర్ కౌర్ వద్దకు సహాయం కోసం ప్రీతమ్ కౌర్ వంటి చాలా మంది మహిళలు వస్తుంటారు. వారికి న్యాయం జరిగేలా ఈ ఎన్‌జీఓ సహాయం చేస్తోంది.

అబ్ నహీ వెల్ఫేర్ సొసైటీ

"నేను నా జీవితంలో ఇలాంటి సంఘటనను ఎదుర్కొన్నాను. అలాంటి మహిళల బాధను నేను అర్థం చేసుకున్నాను. అబ్ నహీ వెల్ఫేర్ సొసైటీ ద్వారా ఈ మహిళలకు న్యాయం చేయడంలో సహాయం చేస్తూ, అలాంటి కేసుల సంఖ్యను తగ్గించాలనుకుంటున్నాను" అని ఆమె అంటున్నారు. సత్వీందర్ కౌర్ లూథియానాలో స్కూల్ టీచర్‌గా పని చేసేటపుడు తన సహ ఉపాధ్యాయుడిని వివాహం చేసుకుంది. వివాహం అయిన కొన్నేండ్ల తర్వాత భర్త ఉక్రెయిన్‌కు వెళ్లి కొన్ని రోజుల తర్వాత ఆమెను కూడా తీసుకువెళతానని చెప్పాడు. అతని రాక కోసం ఎదురు చూస్తూ ఆమె తన తల్లిదండ్రులతో ఉండేది. ఐదేండ్ల తర్వాత అతను భారతదేశానికి తిరిగి వచ్చాడు. సత్వీందర్ గతాన్ని మరచిపోయి అతనితో కలిసి జీవించాలని నిర్ణయించుకుంది. అయితే ఆమె భర్తకు వేరే ప్లాన్‌లు ఉన్నాయి. అందుకే అతను సత్వీందర్‌ను అద్దె ఇంటికి మార్చాడు. త్వరలోనే ఇద్దరం విదేశాలకు వెళదాం అని చెప్పాడు. అయితే అతను ఆమె నుండి విడాకులు తీసుకునే ప్రయత్నంలో ఉన్నాడు.

బరువెక్కిన హృదయంతో

న్యాయ నిపుణుల సలహా తీసుకుని ఆమె అతని ప్రతిపాదనను వ్యతిరేకించింది. తాను ఉంటున్న ఇంటికి అద్దె చెల్లించాలని ఆమె అడిగింది. కానీ అతను నిరాకరించాడు. 'ఇకనుండి నీతో నాకు సంబంధం లేదు. ఇక నీ జీవితంలో నీకు ఏది కావాలంటే అది చేసుకోవచ్చు' అని ఆమెకు చెప్పాడు. సత్వీందర్ నిరుత్సాహానికి గురయింది. 'మోసపోయానని తెలుసుకోవడానికి నా జీవితంలో చాలా ఏండ్లు వృథా చేసుకున్నాను' అని ఆమె బరువెక్కిన హృదయంతో పంచుకుంది. అప్పటి నుండి ఎన్.ఆర్.ఐ భర్తలచే మోసపోయిన మహిళలకు చేయూతనిస్తూ, వారికి న్యాయం చేయడం తన జీవిత లక్ష్యంగా పెట్టుకుంది. ఇదే 2016లో అబ్ నహీ సంక్షేమ సంఘ స్థాపనకు దారితీసింది.





ప్రారంభ రోజుల్లో

కౌర్ అబ్ నహీ వెల్ఫేర్ సొసైటీ ప్రారంభించినప్పుడు ఆమెకు తగినంత మద్దతు లేదు. తర్వాత కాలంలో చాలా మంది మహిళలు సంస్థలో చేరారు. ప్రస్తుతం ఈ సంస్థ పంజాబ్, యుపి, గుజరాత్‌కు చెందిన 900 మందికి పైగా మహిళలకు సహాయం అందించింది. సంస్థ ఇప్పుడు ఇలాంటి కేసులను ఎదుర్కొంటున్న పురుషులకు కూడా తన సేవలను అందిస్తుంది. ఇప్పటివరకు సంస్థ 100 మంది పురుషులకు సహాయం చేసింది. బాధితురాలు సంస్థని సంప్రదించినప్పుడు వారి వివాహ సర్టిఫికేట్, అమ్మాయి గుర్తింపు కార్డు ద్వారా ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఆ తర్వాత సమస్య ఎక్కడ ఉందో అర్థం చేసుకోవడానికి వారు ఇరువైపుల వారికి కౌన్సెలింగ్ ఇస్తారు. బృందం వారి ఇంటికి కూడా వెళుతుంది. దాంతో ఈ మొత్తం ప్రక్రియకు ఒక నెల పడుతుంది.

చెప్పినంత సులభం కాదు


"కొన్నిసార్లు సమస్య సులభంగా పరిష్కరించబడుతుంది. కొన్ని సమయాల్లో అత్యంత కష్టంగా ఉంటుంది' అని ఆమె అంటున్నారు. పురుషులు విడిపోవడానికి గట్టిగా నిర్ణయించుకున్నపుడు ఆమె జీవితాన్ని తిరిగి ట్రాక్‌లోకి తీసుకురావడానికి బాధితులు విడాకులు, సెటిల్‌మెంట్ పొందడానికి సంస్థ వారికి సహాయం చేస్తుంది. విదేశాల్లో నివసిస్తున్న వ్యక్తిపై పోలీసు ఫిర్యాదు నమోదైన తర్వాత వారి పి.ఆర్‌లు రద్దు చేయబడటంతో పాటు వారి పాస్‌పోర్ట్‌లను స్వాధీనం చేసుకుంటారు. 'కానీ ఫిర్యాదులు అంత సమర్థవంతంగా దాఖలు కావు. కాబట్టి న్యాయం అనేది మాటల్లో చెప్పుకున్నంత సులభం కాదు. పైగా చట్టపరమైన ప్రక్రియలకు చాలా సమయం పడుతుంది' అని ఆమె అంటున్నారు.

సహాయం అందితే...

బాధిత కుటుంబం ఆర్థికంగా స్థిరంగా ఉన్నట్లయితే న్యాయపరమైన రుసుములను వారే చూసుకుంటారు. ఫీజులను భరించలేని పరిస్థితుల్లో ఉంటే ఎన్‌జీఓ తక్కువ రుసుముతో సహాయం లేదా చట్టపరమైన ప్రాతినిధ్యాన్ని పొందేందుకు న్యాయ నిపుణులతో సహకరిస్తుంది. ఇప్పటివరకు సత్వీందర్‌కి ఇది అంత తేలికైన ప్రయాణం కాదు. ఆర్థిక నిర్వహణ ఒక సవాలుగా కొనసాగుతోంది. "నాకు ఒక బృందం ఉంది. కానీ వారికి చెల్లించడానికి నా దగ్గర డబ్బు లేదు. అందుకే మా లక్ష్యంతో సహవాసం చేయాలనుకునే వారు మాతో చేరతారు' ఆమె చెప్పారు. ఏది ఏమైనప్పటికీ బాధితులకు అవసరమైన సహాయం చివరికి నెరవేరుతుందని సత్వీందర్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. "అన్యాయం, ద్రోహం ఎలా ఉంటుందో నాకు తెలుసు. అలాంటి కేసులు జరగకుండా ఆపడానికి నేను కృషి చేయాలనుకుంటున్నాను. త్వరలోనే మాకు కొంత సహాయం అందుతుందని నేను ఆశిస్తున్నాను. తద్వారా మేము మా పనిని నిర్విరామంగా కొనసాగించ గలము' అంటూ ఆమె తన మాటలు ముగించారు.

- సలీమ

గుడ్లులోని తెల్ల సొనను ఒక గిన్నెలోకి తీసుకుని అందులో ఒక చెంచాడు పంచదార, అర చెంచా మొక్కజొన్న పిండి కలిపి పేస్ట్‌లా చేసుకుని ముఖంపై రాసుకోవాలి. పూర్తిగా ఆరాక మాస్క్‌లా మారుతుంది. మెల్లిగా ఆ మాస్క్‌ను ముఖం మీద నుంచి తీసేస్తే అవాంఛిత రోమాలు కూడా తొలగిపోతాయి.



ఉచిత వైద్యంలో కేరళ అగ్రస్థానం

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న లబ్దిదారులకు ప్రత్యేక సేవలు అందించినందుకుగానూ రాష్ట్రానికి "ఉత్తమ కార్యకలాపాలు" విభాగంలో అవార్డు లభించింది. కేరళ ఈ అవార్డును గెలుచుకోవడం వరుసగా ఇది మూడోసారి.

రూ.3,200 కోట్లకుపైగా ఉచిత వైద్య చికిత్సలు

ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పేద రోగులకు వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి, కార్యక్రమాలకు కూడా ఈ అవార్డు దక్కిందని ఆరోగ్య మంత్రి వీణా జార్జ్ అన్నారు. రాష్ట్రంలో గత రెండేండ్లలో సీఏఎస్‌పీ సహా వివిధ పథకాల ద్వారా రూ.3,200 కోట్లకు పైగా ఉచిత వైద్య చికిత్సలు అందించామని తెలిపారు. గత రెండేళ్లలో దాదాపు 13 లక్షల మంది లబ్దిదారులు సీఏఎస్‌పీ పథకం కింద చికిత్స పొందారని పేర్కొన్నారు. ఈ అంశంలో గతేడాది కేంద్ర వాటాగా రాష్ట్రానికి రూ.151 కోట్లు మాత్రమే వచ్చాయని తెలిపారు.

ఎల్‌డీఎఫ్ హయాంలోనే... దృష్టిలోపం ఉన్న వారి కోసం ప్రత్యేక సేవలు

ఎల్‌డీఎఫ్ ప్రభుత్వ హయాంలోనే దృష్టి లోపం ఉన్న లబ్దిదారుల కోసం ప్రత్యేక సేవలను ప్రారంభించారు. ఇందుకోసం వారి చికిత్స కార్డు బ్రెయిలీలో సెట్ చేశారు. దీనిని పరిగణనలోకి తీసుకుని రాష్ట్రానికి ప్రత్యేక అవార్డు లభించింది. ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలోని స్టేట్ హెల్త్ ఏజెన్సీ ద్వారా రాష్ట్రంలో ఈ పథకం అమలు చేయబడుతుంది. ప్రభుత్వ ప్రయివేట్ రంగాలలోని 613 ఎంప్యానెల్డ్ ఆస్పత్రుల నుంచి లబ్దిదారులకు ఉచిత వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి.

బ్రిజ్ భూషణ్ వేధింపులు నిజమే

(మొదటిపేజీ తరువాయి)

బలవంతంగా కౌగిలించుకున్నాడని చెప్పారు. నిరసన వ్యక్తం చేయగా.. తండ్రిలా చేశానని అన్నాడన్నారు. నిందితుడికి తన చర్యలపై పూర్తి అవగాహన ఉందని ఈ ఘటన స్పష్టంగా తెలియజేస్తోందని పోలీసులు తెలిపారు. బాధితురాలు స్పందించిందా లేదా అన్నది ప్రశ్న కాదని, ఆమెకు అన్యాయం జరిగిందని చెప్పారు. ఢిల్లీ పోలీసుల తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అతుల్ శ్రీవాస్తవ వాదనలు వినిపించారు. భారతదేశం వెలుపల జరిగిన కేసులకు సీఆర్‌పీసీ సెక్షన్ 188 ప్రకారం అనుమతి అవసరమన్న బ్రిజ్‌భూషణ్ తరఫు న్యాయవాది వాదనను అతుల్ ఖండించారు. నేరాలన్నీ దేశం బయట జరిగితేనే సీఆర్‌పీసీ సెక్షన్ 188 ప్రకారం అనుమతి అవసరమని అతుల్ పేర్కొన్నారు. బ్రిజ్ భూషణ్ విషయంలో ఢిల్లీతోపాటు ఇతర ప్రాంతాల్లోనూ నేరాలు జరిగాయని, దీంతో అనుమతి అవసరం లేదని అతుల్ తెలిపారు. బ్రిజ్‌భూషణ్‌పై అభియోగాలు మోపేందుకు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ) కింద రాతపూర్వక ఫిర్యాదు, సెక్షన్ 161 (సాక్షుల విచారణ), 164 (మేజిస్ట్రేట్ ముందు నమోదు చేసిన వాంగ్మూలాలు).. సరిపోతాయని పేర్కొన్నారు. గుజరాత్‌లోని సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసును ప్రస్తావిస్తూ.. ఆ కేసులో విడివిడిగా అనేక ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని, కోర్టు వాటన్నింటినీ ఒకేచోట విచారించిందని గుర్తుచేశారు.

బ్రిజ్ భూషణ్ తమను లైంగికంగా వేధించాడని పలువురు మహిళా రెజర్లు నెలల తరబడి ఢిల్లీలో ఆందోళన చేసినా పట్టించుకోకపోగా, వేధించారు. సుప్రీం కోర్టు బ్రిజ్‌భూషణ్‌పై కేసు నమోదు చేయాలని ఆదేశించడం, ప్రపంచవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వచ్చిన నేపథ్యంలో... ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టడం గమనార్హం.

బీజేపీ నేతల రహస్య భేటీ

(మొదటిపేజీ తరువాయి)

ఇస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. 'వెంటనే అధ్యక్ష పదవి నుంచి కిషన్‌రెడ్డిని తొలగించి బండి సంజయ్‌ని నియమించండి. పార్టీ అంతా ఆగమాగమవుతున్నది. ఈ విషయాన్ని దయచేసి హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లండి' అంటున్నారని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలోని నేతలు చెవులు కొరుక్కుంటున్నారు. కిషన్‌రెడ్డికి వ్యతిరేకంగా ఓ గ్రూపు తయారై ఇదంతా చేయిస్తుందనే ప్రచారమూ ఆ పార్టీలో ఉంది.

జీతాల్లేవ్

(మొదటిపేజీ తరువాయి)

చాలా మంది ఉద్యోగులు ఇప్పటికే తమ ప్రావిడెంట్ ఫండ్(పీఎఫ్)లో ఎక్కువ భాగాన్ని విత్ డ్రా చేసుకున్నారు. కొందరు బయట అప్పులను కూడా చేశారు. చివరికి దినసరి కూలీలుగా మారి కుటుంబాలను పోషించుకుంటున్నారు.

పదేండ్ల క్రితం హెచ్‌ఈసీకి మోడీ

2013 డిసెంబర్‌లో ప్రధాని మోడీ అప్పటి ఎన్నికల ర్యాలీలో ప్రసంగించడానికి రాంచీని సందర్శించారు. ఆ సమయంలో హెచ్‌ఈసీపరిస్థితిపై తన నిరాశను వ్యక్తం చేశాడు. కేంద్రంలో మోడీ సర్కారు వచ్చి పదేండ్లు గడుస్తున్నా.. హెచ్‌ఈసీ మూతపడే దశలో ఉన్నదని కొందరు ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

'కేంద్రం బాధ్యత వహించాలి'

"అత్యున్నత యాజమాన్యం నిజాయితీగా పని చేస్తే మా కార్మికులు వేతనాల సమస్యను ఎదుర్కొనేవారు కాదు. కేంద్రం దీనికి బాధ్యత వహించాలి. వీలైనంత త్వరగా డబ్బు విడుదల చేయాలి" అనిహెచ్‌ఈసీ వర్కర్స్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి రామశంకర ప్రసాద్ ఆరోపించారు. హెచ్ఎంటీపీ ఇన్‌స్పెక్టర్ (క్వాలిటీ కంట్రోల్) కమలేష్ శర్మ మాట్లాడుతూ.. "2010లో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం హెచ్‌ఈసీని సందర్శించారు. భారత్‌కు అలాంటి సంస్థ అవసరమని నొక్కిచెప్పారు. అయితే, కేంద్రంలో ప్రస్తుత ప్రభుత్వం మాత్రం గుడ్డిగా మారింది" అని చెప్పారు.

ఆటో డ్రైవర్‌గా ఉమేశ్ నాయక్

ఉమేష్ నాయక్ అనే మరో ఉద్యోగి ఆటోరిక్షా డ్రైవర్‌గా పార్ట్‌టైమ్ పనిచేస్తున్నాడు. "నా కుటుంబాన్ని పోషించుకోవటానికి సాయంత్రం 5 గంటల తర్వాత నేను ఆటో నడుపుతాను. ఒక నెలలో, నేను రూ. 10,000 నుండి రూ. 12,000 వరకు సంపాదించగలను. ఇలా నేనొక్కడినే కాదు.. వారి కుటుంబాలను పోషించుకోవటానికి పార్ట్ టైమ్ ఉద్యోగాల్లో ఉన్న అనేక మంది హెచ్‌ఈసీ ఉద్యోగులు ఉన్నారు. కొందరు కూరగాయలు విక్రయిస్తుంటారు. మరికొందరు వీధి పక్కన చిరుతిండి, ఇతర తినుబండారాలను కూడా అమ్ముతున్నారు. చాలా రోజుల నుంచి మాకు జీతం రాకపోవడంతో మాకు ఓపిక నశిస్తున్నది" అని నాయక్ చెప్పారు.



మహిళలు మోడీకి అండగా ఉండాలి: కిషన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం పొందేలా చేసిన ప్రధాని మోడీకి రాష్ట్ర మహిళలు అండగా ఉండాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి కోరారు. ఆదివారం బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని అమరవీరుల స్థూపం నుంచి బీజేపీ రాష్ట్ర కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లును ఎంఐఎం పార్టీ ఒక్కటే వ్యతిరేకించిందని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్‌కు ఓవైసీ గురువు అనీ, ఆ గురువు చెప్పినట్టే కేసీఆర్ వింటారని తెలిపారు.

కాంగ్రెస్ పాలనలో మహిళలు వెనుకబడ్డారని విమర్శించారు. బీజేపీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్, మహిళా నాయకురాలు జయసుధ మోడీకి ధన్యవాదాలు తెలిపారు.

ప్రగ్యాన్.. విక్రమ్ సిగ్నల్స్ కట్!

(మొదటిపేజీ తరువాయి)

ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జులై 14న శ్రీహరికోట నుంచి చంద్రయాన్-3 ప్రయోగం చేపట్టగా.. 40 రోజుల ప్రయాణం తర్వాత విక్రమ్ ల్యాండర్ ఆగస్టు 23న చంద్రుడి దక్షిణ ధ్రువానికి చేరువగా, సురక్షితంగా ల్యాండై ఈ ఘనత సాధించిన తొలి దేశంగా భారత్ నిలిచిన విషయం విదితమే.

రుణమాఫీ.. లేదు సాఫీ

(మొదటిపేజీ తరువాయి)

కారణంగా చూపి మాఫీ అమలును నత్తనడకన కొనసాగిస్తోంది. 2018 డిసెంబర్ 12లోపు తీసుకున్న పంట రుణాలను మూడు నెలల్లో మాఫీ చేస్తామన్న ప్రభుత్వం 2020 మే నెలలో రూ.25వేల లోపు, 2021 డిసెంబర్ నాటికి రూ.50వేలు కొంతమందికి చేసింది. ఎన్నికలు సమీపిస్తుండటంతో రూ.లక్షలోపు రుణమాఫీని ప్రకటించింది. ఇప్పటికే ప్రభుత్వం పెట్టిన గడువు ముగిసినా ఇంకా సగం మందికి రూ.లక్ష రుణమాఫీ అమలుకాలేదు.

మాట మార్చిన ప్రభుత్వం.. రైతుకు బదులు కుటుంబానికి..

ఎన్నికల్లో ఒక్కో రైతుకు రూ.లక్ష లోపు రుణమాఫీ అని ప్రకటించిన ప్రభుత్వం ఆచరణకు వచ్చే సరికి కుటుంబానికి రూ.లక్షగా మార్చడంతో రైతు కుటుంబాల గుర్తింపు ప్రక్రియ ఆలస్యమవుతోంది. రుణమాఫీ 2014 ప్రక్రియను మండలస్థాయి కమిటీ క్షేత్రస్థాయిలో విచారణ చేసింది. ఈ కమిటీలో బ్యాంకర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఏవోలు ఉన్నారు. కానీ ఈసారి సాఫ్ట్‌వేర్ ఆధారంగా మాఫీ ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. బ్యాంకులు, సహకార సంఘాల్లో పంట రుణాలు తీసుకున్న రైతుల వివరాలను 2019లోనే తీసుకున్న ప్రభుత్వం దాన్ని రుణమాఫీ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేసింది. రేషన్, ఆధార్‌కార్డుల అనుసంధానం పూర్తయింది. ప్రభుత్వం దగ్గర సమగ్ర కుటుంబ సర్వే డేటా ఉండటంతో వీటి ఆధారంగా రైతు కుటుంబాలను గుర్తించారు. రైతు కుటుంబాల్లో ఎక్కువ రుణం ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తూ రూ.లక్ష రుణమాఫీ చేయాల్సి ఉంటుంది. కానీ కుటుంబ గుర్తింపు ఇంకా పూర్తి కాలేదు. రుణమాఫీ సైట్‌లో రైతు ఆధార్ నంబర్‌ను ఎంటర్ చేస్తే రిమార్క్ కాలంలో 'నో ఫ్యామిలీ గ్రూపింగ్' అని వస్తుంది. ఇలాంటివి ఒక్క కారేపల్లి మండలంలోనే 200 వరకు ఉన్నాయి.

అక్షరం మారినా ఆగినట్టే..!

ఒక రైతు రెండు బ్యాంకుల్లో రుణాలు తీసుకుంటే రెండింటిలోనూ పేరు ఒకేలా ఉండాలి. అక్షరం తేడా ఉన్నా మాఫీ నిలిచిపోతుంది. రుణమాఫీ సైట్ రిమార్క్ కాలంలో 'సేమ్ ఆధార్‌కార్డు నెంబర్ ఫర్ డిఫరెంట్ పర్సన్స్' అని చూపుతుంది. ఉదాహరణకు కారేపల్లి మండలంలో ఇమ్మడి సూరమ్మకు సొసైటీ, ఎస్‌బీఐ మాధారం బ్రాంచీల్లో లోన్ ఉంది. ఆమె పేరుకు సొసైటీలో ఇంగ్లీష్‌లో ఈని ఉపయోగించారు. మాధారం బ్రాంచిలో ఐ రాశారు. అంతే సూరమ్మకు మాఫీ కాలేదు. ఇలాంటివి కారేపల్లి, ముదిగొండ, కూసుమంచి మండలంలో ఎక్కువగా చోటుచేసుకున్నాయి. కారేపల్లిలోనే 750కి పైగా ఉన్నాయి. లోన్ అకౌంట్ నంబర్లలో అక్షరాలున్నా కూడా ఇదే పరిస్థితి. అంకెలతో పాటు ఇంగ్లీష్ అక్షరాలతో నెంబర్లు ఇచ్చినా రుణమాఫీ కావట్లేదు. రూ.25వేలు, రూ.50వేలలోపు ఎలాంటి సమస్య లేకుండా మాఫీ అయినప్పుడు ఇప్పుడు మాత్రమే ఇదేంటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. వంట పెట్టుబడులకు బంగారం తాకట్టు పెట్టి రుణం తీసుకున్నా మాఫీ వర్తింపజేస్తామన్న ప్రభుత్వం ఆ ఊసే మరిచింది.

రుణమాఫీ వచ్చినా జమకాని పైకం..

కమర్షియల్ బ్యాంకులు ఎస్‌బీఐ, ఏపీజీవీబీ, యూనియన్ బ్యాంకుల్లో రైతుల రుణాలు మాఫీ అయినా పైకం వారి ఖాతాలో జమకాకుండా ఆర్‌బీఐకి వెళ్లాయి. ఓ రైతు 2018 డిసెంబర్ 12లోపు రుణం తీసుకుని ఐదేండ్లలో ఆ రుణం పూర్తిగా చెల్లించి మళ్లీ రుణం తీసుకుంటే లోన్ అకౌంట్ నంబర్ మారుతుంది. పాత లోన్ నంబర్‌తో వచ్చిన మాఫీ పైకం వెనక్కు వెళ్లిపోతుంది. ఇలాంటి ఖాతాలు కమర్షియల్ బ్యాంకుల్లో అధికంగా ఉన్నాయి. ఇలా రకరకాల కారణాలతో రుణమాఫీ మెజార్టీ రైతులకు అందకుండా పోతుంది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారుల ద్వారా విచారణ చేపించి అర్హతున్న రైతులందరికీ రుణమాఫీ అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. మరోవైపు ఎన్నికల నోటిఫికేషన్ సమయం కూడా ఆసన్నమవుతుండటంతో ఇంకా మాఫీ కాని రైతుల్లో ఆందోళన నెలకొంది.

చంద్రబాబు రిమాండ్ పొడిగింపు

(మొదటిపేజీ తరువాయి)

ఏమైనా ఇబ్బంది పెట్టారా? థర్డ్ డిగ్రీ ప్రయోగించారా? ఏమైనా అసౌకర్యం కలిగిందా? వైద్య పరీక్షలు చేయించారా? అని ఏసీబీ కోర్టు న్యాయమూర్తి.. చంద్రబాబును ప్రశ్నించారు. విచారణలో అధికారులు ఇబ్బంది పెట్టలేదని చంద్రబాబు జడ్జితో అన్నారు. విచారణ అనంతరం చంద్రబాబు రిమాండ్‌ను పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

కాచిగూడ - యశ్వంత్‌పూర్‌కు వందేభారత్

(మొదటిపేజీ తరువాయి)

యశ్వంత్‌పూర్(20704) నుంచి, 26న కాచిగూడ నుంచి ప్రారంభమవుతాయి. బుధవారం మినహా వారంలో అన్ని రోజులు అందుబాటులో ఉంటుంది. కాచిగూడ నుంచి యశ్వంత్‌పూర్ (20703) వందేభారత్ రైలు ఉదయం 05:30 గంటలకు కాచిగూడ నుంచి ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం 2 గంటలకు యశ్వంత్‌పూర్ (బెంగళూరు) జంక్షన్ చేరుకుంటుంది. మధ్యలో మహబూబ్‌నగర్ (6.49), కర్నూలు సిటీ (8.24), అనంతపురం (10.44), ధర్మవరం జంక్షన్ (11.14) స్టేషన్లలో ఆగుతుంది. 610 కిలోమీటర్ల దూరానికి 8.30 గంటల ప్రయాణం ఉంటుంది. సూపర్‌ఫాస్ట్ సర్వీసులతో పోల్చుకుంటే దాదాపు 3గంటల ప్రయాణ సమయం ఆదాఅవుతుందని రైల్వే అధికారులు తెలిపారు. కాచిగూడ నుంచి యశ్వంత్‌పూర్‌కు ఛైర్‌కార్ టికెట్ ధర రూ.1600గా రైల్వే శాఖ నిర్ణయించింది. ఎగ్జిక్యూటివ్ ఛైర్‌కార్ ధర రూ.2915గా నిర్ణయించారు. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (20704) మధ్యాహ్నం 2.45 గంటలకు యశ్వంతపూర్‌లో బయల్దేరుతుంది. రాత్రి 11.15 గంటలకు కాచిగూడ స్టేషన్‌కు చేరుకుంటుంది. ధర్మవరం జంక్షన్ (4.59), అనంతపురం (5.29), కర్నూలు సిటీ (7.50) మహబూబ్‌నగర్ (9.34) స్టేషన్లలో నిమిషం చొప్పున ఆగుతుంది. తిరుగు ప్రయాణంలో మాత్రం ఛైర్‌కార్ టికెట్ ధర రూ.1540 గానూ, ఎగ్జిక్యూటివ్ క్లాస్ టికెట్ ధర రూ.2865గానూ రైల్వే శాఖ నిర్ణయించింది.

అన్నింట్లోనూ గెలుస్తాం

(మొదటిపేజీ తరువాయి)

వెనుక పక్కా వ్యూహం.. కులగణన ఆలోచన నుంచి ప్రజలను పక్కదారి పట్టించేందుకే బీజేపీ ఎంపీ రమేష్ బిధూడీ లోక్‌సభలో బీఎస్‌పీ ఎంపీ దానిష్ అలీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని, ఇది బీజేపీ వ్యూహంలో భాగమేనని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. బిధూడి, నిశికాంత్ దూబే చేసిన ప్రయత్నాలను సభలో అంతా గమనించారని చెప్పారు. తన యూట్యూబ్ ఛానెల్, తన ట్విటర్ అన్నీ అణిచివేయబడ్డాయని చాలా స్పష్టంగా అర్థమైందని, ప్రతిపక్షాలు ఏం మాట్లాడినా జాతీయ మీడియాలో వక్రీకరణ లేకుండా సాగదని అన్నారు.

'ఒక దేశం...ఒకే ఎన్నిక' ఎత్తుగడ కూడా ఇదే..

దేశంలో ప్రధానమైన అంశాలు అనేకం ఉన్నాయని, ఆరోగ్యం, సంపదలో భారీ అసమానత, ధరలు పెరుగుదల, తీవ్రమైన నిరుద్యోగం, ఓబీసీలు, గిరిజన తెగలను పట్టించుకోకపోవడం అనే పలు అంశాలపై బీజేపీ ఎలాంటి పట్టింపులేకుండా ఉందని చెప్పారు. ఈ సమస్యలన్నీ పక్కనపెట్టి 'ఒకదేశం.. ఒకే ఎన్నిక(జమిలి)' అనే అంశాన్ని లెవనెత్తడం వెనుక బీజేపీ ఉద్దేశాలు తాము గ్రహించగలమని అన్నారు. అయితే బీజేపీ ఎత్తుగడలు సాగనీయమని తెలిపారు. 'జమిలి ఎన్నికలు జరుపుదాం. భారతదేశం పేరు మారుద్దాం' ఇదంతా బీజేపీ కుట్రలో భాగమేనని విమర్శించారు.

ఆర్థిక దాడులు

తమపై (కాంగ్రెస్ పార్టీ) ఆర్థిక దాడులు జరిపించారని రాహుల్ ఆరోపించారు. "ఇవాళ దేశంలోని ఏ వ్యాపారవేత్తనైనా అడగండి. ఒక ప్రతిపక్ష పార్టీకి సపోర్ట్ చేస్తే వారికి ఏం జరిగిందో తెలుసుకోండి. ప్రతిపక్ష పార్టీకి ఒక చెక్ ఇవ్వాలని వారనుకుంటే ఏం జరిగిందో తెలుస్తుంది. మాపై ఆర్థిక దాడులు జరిగాయి. మీడియా దాడులు జరిగాయి. మేం ఇప్పుడు ఒక రాజకీయ పార్టీగా పోరాటం చేయడం లేదు. దేశం కోసం, ఐడియా ఆఫ్ ఇండియా (భారతదేశం ఆలోచన) కోసం పోరాడుతున్నాం. అందుకోసమే ప్రతిపక్ష కూటమికి 'ఇండియా' అనే పేరు పెట్టాం" అని రాహుల్ తెలిపారు. మాతో 60 శాతం జనాభా ఉన్నారని, ప్రతిపక్షాలు కలిసి పని చేస్తున్నాయని, 2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని ఇండియా కూటమి ఆశ్చర్యానికి గురిచేస్తుందని ఆయన అన్నారు.





రోయింగ్‌లో తీన్‌మార్

- షూటింగ్‌లో డబుల్ ధమాకా
- తొలి రోజు ఐదు పతకాలు
- 2023 ఆసియా క్రీడలు

ఆసియా క్రీడల తొలి రోజు టీమ్ ఇండియా పాంచ్ పటాకా. చైనాలోని హాంగ్జౌ నగరంలో జరుగుతున్న 19వ ఆసియా క్రీడల్లో భారత్ పతకాల ఖాతా ఘనంగా తెరిచింది. రోయింగ్‌లో రెండు రజతాలు సహా మూడు మెడల్స్ సొంతం కాగా.. షూటింగ్‌లో అమ్మాయిలు ఓ రజతం, కాంస్యం అందించారు. ఆతిథ్య చైనా 20 బంగారు పతకాలు సహా 30 మెడల్స్ సొంతం చేసుకుని తొలిరోజే తడాఖా చూపించింది!.

నవతెలంగాణ-హాంగ్జౌ

ఆసియా క్రీడల్లో టీమ్ ఇండియా పతక వేట ఘనంగా మొదలైంది. తొలి రోజు పోటీల్లోనే ఐదు పతకాలు దక్కించుకున్న భారత్.. శతకం దిశగా గట్టిగా బోణీ చేసింది. రోయర్లు మూడు మెడల్స్ అందించగా, షూటర్లు రెండు పతకాలు కట్టబెట్టారు. భారత మహిళల క్రికెట్ జట్టు కనీసం రజత పతకం ఖాయం చేసింది. మెన్స్ డబుల్ స్కల్ విభాగంలో అర్జున్ లాల్ జాట్, అరవింద్ సింగ్ జోడీ సిల్వర్ మెడల్ గెల్చుకోగా.. మెన్స్'ఎయిట్' విభాగంలో మనోళ్లు రజత సత్తా చూపారు. మెన్స్ పెయిర్ విభాగంలో బాబులాల్ యాదవ్, లాఖ్ రామ్ జోడీ మూడో స్థానంలో నిలిచి రజత పతకం సాధించింది. ఇక షూటింగ్‌లో అమ్మాయిలు అదరగొట్టారు. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో రమిత, మెహులీ ఘోష్, ఆశి చౌదరి త్రయం సిల్వర్ మెడల్ గురి పెట్టగా.. వ్యక్తిగత విభాగంలో రమిత కాంస్య పతకంతో సత్తా చాటింది. తొలి రోజు పోటీల్లో ఐదు పతకాలు దక్కించుకున్న భారత్.. క్రికెట్‌లో తొలి మెడల్ ఖాయం చేసుకుంది.



హైలెస్సో.. హైలెస్సో

రోయింగ్‌లో భారత రోయర్లు సత్తా చాటారు. తొలుత మెన్స్ డబుల్ స్కల్‌లో అర్జున్, అరవింద్ జోడీ సిల్వర్‌తో మెరిసింది. 6.28.18 సెకండ్లలో రేసు పూర్తి చేసిన అర్జున్, అరవింద్‌లు.. చైనా రోయర్ల తర్వాత స్థానంలో నిలిచారు. 6.23.16 సెకండ్లతో చైనా పసిడి నెగ్గగా.. 6.32.42 సెకండ్లలో రేసు ముగించి ఉజ్బెకిస్థాన్ కాంస్య పతకం సాధించింది. ఇక మెన్స్ 'ఎయిట్' రేసులోనూ భారత్‌కు సిల్వర్ మెడల్ దక్కింది. నీరజ్, నరేశ్, నితీశ్, చరణ్‌జిత్, జస్విందర్, భీమ్ సింగ్, పునిత్, ఆశీష్, ధనంజయలు రోయింగ్‌లో భారత్‌కు రెండో మెడల్ అందించారు. ఇక మెన్స్ పెయిర్ విభాగంలో బాబు లాల్ యాదవ్, లేఖ్ రామ్‌లు సైతం మెరిశారు. 6.50.41 సెకండ్లలో రేసు పూర్తి చేసిన బాబులాల్, రామ్‌లు మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం అందుకున్నారు. చైనా పసిడి పతకం సాధించగా, ఉజ్బెకిస్థాన్ సిల్వర్ మెడల్ ఎగరేసుకుపోయింది.

'గురి' కుదిరింది

19వ ఆసియా క్రీడల్లో భారత్‌కు తొలి పతకం అందించారు అమ్మాయిలు. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో టీమ్ ఇండియా షూటర్లు రెండు పతకాలు గురి పెట్టారు. జట్టు విభాగంలో సిల్వర్ సాధించగా, వ్యక్తిగత విభాగంలో కాంస్యం దక్కింది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ జట్టు విభాగంలో రమిత, మెహులీ ఘోష్, ఆశి చౌదరి త్రయం గురి తప్పలేదు. 1886 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచిన మన షూటర్లు సిల్వర్ మెడల్ సాధించారు. 1896 పాయింట్లతో చైనా షూటర్ల త్రయం పసిడి పతకం నెగ్గింది. మంగోలియా షూటర్లు 1880 పాయింట్లతో కాంస్య పతకం దక్కించుకున్నారు. ఇక వ్యక్తిగత విభాగంలో రమిత కాంస్యం నెగ్గింది. రమిత 631.9 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి మెడల్ దక్కించుకోగా.. మెహులీ ఘోష్ 630.8 పాయింట్లతో నాల్గో స్థానానికి పరిమితమై తృటిలో పతకం చేజార్చుకుంది. 623.3 పాయింట్లే సాధించిన ఆశి చౌదరి 29వ స్థానానికి పరిమితమై పతక పోటీకి సైతం అర్హత సాధించలేదు.







క్రికెట్‌లో మెడల్ ఖాయం

ఆసియా క్రీడల క్రికెట్‌లో భారత్ తొలి మెడల్ ఖాయం చేసుకుంది. మహిళల విభాగంలో టీమ్ ఇండియా ఫైనల్స్‌కు చేరుకోగా.. కనీసం సిల్వర్ మెడల్ లాంఛనమైంది. ఆదివారం జరిగిన సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసిన అమ్మాయిలు 8 వికెట్ల తేడాతో ఏకపక్ష విజయం నమోదు చేశారు. భారత యువ పేసర్ పూజ (4/17) నిప్పులు చెరిగే ప్రదర్శనతో తొలుత బంగ్లాదేశ్ మహిళల జట్టు 51 పరుగులకే కుప్పకూలింది. ఆ జట్టులో కెప్టెన్ నిగర్ సుల్తాన (12) మాత్రమే రెండెంకల స్కోరు చేయగలిగింది. స్వల్ప లక్ష్యాన్ని టీమ్ ఇండియా 8.2 ఓవర్లలో ఊదేసింది. షెఫాలీ వర్మ (17), జెమీమా రొడ్రిగస్ (20)లు ఛేదనలో మెరిశారు. దీంతో మరో 70 బంతులు మిగిలి ఉండగానే టీమ్ ఇండియా 8 వికెట్ల తేడాతో గెలుపొంది ఫైనల్లోకి అడుగుపెట్టింది. మరో సెమీఫైనల్లో పాకిస్థాన్ మహిళలపై శ్రీలంక మహిళల జట్టు ఘన విజయం సాధించింది. తొలుత పాకిస్థాన్ నిర్ణీత ఓవర్లలో 75/9 పరుగులు చేయగా.. 16.3 ఓవర్లలోనే శ్రీలంక లక్ష్యాన్ని ఛేదించి 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. నేడు జరిగే పసిడి పోరులో భారత్, శ్రీలంక తలపడనున్నాయి. కాంస్య పతక పోరులో పాకిస్థాన్, బంగ్లాదేశ్ ఢీకొట్టనున్నాయి.

ప్రీ క్వార్టర్స్‌లో నిఖత్

ప్రపంచ బాక్సింగ్ చాంపియన్ నిఖత్ జరీన్ ప్రీ క్వార్టర్స్‌కు చేరుకుంది. మహిళల 50 కేజీల విభాగం తొలి రౌండ్లో నిఖత్ జరీన్ వియత్నాం బాక్సర్ నుయన్‌పై 5-0తో ఏకపక్ష విజయం సాధించింది. 30-25, 30-25, 30-24, 30-24, 30-24తో వరుసగా మూడు రౌండ్లలో ఐదుగురు జడ్జీల ఏకగ్రీవ విజేతగా నిలిచింది.

రౌండ్-16కు ఫుట్‌బాల్ జట్టు

మెన్స్ ఫుట్‌బాల్ తొలి మ్యాచ్‌లో చైనాకు తలొగ్గినా.. వరుసగా రెండు మ్యాచుల్లో పుంజుకున్న భారత్ ప్రీ క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకుంది. మయన్మార్‌తో మ్యాచ్‌ను భారత్ 1-1తో డ్రా చేసుకుంది. 22వ నిమిషంలో సునీల్ ఛెత్రి పెనాల్టీని గోల్‌గా మలచి ఆధిక్యం అందించగా.. 74వ నిమిషంలో మయన్మార్ స్కోరు సమం చేసింది. అదనపు సమయం అనంతరం సైతం స్కోర్లు సమంగానే ఉంది. గ్రూప్ దశలో మెరుగైన ప్రదర్శనతో టీమ్ ఇండియా ప్రీ క్వార్టర్స్‌కు చేరుకుంది.

వాలీబాల్‌లో నిరాశే

భారత మెన్స్ వాలీబాల్ జట్టు సంచలన విజయాలకు క్వార్టర్‌ఫైనల్లో బ్రేక్ పడింది. గ్రూప్ దశలో టాప్ ర్యాంక్ జట్లు దక్షిణ కొరియా, చైనీస్ తైపీలపై మెరుపు విజయాలు సాధించిన టీమ్ ఇండియా.. క్వార్టర్స్‌లో ఆసియా నం.1 జపాన్ చేతిలో ఓడింది. 25-16, 25-18, 25-17తో వరుస సెట్లలో జపాన్ గెలుపొందింది. 1986 తర్వాత ఆసియాలో మెడల్ ఆశించిన భారత జట్టు ఓడినా.. మంచి ప్రదర్శనే చేసింది.

టేబుల్ టెన్నిస్‌లో మెన్స్ జట్టు ఉజ్బెకిస్థాన్‌పై గెలుపుతో క్వార్టర్స్‌కు చేరినా.. దక్షిణ కొరియా చేతిలో ఓటమి పాలైంది. మహిళల జట్టు నాకౌట్‌కు చేరకుండానే పరాజయం పాలైంది.

శ్రేయస్, శుభ్‌మన్ శతక్కొట్టారు

- రాహుల్, సూర్య ధనాధన్
- అశ్విన్, జడేజా మాయజాలం
- రెండో వన్డేలో భారత్ ఘన విజయం





నవతెలంగాణ-ఇండోర్

శ్రేయస్ అయ్యర్ (105, 90 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్స్‌లు), శుభ్‌మన్ గిల్ (104, 97 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) శతక విహారం. గిల్, అయ్యర్ ఇండోర్‌లో పరుగుల వరదకు అశ్విన్, జడేజా మ్యాజిక్ తోడటంతో రెండో వన్డేలో ఆసీస్‌పై భారత్ (డక్ వర్త్ లూయిస్ పద్దతిలో) 99 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. సూర్యకుమార్ యాదవ్ (72 నాటౌట్, 37 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్స్‌లు), కెఎల్ రాహుల్ (52, 38 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) సైతం అర్ధ సెంచరీలు బాదటంతో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 399/5 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఛేదనలో ఆస్ట్రేలియా చతికిల పడింది. 28.2 ఓవర్లలో 217 పరుగులకే కుప్పకూలింది. ఆరంభంలో పేసర్లు, ఆ తర్వాత స్పిన్నర్ల ముందు కంగారూ బ్యాటర్లు నిలువలేకపోయారు. ఈ విజయంతో వన్డే సిరీస్ 2-0తో భారత్ వశమైంది. సిరీస్‌లో మూడో మ్యాచ్ బుధవారం రాజ్‌కోట్‌లో జరుగనుంది.

ఆసీస్ చతికిల : 400 పరుగుల భారీ ఛేదనలో ఆస్ట్రేలియా చతికిల పడింది. ఏ దశలోనూ ఆసీస్ రేసులో నిలువలేదు. షార్ట్ (0), స్మిత్ (0), జోశ్ (6), అలెక్స్ (14), గ్రీన్ (19), జంపా (5)లు స్వల్ప స్కోర్లకే నిష్క్రమించారు. మార్నస్ లబుషేన్ (27), డెవిడ్ వార్నర్ (53) టాప్ ఆర్డర్‌లో కాసేపు క్రీజులో నిలిచినా.. భారత బౌలర్ల ధాటికి పెవిలియన్‌కు చేరక తప్పలేదు. 140 పరుగులకే 8 వికెట్లు కోల్పోయిన ఆస్ట్రేలియాకు సీన్ అబాట్ (54, 36 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లు), జోశ్ హాజిల్‌వుడ్ (23) తొమ్మిదో వికెట్‌కు 77 పరుగులు జోడించిన భారత బౌలర్లను విసిగించారు. ఫీల్డింగ్ వైఫల్యం సైతం ఆసీస్‌కు కలిసొచ్చింది. 28.2 ఓవర్లలో 217 పరుగులకు ఆస్ట్రేలియా కుప్పకూలింది. భారత్ 99 పరుగుల తేడాతో గెలుపొందింది. అశ్విన్ (3/41), జడేజా (3/42), ప్రసిద్ కృష్ణ (2/56) వికెట్ల వేటలో విజృంభించారు. ఆసీస్ ఇన్నింగ్స్ 9 ఓవర్లలో 56/2తో ఉండగా వర్షం అంతరాయం కలిగించింది. డక్ వర్త్ లూయిస్ పద్దతి ప్రకారం లక్ష్యాన్ని 33 ఓవర్లకు 317 పరుగులుగా నిర్దేశించారు.



గోపీచంద్

శ్రీను వైట్ల

ఇటలీలో యాక్షన్ పార్ట్

గోపీచంద్‌తో దర్శకుడు శ్రీను వైట్ల కాంబోలో ఓ సినిమా ఇటీవలే ముహూర్తపు వేడుకను జరుపుకుంది. చిత్రాలయం స్టూడియోస్ బ్యానర్‌పై డిస్ట్రిబ్యూటర్, ఎగ్జిబిటర్ వేణు దోనేపూడి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దర్శకుడు శ్రీను వైట్లకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ మేకర్స్ ఆదివారం ఒక ప్రత్యేక వీడియోను విడుదల చేశారు. ఫస్ట్ షెడ్యూల్ షూటింగ్ ప్రారంభమయ్యే సౌత్ ఇటలీలోని మాటెరాలో కొన్ని అద్భుతమైన ప్రదేశాలను దర్శకుడు శ్రీనువైట్ల ఎక్స్‌ప్లోర్ చేశారు. ఈ హై-వోల్టేజ్ యాక్షనర్ ప్రొడక్షన్ పార్ట్ నేటి (సోమవారం) నుండి ప్రారంభమవుతుంది. సినిమాలోని చాలా భాగం విదేశాల్లోని కొన్ని అద్భుతమైన లొకేషన్లలో చిత్రీకరించనున్నారు. గోపీచంద్, శ్రీనువైట్ల కాంబినేషన్‌లో రూపొందుతున్న తొలిచిత్రమిది. అయితే వీరిద్దరి కలయికలో రూపొందుతున్న ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై ఇప్పటికే మంచి అంచనాలు ఏర్పడ్డాయి. యాక్షన్‌తోపాటు కామెడీని కూడా పర్‌ఫెక్ట్‌గా బ్లెండ్ చేసే శ్రీనువైట్ల ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేసేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. ఈ సినిమాలో హీరోయిన్, ఇతర వివరాలు మేకర్స్ త్వరలో తెలియజేస్తారు. ఈ చిత్రానికి స్క్రీన్ ప్లే: గోపీ మోహన్, సినిమాటోగ్రఫీ: కేవీ గుహన్.

నవచిత్రం

లక్కీ భాస్కర్ షూటింగ్ షురూ..



దుల్కర్ సల్మాన్, చుక్కపల్లి సురేష్

దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రం 'లక్కీ భాస్కర్'. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'సార్/వాతి' తర్వాత దర్శకుడు వెంకీ అట్లూరితో ఇది వారి రెండవ పాన్-ఇండియా చిత్రం కావడం విశేషం. ఇదిలా ఉంటే, 'లక్కీ భాస్కర్' షూటింగ్ ఆదివారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది.
ఉన్నత శిఖరాలకు చేరిన ఒక సాధారణ మనిషి తాలూకా అసాధారణమైన ప్రయాణంగా ఈ చిత్రం రూపొందుతోంది. దుల్కర్ సల్మాన్, మీనాక్షి చౌదరి జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి డి ఓ పి: నిమిష్ రవి, ఆర్ట్ డైరెక్టర్: వినీష్ బంగ్లాన్, ఎడిటర్: నవీన్ నూలి, సంగీతం: జి.వి.ప్రకాష్ కుమార్, నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య, సమర్పణ: శ్రీకర స్టూడియోస్.

యుద్ధం చేయాల్సిందే



శ్రీకాంత్ అడ్డాల, మిర్యాల రవీందర్‌రెడ్డి, విరాట్ కర్ణ

విరాట్ కర్ణ హీరోగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో రూపొందుతున్న న్యూ ఏజ్ పొలిటికల్ థ్రిల్లర్ 'పెదకాపు-1'. ద్వారకా క్రియేషన్స్ పై మిర్యాల రవీందర్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈనెల 29న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తున్న నేపథ్యంలో మేకర్స్ గ్రాండ్‌గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు.
హీరో విరాట్ కర్ణ మాట్లాడుతూ, 'మా డైరెక్టర్ శ్రీకాంత్ అడ్డాల నా పై నమ్మకంతో ఇంత పెద్ద సినిమాలో, ఇంత మంచి పాత్ర ఇచ్చారు. అలాగే నేను హీరోగా ఇంత పెద్ద సినిమాని నిర్మించిన మా బావకి జీవితాంతం రుణపడి ఉంటాను' అని తెలిపారు.
'విరాట్ .. కొత్త కుర్రాడని నేను ఎప్పుడూ అనుకోలేదు. ఇందులో కొత్తగా ఫీలవ్వొద్దని విరాట్‌కి కూడా చెప్పాను. ఒక కొత్తకుర్రాడిగా నువ్వు చేస్తేనే ఈ కథ అందరికీ దగ్గర అవుతుందని చెప్పాను. దీనికి సామాన్యుడి సంతకం అని ఊరికే పెట్టలేదు. ఒక కొత్త హీరోతో ఇలాంటి కొత్త కథ చేసినప్పుడు ఒక నిర్మాత దన్నుగా నిలబడినప్పుడు.. దర్శకుడిగా అందరి తరుపున నిలబడి సినిమా చేసిన పేరుని ఎందుకు వదులుకోవాలి. ఎప్పుడైనా ప్రోత్సాహం ఉంటేనే ఉత్సాహం ఉంటుంది' అని దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల అన్నారు. నాయిక ప్రగతి శ్రీవాస్తవ మాట్లాడుతూ, 'ఈ సినిమాలో భాగం కావడం చాలా అదృష్టంగా భావిస్తున్నాను' అని చెప్పారు.

ఇది నా 4వ సినిమా. గతంలో చేసిన మూడు సినిమాలు వేరు .. పెదకాపు వేరు. దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల గురించి ఒక్క మాట చాలా నమ్మకంగా చెబుతున్నా. ఈ సినిమా విడుదలైన తర్వాత తెలుగు సినిమాకి మరో వెట్రిమారన్ వస్తారు. విరాట్ పర్సనాలిటీకి ఒక యాక్షన్ తరహా కథ అయితే బావుంటుందని ఇది చేశాం. అలాగే 294 మంది కొత్తవారిని ప్రేక్షకులకు పరిచయం చేస్తున్న సందర్భం ఇది. ఒక సామాన్యుడు తన పరిస్థితులను తట్టుకుని, బలవంతుడిని జయించాలంటే ఒక యుద్ధమే చేయాలి. ఆ యుద్ధంలోకి దిగిన తర్వాత వెనకడుగువేయకూడదు. అనుకున్నది సాధించాలంటే పోరాటం తప్పితే వేరే మార్గం వుండదు. అదే ఈ సినిమా కథ.

\- నిర్మాత
మిర్యాల రవీందర్ రెడ్డి

థ్రిల్ చేసే సినిమా



రఘు, రాజ్ కందుకూరి, మోహన

'బాహుబలి' ప్రభాకర్ ప్రధాన పాత్రలో రావుల రమేష్ క్రియేషన్స్ పతాకంపై పాలిక్ దర్శకత్వంలో రావుల రమేష్ నిర్మిస్తున్న చిత్రం 'రౌద్ర రూపాయ నమః'. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రానికి సంబంధించిన మోషన్ పోస్టర్, చిత్రంలోని మొదటి లిరికల్ వీడియోను ఆదివారం నిర్మాత రాజ్ కందుకూరి లాంచ్ చేశారు.
'సుర సుర సుర అసుర సురసుర ... హర హర హర అతి భయంకరా...' అంటూ సాగే ఈ పాటను సురేష్ గంగుల రచించగా, జాన్ భూషణ్ స్వరపరిచారు. మ్యాంగో మ్యూజిక్ ద్వారా ఈ చిత్రంలోని పాటలు మార్కెట్‌లోకి విడుదలయ్యాయి.
ఈ సందర్భంగా రాజ్ కందుకూరి మాట్లాడుతూ, 'టైటిల్‌తో పాటు నేను లాంచ్ చేసిన సాంగ్ చాలా ఇంప్రెసివ్‌గా ఉన్నాయి. పాట చూసిన తర్వాత థ్రిల్లర్ కథ అని అర్థమవుతోంది. 'బాహుబలి' ప్రభాకర్ గెటప్, క్యారెక్టర్ చాలా కొత్తగా, ఇంట్రెస్టింగ్‌గా ఉంది. నేను చూసిన పాట, మోషన్ పోస్టర్‌తో దర్శకుడు పాలిక్ ప్రతిభ ఏంటో కనబడుతోంది. జాన్ భూషన్ సంగీతం వినసొంపుగా ఉంది. ఈ చిత్రం బ్లాక్ బస్టర్ కావాలని ఆశిస్తున్నాను' అని తెలిపారు. 'దర్శకుడు పాలిక్ పక్కా ప్లానింగ్‌తో, ప్రభాకర్ సపోర్ట్‌తో ఎంతో అద్భుతంగా తెరకెక్కించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. త్వరలో చిత్రాన్ని గ్రాండ్‌గా రిలీజ్ చేస్తాం' అని నిర్మాత రావుల రమేష్ అన్నారు. దర్శకుడు పాలిక్ మాట్లాడుతూ,'జాన్ భూషన్ చక్కటి బాణీలు ఇవ్వగా, అద్భుతమైన సాహిత్యాన్ని 'బొంబాయి పోతావా రాజా' ఫేమ్ సురేష్ గంగుల అందించారు' అని తెలిపారు.

ఓ నా మధు..



నవీన్ చంద్ర, స్వాతి రెడ్డి

నవీన్ చంద్ర, స్వాతిరెడ్డి, శ్రేయ నవిలే ప్రధాన పాత్రల్లో శ్రీకాంత్ నాగోతి దర్శకత్వం వహించిన చిత్రం 'మంత్ ఆఫ్ మధు'. యశ్వంత్ ములుకుట్ల ఈ చిత్రాన్ని హ్యాండ్‌పిక్డ్ స్టోరీస్‌తో పాటు కృషివ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా అచ్చు రాజమణి స్వరపరిచిన 'ఓ నా మధు' పాటను మేకర్స్ విడుదల చేశారు. 'ఈ పాట ప్రేమలోని అందమైన అనుభూతిని ప్రతిబింబించే ఫ్లజెంట్ మెలోడీగా ఉంది. పాటలోని రొమాంటిక్ ఫీల్ చాలా శ్రావ్యంగా ఉంది. ఈ పాటకు దర్శకుడు శ్రీకాంత్ నాగోతి స్వయంగా సాహిత్యం అందించగా, కార్తీక్, యామిని ఘంటసాల తమ మెస్మరైజింగ్ వాయిస్‌తో అద్భుతంగా ఆలపించారు. నవీన్ చంద్ర, స్వాతి రెడ్డి వండర్ ఫుల్ కెమిస్ట్రీని పంచుకున్నారు. ఈ సినిమా అక్టోబర్ 6న విడుదల కానుంది' అని చిత్ర బృందం తెలిపింది.

క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



మేఘా ఆకాష్, రామ్‌కిరణ్

రామ్‌కిరణ్, మేఘాఆకాశ్ జంటగా నటిస్తున్న 'స:కుటుంబానాం' చిత్ర ప్రారంభోత్సవం ఆదివారం హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైంది. హెచ్‌ఎన్‌జీ మూవీస్ సినిమాస్ పతాకంపై ఉదయ్‌శర్మ దర్శకత్వంలో హెచ్.మహాదేవ్ గౌడ, హెచ్.నాగరత్నం నిర్మిస్తున్నారు.
హీరో, హీరోయిన్‌లపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి కొరియోగ్రాఫర్ చిన్నిప్రకాష్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత ఎ.ఎం.రత్నం క్లాప్‌నిచ్చారు. చిత్ర నిర్మాత మహాదేవ గౌడ్ దర్శకుడికి స్క్రిప్ట్ అందజేయగా, ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు ఉదయ్‌శర్మ గౌరవ దర్శకత్వం వహించారు.
ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుత, 'ఇదొక క్లీన్‌ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా అందరికి నచ్చుతుందని ఆశిస్తున్నాను' అని తెలిపారు. 'ఈ చిత్రంలో నా పాత్ర పేరు సిరి. నాకు బాగా నచ్చిన పాత్ర. ఈ సినిమాలో నటించడం ఆనందంగా ఉంది' అని నాయిక మేఘా ఆకాష్ అన్నారు. కథానాయకుడు రామ్‌కిరణ్ మాట్లాడుతూ, 'ఈ చిత్రానికి కథే హీరో. అన్ని ఎమోషన్స్ ఉన్న చాలా శక్తివంతమైన కథ ఇది. ఈ చక్కని కుటుంబ కథా చిత్రం అందరికి నచ్చుతుంది' అని తెలిపారు. 'న్యూ కాన్సెప్ట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం అందర్ని అలరిస్తుందనే నమ్మకం ఉంది.' అని నిర్మాత అన్నారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886



భారతీయ సైన్ లాంగ్వేజ్ అభివృద్ధి ఎప్పుడు?

సెప్టెంబర్ 23 అంతర్జాతీయ సైన్ లాంగ్వేజ్ డే. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 7.2కోట్ల మంది బధిరులు ఉన్నారు. 80శాతం మంది అభివృద్ధి చెందిన దేశాల నుంచే ఉన్నారు. అంతర్జాతీయంగా 300 కంటే ఎక్కువ సైన్ లాంగ్వేజ్‌లున్నాయి. కేవలం 2శాతం మంది సైగల భాష ఉపయోగి స్తున్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో బధిరులు సైతం సకలాంగులతో సమానంగా పోటీ పడుతున్నారు. ఒకప్పుడు సమాజంలో చులకనగా, హేళనగా చూడబడిన చెవిటి వారు... అంతర్జాతీయంగా వినికిడి విజ్ఞానం అభివృద్ధి కావడంతో అన్ని రంగాల్లోనూ ముందుకు వెళ్తున్నారు. మన దేశంలో ప్రత్యేక పాఠశాలాల ఏర్పాటు పట్ల నిర్లక్ష్యం ఉంది. ఇప్పటికీ అమెరికన్ సైన్ లాంగ్వేజ్‌నే మన దేశంలో వినియోగిస్తున్నారు. ప్రపంచంలో అనేక దేశాలు స్వతహాగా తమ జాతీయ స్థాయిలో సైగల భాషను అభివృద్ధి చేసుకున్నాయి. 76ఏండ్ల స్వతంత్ర భారత దేశంలో మాత్రం ఇతర దేశాల సైగల భాషపై ఆధారపడడం బధిరుల విద్య పట్ల మన పాలకులకున్న చిత్తశుద్ధికి నిదర్శనం. 2021 ఆగస్టులో మన దేశ సైగల భాషను అధికారికంగా గుర్తిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికైనా మన సైన్ లాంగ్వేజ్‌ను అభివృద్ధి చేయడంపై పాలకులు శ్రద్ధ పెట్టాలి. అనేక దేశాల్లో బధిరుల కోసం ప్రాథమిక విద్య నుండి యూనివర్సిటీ చదువుల వరకు సైగల భాషలోనే బోధిస్తున్నారు. మన దేశంలో ప్రభుత్వ రంగంలో బధిరులు చదువుకునేందుకు విద్యాసంస్థలు తగినన్ని లేవు. సాధారణ పాఠశాలల్లో ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించాలని విద్యాహక్కు చట్టంలో ఉన్నప్పటికీ అమలుకు నోచడం లేదు.



ఎం. అడివయ్య
9590098713

ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం... మన దేశంలో 10-20శాతం మంది వినికిడి సమస్యతో బాధపడుతున్నారు. 50ఏండ్లు పైబడిన వారిలో 40శాతం, 70ఏండ్లు పైబడిన వారిలో 70శాతం మందికి వినికిడి సమస్యతో బాధపడుతున్నారు. 2050 నాటికి ప్రతి నలుగురిలో ఒక్కరికి వినికిడి సమస్య ఉండొచ్చని 2021లో డబ్ల్యుహెచ్ఓ ప్రకటించింది. ఏపీలో గ్రామీణ ప్రాంతంలో 6.4శాతం, పట్టణ ప్రాంతంలో 4.9శాతం మంది బధిరులు నివసిస్తున్నారు. నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ (ఎన్ఎస్ఓ) నివేదిక ప్రకారం పురుషుల కంటే మహిళా వికలాంగుల సంఖ్య ఎక్కువగా ఉంది. 2016 ఆర్‌పిడి చట్టం గుర్తించిన 21 రకాల వైకల్యాల ప్రకారం వీరి సంఖ్య రెట్టింపు అవుతుంది. సామూహిక ప్రాంతాలన్నీ మూగ, చెవిటి వారితోపాటు వికలాంగులు వినియోగించుకునే విధంగా ఉండాలని 2016 ఆర్‌పిడి చట్టం పేర్కొంది. 2015లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాక్సెసిబుల్ ఇండియా క్యాంపైన్ ద్వారా 2020 నాటికి ప్రధాన నగరాల్లో 50శాతం అందుబాటు లోకి రావాలి. దేశవ్యాప్తంగా 1182 స్థలాలు గుర్తిస్తే 482 మాత్రమే అందు బాటులోకి వచ్చాయి. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాలు, ప్రభుత్వ కార్యాలయాలన్నింటిలో సైగల భాష సౌకర్యాలు అందుబాటులో ఉండాలి. ఇవేవీ అమలులో లేవు. బధిరులు వినియోగించే పరికరాలు అందుబాటులో లేకపోవడం ద్వారా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వినికిడి పరి కరాలను ఉచితం గానే సరఫరా చేయాలి. విద్యార్థులకు 4-జి ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు అందించడం ద్వారా ఉన్నత విద్య అభ్యసించేందుకు అవకాశం ఏర్పడుతుంది. వినికిడి సమస్యను గుర్తించేందుకు శాస్త్రీయ పద్ధతిలో చికిత్స అందించాలి. దీని కోసం ప్రభుత్వ ఆసుపత్రులన్నింటిలో ఆడియాలజిస్టు, స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజిస్టులను నియమించాలి. వినికిడి సమస్య ఉన్న వారికి, ఇంప్లాంట్ చికిత్స చేయాల్సిన వారికి ప్రభుత్వం ఉచితంగా చేయాలి. తీవ్రతను బట్టి ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలి. వినికిడి సమస్య నివారణ కోసం శాస్త్రీయ పద్ధతుల్లో ప్రభుత్వం కృషి చేయడం ద్వారా వినికిడి లోపాన్ని సహజంగా తీర్చిదిద్దగలం. అందుకోసం ప్రభుత్వాలపై పోరాడి హక్కులు సాధించుకోవాల్సిన అవసరముంది.

సనాతన ధర్మంలో సమానత్వం ఉందా..?



టి. స్కైలాబ్ బాబు
9177549646

సనాతన ధర్మంపై నేడు దేశవ్యాప్తంగా చర్చ (రచ్చ) జరుగుతున్నది. తమిళనాడు ముఖ్యమంత్రి కుమారుడు, ఆ రాష్ట్ర మంత్రి ఉదయనిధి స్టాలిన్ అభ్యుదయ రచయితల వర్క్‌షాప్‌లో 'సనాతన ధర్మం డెంగ్యూ, మలేరియా జబ్బుల లాంటివి. వాటిని నిర్మూలించాల్సిందేనని' వ్యాఖ్యానించారు. దీనిపై సాధారణ ఆర్ఎస్ఎస్ కార్యకర్త నుండి మొదలుకొని దేశ ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలు కూడా ఘాటుగా స్పందించారు. సనాతన ధర్మం, హిందూ మతం ఒకటేనని, ఆ వ్యాఖ్యలు హిందువులను కించపరిచి నట్లున్నవని వ్యాఖ్యానించడమే కాదు, అయోధ్యకు చెందిన ఒక సన్యాసి ఉదయనిధి స్టాలిన్ తల నరికితే రూ.10 కోట్లు సుపారీ కూడా ప్రకటిం చాడు. 'నేను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉంటానని' ఉదయనిధి స్టాలిన్ ఘంటాపథంగా చెప్పారు సనా తన ధర్మంలో ఎవరి ప్రయోజనాలు దాగున్నాయి? సనాతన ధర్మంపై కేవలం ఉదయనిధి స్టాలిన్ మాత్రమే మాట్లాడారా? ఆయనే మొదటి వాడు కాదు, చివరివాడు కూడా కాదు. సమాజంలో రెండు భిన్నమైన భావాలు నిరంతరం సంఘర్షించుకుంటూనే ఉంటాయి. సనాతన ధర్మంపై కూడా అనేకమంది వాటిని నిర్మూలించాలని చెప్పిన వాళ్లున్నారు. అవి పరమ పవిత్రమైనవని, అవి పది కాలాలపాటు కొనసాగాలని కోరుకునేవారు ఉన్నారు. సనాతన ధర్మమంటే కుల అసమానతలు మనుషుల మధ్య హెచ్చుతగ్గులు కొనసాగాలని కోరుకునే శాశ్వత ధర్మమే సనాతన ధర్మం. అంటే ప్రాచీన ధర్మ మని, అది హిందూ ధర్మమని, అది చాలా పవిత్ర మైనదని దానిని కొనసాగించాలని ఆర్యుల ఆలోచనలు నింపుకున్న ఆరెస్సెస్ వాళ్ల వ్యాఖ్యలు చేయటం చూస్తున్నాం. సనాతన ధర్మంలో సమాత్వం ఉందా? ఈ ధర్మంలో ఎవరి ప్రయోజనాలుంటాయి? సనాతన ధర్మంలో మెజార్టీ ప్రజలకు దక్కే ప్రయోజనాలు ఏమిటి? ఇవి చర్చిం చుకోవాల్సిన అవసరం ఇప్పుడు ఆసన్నమైంది. సనాత నంలో సమా నత్వం ఉంటే దేశ మంతా పాటించాలి. అన్ని అస మాతలు ఆధి పత్యాలే ఉంటే దానిని సమూలంగా నిర్మూలించాలి. ఈ రచ్చ జరుగు తున్న సమయంలోనే దేశ ప్రధాని సనాతన ధర్మంపై ఆచి తూచి అడుగులు వేయాలని, చరిత్ర లోతుల్లోకి వెళ్ళొద్దని వారి శ్రేణు లకు పిలుపునివ్వడాన్ని చూస్తే అది ఎంతటి అధర్మమో తెలుస్తోంది.

మనుస్మృతి చెబుతున్నదేంటి?

సనాతన ధర్మంలో సతీసహగమనం ఉండేది. వితంతువులకు పునర్వివాహాలు నిషేధించబడ్డాయి. దేవదాసీ వ్యవస్థ కొనసాగింది. ఇప్పటికి నిజామాబాద్ మరికొన్ని జిల్లాల్లో జోగిని వ్యవస్థ కనిపిస్తోంది. కులపరమైనటువంటి నిచ్చెన మెట్ల వ్యవస్థ మూడు వేల సంవత్సరాలుగా కొనసాగుతూ వస్తున్నది. ఏ తల్లి అయినా నవమాసాలు మోసి కంటేనే పుట్టేవాడు మనిషి వాస్తవం కానీ రుగ్వే దంలో 10మండలంలో చెబుతున్నది ఏమిటి? చాతుర్వర్ణం మయా సృష్టం గుణకర్మనే విభాగ్య శ్యాహ అని చెప్పలేదా? జన్మనే జాయెతా బ్రాహ్మణం కర్మనే జాయెతా శూద్రాణం అని పేర్కొనబడలేదా? తలలో నుండి బ్రాహ్మణులు పుట్టారని, క్షత్రియులు భుజాల నుండి జన్మించారని, వైశ్యులు తొడల నుండి జన్మించారని, శూద్రులు పాదాల కింది నుంచి జన్మించారని చెప్పింది నిజం కాదా? ఇది సనాతన ధర్మంలో లేదు అని చెప్పగలరా? ఈ మను అధర్మ అసమానతలు సనాతన ధర్మంలో లేవని చెప్పగలరా? మనుషులందరు సమానులే అని సనాతన ధర్మంలో ఉందా? సనాతన ధర్మం ప్రకారం కేవలం బ్రాహ్మణ, క్షత్రీయ, వైశ్య ప్రయోజనాల కోసమే ఏర్పడ్డది అనేది నూటికి నూరు శాతం నిజం. బ్రాహ్మణులు మాత్రమే వేదాలు విద్య నేర్చుకోవాలని, శూద్రులు విద్య వేదాలకు అనర్హులని, విద్యనభ్యసిస్తే నాలుకలు కోయాలని విద్యను వింటే చెవుల్లో సీసం పోయాలని మనుస్మృతి రెండవ అధ్యాయం 31వ శ్లోకంలో లేదా? శూద్రులను నీచపు పేర్లతో పిలవాలని ఎనిమిదో అధ్యాయం 25వ శ్లోకం చెప్పట్లేదా? శూద్రులు బ్రాహ్మణులను తిడితే నాలుక కోయాలని, కొడితే చేతిని నరకాలని, తంతే కాలు నరికేయాలని రెండో అధ్యాయం 37వ శ్లోకంలో లేదా? ఒక శూద్రుడు అగ్రవర్ణ స్త్రీతో సంభోగిస్తే వాడి అంగం కోయాలని 379, 380 శ్లోకాలలో లేదా? అందుకే కదా కులాంతర వివాహాలు జరిగితే కుల దురహంకార హత్యలు కొనసాగుతున్నది. ఇవన్నీ సనాతన ధర్మాన్ని సమర్థించే వాళ్ల, అవి మా ధర్మంలో లేవని చెప్పగలరా? వేల సంవత్స రాలుగా మానసిక చట్టాలుగా సనాతన ధర్మం కొనసాగుతూ వస్తోంది. శూద్రులు ఆస్తులు కలిగియుండరాదు, శూద్రులు విద్యనభ్య సించరాదు, శూద్రస్త్రీలు ఆభరణాలు ధరించరాదు, శూద్రులు ఆయుధం పట్టకూడదు, శూద్రులు అధికారానికి దూరంగా ఉండాలి ఇవన్నీ మను అధర్మ శాస్త్రంలో పేర్కొన్న అసమానతలను చట్టబద్ధం చేసే శ్లోకాలు. మెజారిటీ ప్రజలపై మైనారిటీలు ఆధిపత్యం చేయటం కోసం సృష్టించబడిన అసమానతల అంటురోగాలు.

శూద్రులపై యుద్ధానికే ఆ మూడు వర్ణాలు

వీటికి వ్యతిరేకంగా లోకాయితులు, చార్వాకులు, గౌతమ బుద్ధుడు, జైనులు, కబీర్ గురునానక్, బ్రహ్మానాయుడు, తుకారాం, అన్నమయ్య, వైష్ణవం, శైవం, రాజా రామ్మోహన్ రాయ్, కందుకూరి వీరేశలింగం వంటి ఎంతోమంది మహనీ యులు సతీసహగమనంపై సమరం సాగించారు. విచిత్రం ఏమిటంటే సనాతన ధర్మం వల్ల సర్వం కోల్పోయిన క్షుద్రులే సనాతన ధర్మం చాలా గొప్పదని పరమ పవిత్రమైందని వ్యాఖ్యలు చేయడం అత్యంత బాధాకరం. సనాతన ధర్మం వల్ల సంపద కూడా పెట్టుకున్న ఆ పైమూడు వర్ణాలు శూద్రుల చేతనే శూద్రులపై యుద్ధం చేసే విధంగా ప్రణాళికలు రూపొందించారు. సనాతన ధర్మం చాలాగొప్పది అనేవారు ఆ సనాతన ధర్మాన్ని ఎవ్వరు పాటించడం లేదు. ఆ ధర్మాన్ని పాటిస్తే శూద్రులకు ఆస్తులే ఉండకూడదు. కాబట్టి మన రాష్ట్రంలో దేశంలో ఉన్న అగ్రకులాలుగా పిలవబడుతున్న కమ్మ, రెడ్డి, వెలమ ఈ తరగతులు కూడా భూమికి అనర్హులు. కేవలం పై మూడు వర్ణాలకు ఎట్టి చేయటం కోసం పుట్టిన వాళ్లే శూద్రులు అనేది సనాతన ధర్మంలో ఉంది



సనాతన ధర్మం అంటే ఆధిపత్యం చెలాయించడం, అసమానతలను సుస్థిరం చేయడం, అవమానాల్ని, అన్యాయాలను, అబద్ధాలను పెంచి పోషించడం. నేటి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఆకాశామంత (చంద్రయాన్3)ఎత్తు ఎదిగిన తర్వాత కూడా మధ్యయుగాల కాలం నాటి మూఢవిశ్వాసాలను పరమ పవిత్రంగా భావించడం సిగ్గుచేటు. సనాతన పాటించడమంటేనే పైన చెప్పిన మూడు వర్ణాలు లబ్ధి పొందడం కోసం, తమ రాజకీయ, ఆర్థిక, సామాజిక ప్రయోజనాలను సుస్థిరం చేయడం కోసం జరుగుతున్న రచ్చ . ఈ చర్చలో ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలు సమాజ అభివృద్ధికి, సామాజిక న్యాయానికి, సమానత్వానికి దోహదం చేస్తాయి.ఆయనకు అందరూ మద్దతివ్వాలి.

కదా! ఇటీవల ఒక సినీ నటుడు రామ్‌చరణ్ తేజ్ సనాతన ధర్మంపై ఘాటుగా స్పందించారు. సనాతన ధర్మం ప్రకారంగా రామ్‌చరణ్ తండ్రి చిరంజీవి వారి పూర్వీకులైన తూర్పు కాపులు శూద్రులే... వారు కేవలం వ్యవసాయం చేస్తూ జీవించాలి. కానీ సినిమా ఫీల్డ్‌లో హీరోలుగా ఎందుకు చలామణి అవుతున్నారు? మీరు సినిమాలో హీరోలుగా ఉన్నారంటే అది రాజ్యాంగ ధర్మం కల్పించిన హక్కేగాని సనాతన ధర్మం కాదు. చివరికి జబర్దస్తీలో ఉండే యాంకర్ బ్రాహ్మణ యువతి రష్మీ కూడా సనాతన ధర్మాన్ని విమర్శించే వాళ్ళు, తమ రిజర్వేషన్లను అక్కడే వదిలి పెట్టి వేరే మతాల్లో కలవండని ఆమె సెలవిచ్చారు. ఈ దేశంలో అసలు రిజర్వేషన్లు ఎవరు అనుభవిస్తున్నారు, కొసరు రిజర్వేషన్లు ఎవరు అనుభవిస్తున్నారు ఇది ఇప్పుడు జరగాల్సిన చర్చ. వేల సంవత్సరాలుగా మీ తాతల తండ్రుల కాళ్ల శూద్రులుగా పుట్టినటువంటి వాళ్లు కడగాల్సిన దుస్థితి ఎందుకు ఏర్పడింది? మొత్తం శూద్రులు సంపాదించిన సంపాదనలో మెజార్టీ వాటా మీకే ఎందుకు దక్కుతుంది? దేశంలోని బడా కోటీశ్వరులలో అత్యధికులు బ్రాహ్మణ సామాజిక తరగతికి చెందిన వాళ్లే ఎందుకున్నారు? అగ్రకులాలుగా పిలవబడుతున్న రెడ్డి, కమ్మ, వెలమ మొదలుకొని అట్టడుగు పేదలైనటువంటి బలహీన వర్గాలు దళితులు ఆ 169 శతకోటీశ్వరులలో ఒక్కరైనా ఎందుకు లేరు? సనాతన ధర్మమంటే ఆర్థిక సమానతలు సృష్టించి వాటిని పది కాలాల పాటు కొనసాగింపచేయడమే.

సమతాస్ఫూర్తి సాక్షిగా అసమానతలు

ప్రతిరోజు ప్రవచనాలు, సుద్దులు చెప్పే చినజీయర్ స్వామి మాట్లాడిన మాటలేంటి? 'కుల వ్యవస్థను కొనసాగించాల్సిందే. అంటరానితనం శాశ్వతంగా వర్థిల్లాలి. మనుషులందరూ సమానం కాదు, ఒక మనిషి దేహానికి కాళ్లు రెక్కలు లాగా కులాలు ఉండాల్సిందే' అని ఘంటాపథంగా సనాతన సంరక్షకుడిగా చెప్పలేదా? కుల అసమానతల్ని కొనసాగిం చడమే సనాతన ధర్మం అని చినజీయర్ స్వామి మాట్లాడారు. ఆయన ముచ్చింతలలో నిర్మించిన రామనుజాచార్యుల విగ్రహం ఆవిష్కరించిన అనంతరం అక్కడ పనిచేయటానికి కావలసిన ఉద్యోగాలలో సనాతన ధర్మం ప్రకారమే దళితులు మల మూత్రాలు ఎత్తిపోసేటువంటి వాళ్లగా మరుగుదొడ్లు మూత్రశాలలు శుభ్రం చేసి చోటా దళితులు ఉండాలని చెప్పారు. ఇది సనాతన ధర్మం కాదా? సమాతమూర్తి అని ఓ వైపు చెబుతూ మరోవైపు ఎందుకు ఈ అసమానతలు అవమానాలు. ఇది ఏ ధర్మం సమతా భావం నింపాల్సిన సమానత్వ సమతావాదీ దగ్గర ఏమిటి అసమానతలు చినజీయర్ బదులిస్తాడా? అడవి బిడ్డలు ఆదివాసీలు పూజించుకునే సమ్మక్క, సారలమ్మను వాళ్ల దేవతలు కాదు వ్యాపారం కోసం వెలేసినటువంటి వాళ్లు అని చెప్పినప్పుడు, మెజారిటీ ఆదివాసీలను మనోభావాలు దెబ్బతీసినప్పుడు, ఇది ఏ ధర్మం నుండి వచ్చిన వచ్చిన వ్యాఖ్యలుగా చూడాలి. పశువుల్ని ప్రేమించి మనుషుల్ని హత్యగావించే సంస్కృతి ఏ ధర్మంలో భాగం. ఒక పశువు చనిపోతే ఊరేగింపు చేసుకుంటూ తీసుకెళ్లడం, ఒక దళితుడు చనిపోతే ఊర్లోకి శవాన్ని కూడా రానీయ్యకపోవడం ఏ సంస్కృతిలో భాగం. దళితులను గుడిలోకి రానీయకపోవటం బడిలో చదవనీయకపోవడం, రచ్చబండల మీద కూర్చోనీయకపోవడం, బతకమ్మలు ఆడనీయకపోవడం, బోనమెత్తితే దాడి చేయడం, జమ్మి చెట్టు ఆకు తెంపితే దాడి చేయడం, ఇల్లు కిరాయికి ఇవ్వకపోవడం ఇవ్వన్నీ ఏ ధర్మం కిందికి వస్తాయి? కర్నాటక వాటర్ ట్యాంక్ నల్లా నీళ్లు ఓ దళిత మహిళ ముట్టుకున్నదని ఆవు మూత్రం ఆవు పేడ కలపడం, దేశ ప్రధానిమోడీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో దళిత యువకుడు గుర్రమెక్కాడని దాని మీద నుంచి కింద పడేసి కొట్టి చంపడం ఏ ధర్మం కిందికి వస్తుంది. ఓ దళితుడు పెండ్లి చేసుకొని తన స్వగ్రామంలో ఎందుకు అనర్హుడు ఊరేగింపు చేసుకోవడానికి హైకోర్టు నుంచి పర్మిషన్ తెచ్చుకోవాల్సిన గత్యంతరం ఎందుకొచ్చింది. తాను పుట్టిన ఊరిలో ఊరేగింపు చేసుకునే హక్కు ఓ దళితుడికి ఉండదా? ఉత్తరప్రదేశ్‌లో దళిత యువతిపై నలుగురు బ్రాహ్మణ రాజపుట్ కులానికి చెందిన దుండగులు గ్యాంగ్ రేప్‌నకు పాల్పడి, హత్య చేస్తే వారిని పవిత్రులుగా భావించి పూలదండలు వేసి ఊరేగింపు చేసిన సంస్కృతి ఏ ధర్మం చెప్పాలి?

అధిపత్యాన్ని పెంచిపోషించేది సనాతన ధర్మం

రోజూ 'భారత్ మాతాకీ జై' అని గొంతు చించుకునే దేశ భక్తులు మణిపూర్ రాష్ట్రంలో ఇద్దరు ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగింపు చేసిన నీచత్వాన్ని ఎందుకు ఖండించ లేదు? ఆ అమానవీయ దుశ్చర్యను ఏ ధర్మంగా చెప్పాలి? మూఢ విశ్వాసాలు అశాస్త్రీయ అసమానతలను ప్రశ్నించి నందుకు కల్బుర్గి, దభోల్కర్, పన్సారే, గౌరీ లంకేష్ వంటి మేధా వుల్ని చంపింది ఏ ధర్మం కిందకు వస్తుంది? ఆవు మాంసం తిన్నాడని దాడులు చేయటం హత్యలు చేయడం ఏ ధర్మం కిందకు వస్తుంది? అట్టడుగు పేదల హక్కుల్ని అణిచి వేసి, అసమానతలు పెంచి ఆధిపత్య శక్తులు, పెట్టుబడిదారి వర్గాలకు ఆస్తులు కూడపెట్టేటువంటి సనాతన ధర్మం దేశానికి అవసరమా? చట్టం ముందు అందరూ సమానులేనని కుల, మత ప్రాంత, లింగ బేధం లేకుండా మనుషులందరూ సమా నమే అని చాటిన రాజ్యాంగ ధర్మం దేశానికి కావాలా నేటితరం మనసు పెట్టి ఆలోచించాలి. నిచ్చెన మెట్ల లాంటి కుల వ్యవస్థను వేల సంవత్సరాలుగా కొనసాగిస్తూ అవమానాలు అత్యధికులు భరించే విధంగా, కొద్దిమంది ఆధిపత్యం చెలాయించే విధంగా చూస్తున్న సనాతన ధర్మం దేశానికి పనికివ స్తుందా? సనాతన ధర్మంలో సర్వ సంపదలన్నీ ఆధిపత్యశక్తులకే ఉంటా యని చెప్పలేదా ఇన్నేళ్లుగా ఇదే జరుగుతుంది కదా! ఇటీవల దేశ ప్రధాని నరేంద్ర మోడీ జీ-20 సమావేశాలలో దేశంలో కొనసాగుతున్న సనాతన ధర్మం వల్ల దేశం ఎలా ముందుకు పోయిందో ఎందుకు వివరించలేకపోయారు. కులవ్యవస్థ వల్ల దేశానికి జరిగిన ప్రయోజనమేంటో ఎందుకు చెప్పలేక పోయారు? మహిళా అణిచివేత, మహిళలను మనుషులుగా చూడని తమ సనాతన ధర్మం గొప్పతనాన్ని ఎందుకు ప్రపంచ ప్రజానీకానికి చెప్పలేక పోయారు.మంచిదైతే వివరించాలి కదా!

సనాతన ధర్మం అంటే ఆధిపత్యం చెలాయించడం, అసమానతలను సుస్థిరం చేయడం, అవమానాల్ని, అన్యాయాలను, అబద్ధాలను పెంచి పోషించడం. నేటి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఆకాశామంత(చంద్రయాన్3) ఎత్తు ఎదిగిన తర్వాత కూడా, మధ్యయుగాల కాలం నాటి మూఢవిశ్వాసాలను పరమ పవిత్రంగా భావించడం సిగ్గుచేటు. సనాతన పాటించడమంటేనే పైన చెప్పిన మూడు వర్ణాలు లబ్ధి పొందడం కోసం, తమ రాజకీయ, ఆర్థిక, సామాజిక ప్రయోజనాలను సుస్థిరం చేయడం కోసం జరుగుతున్న రచ్చ. ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలు సమాజ అభివృద్ధికి, సామాజిక న్యాయానికి, సమానత్వానికి దోహదం చేస్తాయి. ఆయనకు అందరూ మద్దతివ్వాలి.

స్త్రీలను గౌరవించడం ఎన్నవ ప్రాథమిక విధి?



డాక్టర్ అలీ సార్, 9494228002
భారత రాజ్యాంగ నిపుణులు

1. ప్రాథమిక విధులకు సంబంధించి సరైన వాక్యం/ వాక్యాలు గుర్తించండి.
ఎ. వీటికి న్యాయ సంరక్షణ లేదు.
బి. కోర్టుల ద్వారా అమలు పరుచుకోడానికి వీలు కాదు.
సి. రాజ్యాంగ ప్రారంభంలోనే ప్రాథమిక విధులను 4(ఎ) భాగంలో పొందుపరిచారు.
1. ఎ మరియు బి. 2. సి మాత్రమే
3. ఎ మరియు సి 4. ఎ,బి,సి

2. ప్రాథమిక విధులను ఏ దేశ రాజ్యాంగం నుండి గ్రహించాము?
1. కెనడా 2. దక్షిణాఫ్రికా
3. అమెరికా 4. యుఎస్ఎస్ఆర్

3. క్రింది ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా భారత రాజ్యాంగంలో 51ఎ అధికరణలో ప్రాథమిక విధులను పొందుపరిచారు?
1. 44వ రాజ్యాంగ సవరణ చట్టం
2. 42వ రాజ్యాంగ సవరణ చట్టం
3. 23వ రాజ్యాంగ సవరణ చట్టం
4. 97వ రాజ్యాంగ సవరణ చట్టం

4. క్రింది వాటిలో సరైనవి గుర్తించండి?
1. ప్రారంభంలో ప్రాథమిక విధుల సంఖ్య 10.
2. వర్మ కమిటీ సిఫార్సుల మేరకు ప్రాథమిక విధులు రాజ్యాంగంలో పొందుపరిచారు.
3. 1 మరియు 2 4. ఏదికాదు.

5. "ప్రాథమిక విధులు కేవలం అలంకార పూర్వకమైనవి" అని అభివర్ణించిన వారు?
1. డి.డి. బసు 2. హెచ్.జె. లాస్కి
3. నానీ ఫాల్కీవాలా 4. కె.పి. ముఖర్జీ

6. క్రింది ఏ రోజును ప్రాథమిక విధుల దినోత్సవంగా ప్రకటించాలని వర్మ కమిటీ సూచించింది?
1. జనవరి 9 2. జనవరి 26
3. నవంబర్ 26 4. జనవరి 3

7. దేశవ్యాప్తంగా అన్ని సినిమా హాళ్లల్లో సినిమా ప్రారంభానికి ముందు జాతీయ గీతం ప్రదర్శించాలని దాన్ని గౌరవిస్తూ ప్రతి ఒక్కరూ నిలబడాలని సుప్రీంకోర్టు ఏ రోజున తీర్పునిచ్చింది.
1. 30 నవంబర్ 2016 2. 30 నవంబర్ 2018
3. 23 అక్టోబరు 2018 4. 23 అక్టోబరు 2017

8. ప్రాథమిక విధులు రాజ్యాంగంలో పొందుపర్చడం అనవసరం అని వ్యాఖ్యానించింది.
1. నానీ ఫాల్కీవాలా 2. డి.డి. బసు
3. సీకే దఫ్తరి 4. కె.పి. ముఖర్జీ

9. వర్మకమిటీ తన నివేదికను ఏ సం.లో ప్రభుత్వానికి అందించింది?
1. 1998 2. 1997
3. 1999 4. 1993


10. సినిమా ప్రారంభానికి ముందు జాతీయ గీతం ప్రదర్శించడం తప్పనిసరి కాదని ఈ రోజున సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది?
1. 23 అక్టోబరు 2017 2. 9 జనవరి 2018
3. 26 నవంబరు 2018 4. ఏది కాదు.

11. ప్రాథమిక హక్కులు విధులు అనేవి ఒక నాణానికి వున్న బొమ్మా, బొరుసు వంటివి అని అభివర్ణించినవారు ఎవరు?
1. డి.కె. బారువ 2. హెచ్.జె. లాస్కి
3. డి. డి. బసు 4. సి.కె. దఫ్తరీ

12. "6 నుండి 14 సం.ల మధ్య గల బాలబాలికలకు ప్రాథమిక విద్యను అందించడం తల్లిదండ్రుల బాధ్యత" ఈ విధి ఏ సం. నుండి అమల్లోకి వచ్చింది.
1. 2005 2. 2008
3. 2002 4. 2000

13. ప్రాథమిక విధులను తప్పనిసరిగా పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలని సుప్రీంకోర్టు క్రింది ఏ కేసులో తీర్పునిచ్చింది?
1. NC మెహతా Vs UOI 2. శతపతి Vs దాని
3. ఎ.కె. గోపాలన్ కేసు 4. కామన్ కాజ్ Vs UOI

14. 'ఆదేశిక సూత్రాల అమలు ప్రభుత్వాల చిత్తశుద్ధిపై ఆధారపడినట్లయితే ప్రాథమిక విధులు పాటింపు అనేది కూడా పౌరుల చిత్తశుద్ధిపై ఆధారపడి ఉంటుందని' అభివర్ణించినవారు?
1. ఇందిరాగాంధీ 2. కె.పి. ముఖర్జీ
3. డి.డి.బసు 4. హెచ్.జె. లాస్కి



15. వర్మ కమిటీ సిఫార్సులకు సంబంధించి క్రింది వాటిలో సరైనవి గుర్తించండి.
ఎ. ఉమ్మడి సంస్కృతిని గౌరవిస్తూ పరిరక్షించాలి.
బి. చిన్న చిన్న పుస్తకాలను ప్రచురించి ప్రాథమిక విధులను ప్రచారం చేయాలి.
సి. దూరదర్శన్, ఆకాశవాణి ద్వారా విధులను ప్రచారం చేయాలి.
1. ఎ మాత్రమే 2. బి మరియు సి
3. ఎ మరియు బి 4. ఏ.బి.సి

16. స్త్రీలను గౌరవించడం ఎన్నవ ప్రాథమిక విధి?
1.10 2. 8 3. 6 4. 5

17. క్రింది వాటిలో సరైన గుర్తించండి.
ఎ. ప్రాథమిక విధులకి సంబంధించిన బిల్లుని పార్లమెంటులో హెచ్ ఆర్ గోఖలే ప్రవేశపెట్టారు.
బి. స్వరణ్ సింగ్ కమిటీ పది ప్రాథమిక విధులను సూచించింది.
1. ఎ మాత్రమే 2. బి మాత్రమే
3. ఎ. బి 4. ఏది కాదు.

18. క్రింది వాటిలో సరి కాని జతను గుర్తించండి..
1. అటవీ సంరక్షణ చట్టం 1980.
2. పౌరహక్కుల పరిరక్షణ చట్టం 1976
3. నీటి కాలుష్య నివారణ నియంత్రణ చట్టం 1972
4. పై ఏది కాదు.

19. ప్రాథమిక విధులు అమలుకు భారత ప్రభుత్వం రూపొందించిన జాతీయ గౌరవాలను అగౌరవపరుచుటను నివారించు చట్టం ఏ సం. లో చేశారు?
1 1972 2. 1971
2 1951 4. 1974

20. ప్రాథమిక విధులు ఏ సం. నుండి అమల్లో వచ్చాయి?
1 1977 2. 1978
2. 1974 4. 1985

21. ప్రాథమిక విధులు అసంబద్ధంగా మరియు గందరగోళంగా ఉన్నాయి అని వ్యాఖ్యానించింది?
1. సి.కె. దఫ్తరీ 2. నానీ ఫాల్కీవాలా
3. ఇందిరాగాంధీ 4. హెచ్.జె. లాస్కీ

22. 6-14 లోపు బాలబాలికలకు సంబంధించిన నిర్బంద విద్యకు సంబంధించిన రాజ్యాంగ సవరణ ఏది?
1. 81వ రాజ్యాంగ సవరణ చట్టం
2. 97వ రాజ్యాంగ సవరణ చట్టం
3. 86వ రాజ్యాంగ సవరణ చట్టం
4. 91వ రాజ్యాంగ సవరణ చట్టం

23. క్రింది వాటిలో స్వరణ్ సింగ్ సిఫార్సులలో వేటిని ప్రాథమిక విధులలో చేర్చలేదు.
ఎ. సకాలంలో పన్నులు చెల్లించుట
బి. ప్రాథమిక నిధులు పాటించని వారిపై చర్యలు.
1. ఎ మాత్రమే 2. బి మాత్రమే
3. ఎ, బి 4. ఏదీ కాదు

24 అన్ని విద్యాసంస్థల్లో ప్రాథమిక విధులు అంశాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని ఏ కమిటీ సూచించింది?
1. సప్రూ కమిటీ 2. రంగరాజన్ కమిటీ
3. స్వరణ్ సింగ్ కమిటీ 4. వర్మ కమిటీ

25. జతపరుచుము.

చట్టం	సంవత్సరం
ఎ. వన్యప్రాణి రక్షణ చట్టం	1. 1951
బి. జాతీయ గౌరవ చిహ్నాల గుర్తింపు చట్టం	2. 1980
సి. అటవీ పరిరక్షణ చట్టం	3. 1986
డి. పర్యావరణ పరిరక్షణ చట్టం	3. 1972

1. ఎ4, బి3, సి2, డి1 2. ఎ1, బి2, సి3, డి4
3. ఎ4, బి1, సి2, డి3 4. ఎ4, బి2, సి1, డి3

26. ఈ క్రింది వాటిలో ప్రాథమిక విధి కానిది ఏది?
1. జాతీయ సేవలో పాల్గొనాలి.
2. దేశ సార్వభౌమాధికారము సమగ్రతను పరిరక్షించాలి.
3. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలి.
4. ప్రపంచ శాంతికి కృషి చేయాలి.

27. ఎన్నవ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా 10 ప్రాథమిక విధులను రాజ్యాంగంలో చేర్చారు?
1. 86వ రాజ్యాంగ సవరణ చట్టం
2. 25వ రాజ్యాంగ సవరణ చట్టం
3. 42వ రాజ్యాంగ సవరణ చట్టం
4. 44వ రాజ్యాంగ సవరణ చట్టం

సమాధానాలు

1.1	2.4	3.2	4.1	5.4
6.4	7.1	8.3	9.3	10.1
11.2	12.3	13.1	14.3	15.2
16.4	17.1	18.3	19.2	20.1
21.2	22.3	23.3	24.4	25.3
26.4	27.3			

కరెంట్ అఫైర్స్



- కె. నాగార్జున
కరెంట్ ఎఫైర్స్ సీనియర్ ఫ్యాకల్టీ
9490352545

స్వయం సహాయక సంఘాల పొదుపులో ఏ.పి. అగ్రస్థానం : ఆంధ్రప్రదేశ్ లోని స్వయం సహయక బృందాలు (ఎస్.హెచ్.జి) లు పొదుపు మరియు క్రెడిట్ లింకేజీ రెండింటిలోనూ దేశవ్యాప్తంగా అగ్రస్థానాన్ని సంపాదించి విజయవంతమైన ట్రాక్ రికార్డ్‌ను ప్రదర్శించాయి. దేశవ్యాప్తంగా స్వయం సహయక సంఘాల బ్యాంకు లింకేజి కార్యక్రమం, పొదుపు సంఘాల పనితీరుపై నాబార్డు 2022 - 23 వార్షిక నివేదిక సెప్టెంబర్ 15న విడుదల చేసింది. దేశంలోని పొదుపు సంఘాలు ఆంధ్రప్రదేశ్ అత్యధిక పొదుపు రికార్డును నెలకొల్పిందని, ఈ విషయంలో రాష్ట్రంలోని పొదుపు సంఘాలు ముందున్నాయని నివేదిక పేర్కొంది. 2022 - 23 మార్చి నాటికి దేశంలో పొదుపు సంఘాల ద్వారా సేకరించిన మొత్తం పొదుపు 58,892.68 కోట్లు. ఇందులో ఆంధ్రప్రదేశ్ 18,606.18 కోట్ల పొదుపుతో అగ్రగామిగా నిలబడిందని నివేదిక పేర్కొంది.




ఓంకారేశ్వర్‌లో 108 అడుగుల ఆదిశంకరాచార్య విగ్రహం : మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ నెల 18న ఓంకారేశ్వర్‌లో 108 అడుగుల ప్రముఖ తత్వవేత్త ఆదిశంకరాచార్యులు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఏక్తమాకి ప్రతిమా (ఏకత్వం యొక్క విగ్రహం) అని పిలువబడే ఈ స్మారక ప్రాజెక్టుకు మధ్యప్రదేశ్ కేబినెట్ 2,141 కోట్లకు పైగా గణనీయమైన బడ్జెట్‌ను కేటాయించింది. ఇందులో 'అద్వైత్ లోక్' అనే మ్యూజియం మరియు 36 హెక్టార్ల విస్తీర్ణంతో అద్వైత్ ఫారెస్ట్‌ను కూడా ఏర్పాటు చేస్తారు.



కేరళలో మంసారి 'నిపా' వైరస్ విజృంభణ : దేశంలో మరోసారి నిపా వైరస్ విజృంభించింది. నిపా వైరస్ సోకి కేరళలో ఇద్దరు మృతి చెందడం ఆందోళనకు గురి చేస్తోంది. దీంతో కేరళలో ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. వైరస్ కారణంగా మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చేర్చారు. 2018, 2021 లో కోజికోడ్ జిల్లాలోనే నిపా వైరస్ కారణంగా పలువురు మరణించారు. మనదేశంలో మొదటిసారి 2001 లో బెంగాల్‌లోని సిలిగురిలో నిపా వైరస్ వెలుగు చూసింది. ఆ తర్వాత 2007లో కేరళ లో కన్పించింది. ఇది ప్రధానంగా మెదడు వాపుకు కారణమవుతుంది. నిపా వైరస్‌ను ఎన్.ఐ.వి. అంటారు. ఇది ఒక రకమైన ఆర్.ఎన్.ఎ. వైరస్. 'కాంపంగ్ ఘంగై నిపా' అనే చోట 1998లో వ్యాపించడంలో ఆ ప్రదదేశం పేరిట నిపా గా పిలుస్తున్నారు.



TIME 100 next 2023 నవ్య సారధుల జాబితాలో హర్‌మన్ ప్రీత్ : భిన్న రంగాల్లో విశేష కృషి చేస్తూ ప్రపంచ గతినే మార్చే కొత్త తరం సారధుల జాబితా అంటూ ప్రఖ్యాత మ్యాగజైన్ టైమ్ తీసుకొచ్చిన జాబితాలో భారతీయ మహిళ క్రికెటర్ హరమన్ ప్రీత్ స్థానం దక్కించుకున్నారు. 2023 టైమ్ 100 నెక్ట్ : ది ఎమర్జింగ్ లీడర్స్ షేపింగ్ ది వరల్డ్ పేరిట 100 పేర్లలో ఈ జాబితాను సిద్ధం చేశారు. 'ఆటలో పోటీతత్వం, రగిలిపోయే క్రీడాసక్తితో హర్‌మన్ ప్రీత్ మహిళా క్రికెట్‌ను ప్రపంచంలో విలువైన క్రీడా ఆస్తిగా మలిచారు" అని టైమ్ పొగిడింది.



లిబియా మృతులు 11 వేలు పైనే : లిబియలో డెర్నా లో సంభవించిన వరదల్లో మృతుల సంఖ్య 11 వేలు దాటింది. జాడ తెలియకుండా పోయిన మరో 10 వేలమంది కోసం అన్వేషణ సాగుతుంది. నివాస ప్రాంతాలను తుడిచిపెట్టిన వరద, మట్టి తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. భారీ వర్షాలు, వరదలతో ఎగువనున్న జలాశయాలు బద్దలై ఒక్కసారిగా డెర్నా నగరాన్ని నీటి ప్రవాహం ముంచెత్తింది.



గోల్డెన్ టికెట్ అందుకున్న సచిన్ : భారత్‌లో జరిగే వన్డే వరల్డ్ కప్ ప్రత్యేక అతిథులుగా ఎంపిక చేసిన కొందరు ప్రముఖులకు బి.సి.సి.ఐ. వరుసగా 'గోల్డెన్ టికెట్' ఇచ్చి మ్యాచ్‌లకు ఆహ్వానిస్తుంది. ఇటీవలే నటుడు అబితాబ్ బచ్చన్‌కు ఈ టికెట్ అందించిన బోర్డు కార్యదర్శి జైషా తాజాగా క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌కు 'గోల్డెన్ టికెట్' అందించారు.



SIIMA awards 2023 - ఉత్తమ నటుడు జూనియర్ ఎన్టీఆర్ : ప్రతిష్టాత్మక సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్ 2023 వేడుక దుబాయ్‌లో ప్రారంభం అయింది. దక్షిణాది చిత్ర పరిశ్రమకు చెందిన చిత్రాలు, నటుల సాంకేతిక నిపుణుల ప్రతిభను గుర్తించి ఇచ్చే ప్రతిష్టాత్మక అవార్డు సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ (సైమా). గత పదేళ్లగా కొనసాగుతున్న ఈ అవార్డులలో ప్రస్తుతం RRR సినిమా ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్టేజీలమీద ఆస్కార్‌తో సహా ఎన్నో అవార్డులను అందుకున్న ఈ సినిమా సైమాలో కూడా రివార్డులను బ్రేక్ చేసింది.
ఉత్తమ చిత్రం : సీతారామం
ఉత్తమ దర్శకుడు : ఎస్.ఎస్.రాజమౌళి (RRR), ఉత్తమ నటుడు - జూనియర్ ఎన్టీఆర్ (RRR)
ఉత్తమ నటి - శ్రీలీల (దహిక)